సోమవారం
12•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 274
• పేజీలు : 16 + (20/16)

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



సంగారెడ్డి జిల్లాకేంద్ర వైద్యశాలలో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చిన మహిళకు ఆదివారం కేసీఆర్ కిట్లు అందజేస్తున్న జేసీ వాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఒక కాన్పు.. మూడు కేసీఆర్ కిట్లు!

సంగారెడ్డి అర్బన్, నమస్తే తెలంగాణ/ సంగారెడ్డి మున్సిపాలిటీ: పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఆశారాణికి గురువారం ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారు. వీరిలో ఒక మగ, ఇద్దరు ఆడశిశువులు ఉండగా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్ర వైద్యశాలలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో ఆదివారం జేసీ వాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కటి చొప్పున మూడు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రత్యేక అధికారి గాయత్రిదేవి, ఐసీడీఎస్ పీడీ మోతి తదితరులు పాల్గొన్నారు.

పెరుగనున్న వడగాలుల తీవ్రత

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రానున్న రెండురోజులపాటు వడగాలుల తీవ్రత క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం తోపాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. మరోవైపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 18 డిగ్రీల నుంచి 20 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. అత్యధికంగా భద్రాచలం, మహబూబ్‌నగర్‌ల్లో సాధారణం కంటే 2 డిగ్రీలు పెరిగి 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఆదిలాబాద్, మెదక్‌లో 37 డిగ్రీలు, హన్మకొండ, నిజామాబాద్, రామగుండంలో 36 డిగ్రీలు, నల్లగొండ, హకీంపేటలో 35 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

జూన్ నుంచి రైతు బీమా

మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్2 నుంచి రైతు బీమా అమలు చేయాలని నిర్ణయించినట్టు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. రైతు బీమా అమలుపై శనివారం ఎల్ఐసీ సంస్థ ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఏప్రిల్ నుంచి రైతు బీమా వర్తింపజేయాలని భావించిన విషయం తెలిసిందే. అయితే, ఏప్రిల్ నుంచి కాకుండా జూన్2నుంచి రైతు బీమాను అమలుచేయాలని నిర్ణయించినట్టు మంత్రి వివరించారు.



ఆదివారం తెలంగాణభవన్‌లో పార్టీ రాజ్యసభ అభ్యర్థులను పరిచయం చేస్తున్న టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో రాజ్యసభ అభ్యర్థులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్, ఎంపీలు కే కేశవరావు, జితేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.




తెలంగాణభవన్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి వందనం సమర్పిస్తున్న టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్. చిత్రంలో లింగయ్య యాదవ్ ఉన్నారు.



టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆయన సోదరి, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై డిప్యూటీ సీఎం హర్షం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు జరుగనున్న ఎన్నికలకు టీఆర్ఎస్ ఎంపికచేసిన ముగ్గురు అభ్యర్థుల పట్ల డిప్యూటీ సీఎం మహమూద్ అలీ హర్షం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్‌కు అవకాశం కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. సరైన అభ్యర్థులను రాజ్యసభకు సీఎం కేసీఆర్ ఎంపికచేశారని చెప్పారు. మూడో అభ్యర్థి కోసం చివరివరకు మైనారిటీ అభ్యర్థిపేరు ప్రచారంలో ఉన్న విషయాన్ని మీడియా ప్రస్తావించగా, వచ్చే రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైనారిటీలకు అవకాశమిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ తెలిపారు.



ఉద్యమవారధికి టికెట్ హర్షణీయం

తెలంగాణ ఉద్యమంలో అందరికీ అందుబాటులో ఉండి, పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య వారధిగా ఉన్న జోగినిపల్లి సంతోష్‌కుమార్‌కు రాజ్యసభ టిక్కెట్ కేటాయించడం హర్షణీయం.

- దేవీప్రసాద్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

రాజ్యసభ సీట్లు బీసీలకు ఇవ్వడం హర్షణీయం



మూడు రాజ్యసభ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించడం హర్షణీయమని సంచారజాతుల సంఘం జాతీయ కన్వీనర్ గుంటిపల్లి వెంకట్, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. యాదవులకు రాజ్యసభ సీటు కేటాయిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గతంలోనే ప్రకటించారని, ఆ హామీని నిలబెట్టకోవడమే కాకుండా బీసీలకు మరోస్థానాన్ని కూడా కేటాయించి బీసీ పక్షపాతి అనేది చాటుకున్నారని తెలిపారు.

- గుంటిపల్లి వెంకట్, జాజుల శ్రీనివాస్

ముహూర్తం



సూర్యోదయం: 6.30 గంటలకు



సూర్యాస్తమయం: 6.22 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం దశమి ఉదయం 11.16 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం: పూర్వాషాఢ ఉదయం 9.35 వరకు తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: తె. 4.10 నుంచి 5.46 వరకు, రాహుకాలం: ఉదయం 7.59 నుంచి 9.28 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.02 నుంచి 12.50 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.12 నుంచి 3.59 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.34 నుంచి రాత్రి 8.10 వరకు.

లోకం పోకడ



శివసేన దూరం, అకాలీదళ్ మౌనం, టీడీపీ గుస్సా, పీడీపీ విభేదం.. ఇంకోటి అలక, మరోటి కోపం...

రేపటి నుంచి ఏఈఈ ఇంటర్వ్యూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ విభాగాల్లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ ఇంటర్వ్యూలకు సంబంధించిన పూర్తి వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశామని పేర్కొన్నది.

స్టాఫ్‌నర్స్ రాతపరీక్షకు 99.9% హాజరు

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం జరిగిన ఆన్‌లైన్ పరీక్షకు 99.9% మంది హాజరైనట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. 21,400 మంది అభ్యర్థులకు 21,391 మంది హాజరయ్యారని పేర్కొన్నది. ఎనిమిది స్క్వాడ్ బృందాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరీక్షలను పర్యవేక్షించినట్లు చెప్పింది.

రెండో ఏడాది టీ సాట్ బోధన ప్రసారాలు

- రేపటినుంచి మే 5 వరకు రోజూ 9 గంటల బోధన
- టీ సాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం టీ సాట్ బోధన ప్రసారాలను అందిస్తామని టీ సాట్ సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది తరహాలో ఈసారి కూడా ఎంసెట్, నీట్, ఐఐటీ మెయిన్స్‌కు సంబంధించిన ప్రసారాలను కొనసాగిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 13 నుంచి మే 5వ తేదీవరకు టీ సాట్, టీ నిపుణ, విద్య చానళ్లలో పరీక్షలకు సంబంధించిన ప్రసారాలను చేయనున్నట్టు వివరించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రోజుకు 9 గంటలు ప్రసారం చేస్తామన్నారు. మొత్తం 500 గంటలు ప్రసారాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. టీ సాట్ శాటిలైట్ చానళ్లతోపాటు టీ సాట్ యూట్యూబ్, వెబ్‌సైట్, యాప్‌లో కూడా ప్రసారాలను చూడొచ్చని సీఈవో పేర్కొన్నారు. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

నేటినుంచి పాస్‌పుస్తకాల ముద్రణ

- రూ.157కు ముద్రించడానికి సిద్ధమైన కంపెనీలు
- ఐదు ప్రింటర్లకు ముద్రణ బాధ్యతలు
- ఆరువారాల్లో ముద్రిత పుస్తకాల అప్పగింత
- రైతుల అకౌంట్లు సిద్ధంచేసిన సీసీఎల్ఏ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణ మొదలైంది. ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు ఇప్పటికే ముద్రణకు కావాల్సిన మెటీరియల్‌ను ఆర్డర్ ఇచ్చాయి. సోమవారం నుంచి ముద్రణకు సర్వం సిద్ధమైంది. సీసీఎల్ఏ అధికారులు కూడా సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లకు పాస్‌పుస్తకంలో ముద్రించే సమాచారం ఇవ్వనున్నారు. కంప్యూటరీకరించిన దాదాపు 50 లక్షల మంది రైతుల సమాచారాన్ని సోమవారం ప్రింటర్లకు అందించనున్నారు. మిగిలిన సమాచారాన్ని ఒకటి రెండు రోజుల్లో అందిస్తారు. పాస్ పుస్తకాల ముద్రణకు ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్ టీఎస్) ద్వారా షార్ట్ టెండర్లు పిలువగా ఎనిమిది సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. ఇందులో మద్రాస్ సెక్యూరిటీ ప్రింటర్స్, కేఎల్ హై టెక్ సెక్యూరిటీ ప్రింటర్స్, హైటెక్ సెక్యూరిటీ ప్రింటర్స్, శ్రీనిధి సెక్యూరిటీ ప్రింటర్స్, మణిపాల్ సెక్యూరిటీ ప్రింటర్స్ అనే ఐదు సంస్థలు పాస్ పుస్తకాల ముద్రణకు అర్హత సాధించాయి. ఒక్కో పాస్ పుస్తకాన్ని రూ.157కు ముద్రించడానికి ప్రింటర్లు ముందుకొచ్చారు. ఈ మేరకు అగ్రిమెంట్ కూడా పూర్తయింది. ఒక్కోసంస్థ రోజుకు 50 వేల చొప్పున ఐదు సంస్థలు కలిపి మొత్తం 2.50 లక్షలు ముద్రిస్తాయి. ఆరువారాల్లో మొత్తం 72 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలు ముద్రించి ప్రింటర్లు ప్రభుత్వానికి అందజేస్తారు. పాస్ పుస్తకాలను గ్రామాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రింటర్లదే. 18 రకాల భద్రతా ఫీచర్లతో పాస్‌పోర్టు తరహాలో ముద్రిస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలపై తహసీల్దార్ల డిజిటల్ సంతకాలు ఉంటాయి. ఈ పాస్ పుస్తకాల ద్వారా కోర్ బ్యాంకింగ్ విధానం అమలులోకి వస్తుంది. దీంతో ఎవరైనా భూములు అమ్మినా, కొన్నా వాటిని వెంటనే పాస్ పుస్తకాల్లో ఎంట్రీ చేస్తారు. పాట్టాదార్ పాస్ పుస్తకంలోనే భూయాజమాన్య హక్కు పత్రం కూడా ఉంటుంది.

రూ.250 ఇవ్వాలని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ పేచీ

పాస్ పుస్తకాల ముద్రణకు తొలుత కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ముందుకొచ్చింది. ఒక్కో పుస్తకాన్ని రూ.200లకు ముద్రించడానికి మొదట ఒప్పందం చేసుకొని ఆ తర్వాత రూ.250 ఇస్తేనే ముద్రిస్తానని మొండికేసింది. దీంతో ప్రభుత్వం ఫిబ్రవరి 23న అగ్రిమెంట్‌ను రద్దుచేసి షార్ట్ టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో ప్రింటర్లు ఒక్కో పాస్‌పుస్తకాన్ని రూ.157కు ముద్రించడానికి ముందుకొచ్చారు. దీంతో ప్రభుత్వానికి ఒక్కో పుస్తకంపై రూ.93 ఆదా అయింది.

నిర్వాసితుల త్యాగాలు గొప్పవి

- మీకెంత చేసినా తక్కువే..ప్రతి హామీని అమలుచేస్తాం
- రైతుల కుటుంబాల్లో వెలుగుల ఘనత సీఎం కేసీఆర్, నిర్వాసితులదే
- నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంసలు
- సిద్దిపేట జిల్లా తున్కిబొల్లారం, ముట్రాజ్‌పల్లిలో ముంపు గ్రామాల గృహ సముదాయాలకు భూమిపూజ



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లిలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాల కుటుంబాల గృహ సముదాయాలకు ఆదివారం భూమిపూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'ముంపు గ్రామాల ప్రజల త్యాగాలు గొప్పవి.. మీకెంత చేసిన తక్కువే.. మీ పుణ్యం వట్టిగా పోదు'అని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తున్కిబొల్లారంలో కొండపోచమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాల్లోని 1,087 కుటుంబాలు, ముట్రాజ్‌పల్లిలో మల్లన్నసాగర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల్లోని 3,319 కుటుంబాల పునరావాస గృహాల సముదాయాల(డబుల్ బెడ్‌రూం ఇండ్లు)కు కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డిలతో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం తున్కిబొల్లారం, ముట్రాజ్‌పల్లిలో జరిగిన సభల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ కింద ఏడు లక్షలు, కొండపోచమ్మ రిజర్వాయర్ కింద 2 లక్షల 85 వేల 280 ఎకరాలకు సాగు నీరు పారుతుందని చెప్పారు. కొన్ని లక్షల రైతుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్, ముంపు గ్రామాల ప్రజలదేనని ప్రశంసించారు. ముంపు గ్రామాల ప్రజల బాధేంటో సీఎం కేసీఆర్‌కు తెలుసని, బాధిత కుటుంబాల అవసరాలన్నింటిని తీరుస్తామని హామీఇచ్చారు. సమస్యలుంటే నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. గజ్వేల్ పక్కన విలువైన స్థలంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తున్నామని, సకల సౌకర్యాలను సమకూర్చుతామని చెప్పారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఇస్తామని, 18 ఏండ్లు నిండిన వారికి కూడా ఇంటి స్థలం అందజేస్తామని తెలిపారు. ఒక్కో కుటుంబానికి 250 గజాల చొప్పున స్థలం కేటాయించినట్లు వివరించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల తాళం చెవులు తీసుకొని, ముంపు ఇండ్లు ఖాళీ చేయాలని సూచించారు.

డబ్బులు వృథా చేసుకోకండి

'దండం పెట్టి చెబుతున్నా.. డబ్బులు వృథా చేసుకోకండి.. మీకు రావాల్సిన డబ్బులన్నీ ప్రభుత్వం ఇస్తుంది. ఈ డబ్బులను కుటుంబ సభ్యులతో చర్చించి ఉపయోగించుకోండి'అని నిర్వాసితులకు మంత్రి హరీశ్‌రావు సూచించారు. ప్రతి రూపాయి మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. ముంపు గ్రామాలకు పంట పెట్టుబడి ఇవ్వాలని ప్రజాప్రతినిధులు అడుగుతున్నారని, ఇవ్వడంలో అభ్యంతరం లేదని చెప్పారు. ఆ భూమిలో మట్టి తీసి కట్టకు పోయాల్సి ఉంటుందని, దాన్ని అడ్డుకోకుండా ఉంటే సహాయం చేయడానికి ముందుంటానని, పెట్టుబడిపై కలెక్టర్‌తో మాట్లాడి అందిస్తానని హామీ ఇచ్చారు.

మత్స్య సంపదపై సర్వహక్కులు

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కింద కోట్ల రూపాయల మత్స్య సంపద వస్తుందని, దీనిపై సర్వ హక్కులు ముంపు బాధితులకే ఉంటుందని హరీశ్‌రావు స్పష్టంచేశారు. సొసైటీని ఏర్పాటుచేసి వచ్చిన ఆదాయాన్ని ఏటా బ్యాంకుఖాతాలో జమయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల ప్రజలు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గడ అధికారి హన్మంతరావు, జేసీ పద్మాకర్, ఆర్డీవోలు ముత్యంరెడ్డి, విజయేందర్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రాచకొండ వరకు కృష్ణమ్మ!

- శివన్నగూడెం నుంచి ఐదు టీఎంసీల లిఫ్టునకు కసరత్తు
- మునుగోడు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం పరిధుల్లోని చెరువులకు జలకళ
- సమగ్ర సర్వే కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిండి ఎత్తిపోతల పథకాన్ని మరింత పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఇప్పటివరకు డిజైన్ ప్రకారం నల్లగొండ జిల్లా శివన్నగూడెం వరకు కృష్ణాజలాల తరలింపు ఉండగా.. తాజాగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధులకు కూడా విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా కృష్ణాజలాలను దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు తరలించేందుకు ఇప్పటికే పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో చివరగా నల్లగొండ జిల్లా శివన్నగూడెం వద్ద భారీ రిజర్వాయర్ నిర్మాణం జరుగుతున్నది. వాస్తవంగా కృష్ణాజలాల తరలింపు అనేది అక్కడితోనే ముగుస్తుంది. కానీ, తాజాగా మరికొన్ని ప్రాంతాల్లో తాగు, సాగునీటి సరఫరా కోసం జలాల తరలింపును విస్తరించాలని నిర్ణయించారు. దీనిపై తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు గతంలోనే ప్రాథమికంగా సర్వే పూర్తిచేశారు. దీని ప్రకారం శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి ఐదు టీఎంసీలను లిఫ్టుచేసి, ఒకవైపు రాచకొండ.. మరోవైపు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు నీటిని తరలించాలని చూస్తున్నారు. ఎక్కువ వ్యయం, నిర్మాణాలు కానీ లేకుండా సహజంగా ఏర్పాటైన వాగులు, వంకలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. శివన్నగూడెం నుంచి లిఫ్టుచేసిన నీటిని చెరువులకు ఎగువన ఉండే స్ట్రీం (వంకలు)లో వదలాలని నిర్ణయించారు. ఇలా గొలుసుకట్టుగా సాధ్యమైనంత మేర చెరువులను నింపుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనిద్వారా పూర్వవైభవాన్ని కోల్పోతున్న ఇబ్రహీంపట్నం చెరువుకు కూడా జీవం రానుంది.

త్వరితగతిన అనుమతికి హామీ..

ఈ ప్రతిపాదనపై సమగ్ర సర్వే కోసం నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది.ఎక్కడెక్కడ లిఫ్టులు ఏర్పాటు చేయాలి? లిఫ్ట్‌చేసిన నీటిని ఎక్కడ వదలాలి? ఎంత ఆయకట్టుకు మేలు జరుగుతుంది? ఎంత వ్యయం అవుతుందనే సమగ్ర వివరాల కోసం సర్వే జరుగాల్సి ఉంది. సమగ్ర సర్వేకోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతిని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హరీశ్‌రావు ఇటీవల హామీ ఇచ్చారని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ (ట్రీ) ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని సేకరించేందుకుగాను నార్లాపూర్ నుంచి ఉల్పర మీదుగా రూపొందించిన అలైన్‌మెంట్‌ను స్వయంగా సమీక్షిస్తానని కూడా మంత్రి స్పష్టం చేశారన్నారు.

సోమవారం
12•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE


జోగినిపల్లి సంతోష్‌కుమార్


బండ ప్రకాశ్


బడుగుల లింగయ్య యాదవ్


ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే

సంతోష్‌కుమార్ లింగయ్య యాదవ్ బండ ప్రకాశ్

మూడుస్థానాల్లో రెండు బీసీలకు కేటాయింపు

మాట నిలబెట్టుకొన్న సీఎం కేసీఆర్

నేడు నామినేషన్లు దాఖలు చేయనున్న ముగ్గురు అభ్యర్థులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రం నుంచి ఎన్నికలు జరిగే మూడు రాజ్యసభ స్థానాలకు తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) తన అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారం జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్‌లను రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. అనంతరం వారిని టీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ సభ్యులకు పరిచయం చేశారు. వీరు ముగ్గురు సోమవారం తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. టీఆర్ఎస్ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థుల్లో బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్ బలహీన వర్గాలకు చెందినవారుకాగా, జోగినిపల్లి సంతోష్‌కుమార్ టీఆర్ఎస్ స్థాపించడానికి ముందునుంచీ కేసీఆర్ వెన్నంటి ఉన్నారు. రాజ్యసభ టిక్కెట్ల కేటాయింపులో టీఆర్ఎస్ పార్టీ బడుగు బలహీనవర్గాలకు మరోసారి పెద్దపీటవేసింది. మూడు స్థానాల్లో రెండింటిని వారికి కేటాయించి బలహీనవర్గాలకు

మిగతా 4వ పేజీలో

కోటా కోసం కొట్లాటే!

రిజర్వేషన్లకోసం త్వరలో ఢిల్లీలో ధర్నా: సీఎం కేసీఆర్

- అధికారం కోసమే కాదు.. సమస్యల ప్రాతిపదికన ఫ్రంట్
- థర్డ్‌ఫ్రంట్ కాదు.. మొదటిఫ్రంట్ మనదే
- టీఆర్ఎస్ ఎల్పీ భేటీలో తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్
- కేసీఆర్ జాతీయ రాజకీయాలకు టీఆర్ఎస్ఎల్పీ మద్దతు
- రాజ్యసభలో మూడు సీట్లూ మనవే
- అభ్యర్థులను పరిచయం చేసిన కేసీఆర్
- శాసనసభ నుంచి సస్పెండ్ కావాలనే ప్రతిపక్షం ఆలోచన
- ఇలాంటి ప్రతిపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్య

రాష్ట్రంలో 106 సీట్లు గెలుస్తాం • మూడుసార్లు సర్వే చేయించాం

సిట్టింగ్‌లందరికీ సీట్లు ఖాయం • కొత్తవాళ్లు ఇంతకంటే గొప్పోళ్లు రారు

> “ రాష్ట్రంలో ఉంటూనే దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెస్తా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశ రాజకీయాల్లో నూతన ఒరవడి, గుణాత్మకమైన మార్పే ఎజెండాగా.. జాతీయ రాజకీయాల కార్యాచరణ ఉంటుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. రాష్ట్రంలో ఉంటూనే జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేయనున్నట్టు ప్రకటించారు. అందరి మద్దతుతో దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొస్తామని చెప్పారు. 'మనది థర్డ్‌ఫ్రంట్ కాదు.. మొదటి ఫ్రంట్ మనదే అవుతుంది. ఆ రెండు జాతీయ పార్టీలు ప్రజల అవసరాలు తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయి' అని సీఎం అన్నారు. రిజర్వేషన్లను పెంచుకునే అధికారాన్ని రాష్ట్రాలకు అప్పగించాలని కోరుతూ త్వరలో ఢిల్లీలో ధర్నా చేయనున్నట్టు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఇక్కడితోనే వదిలివేయబోమని స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా కేవలం అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాకుండా సమస్యల ప్రాతిపదికన ఫెడరల్ ఫ్రంట్ సమీకరణాలుంటాయని చెప్పారు. ప్రజలే లక్ష్యంగా ప్రజల ఎజెండాతో ఫ్రంట్ ఏర్పాటవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభా పక్ష సమావేశం సీఎం కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై సీఎం కేసీఆర్.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రాజకీయాల్లో పోషించనున్న పాత్ర, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై సీఎం వివరించారు.

106 సీట్లు ఖాయం: రాష్ట్రంలో 2019లో జరుగబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ 106 సీట్లు ఖాయంగా గెలుస్తుందని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ తిరిగి సీట్లు ఇస్తామని, ఇందులో

మిగతా 4వ పేజీలో

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు


అంజనీ కుమార్
హైదరాబాద్ పోలీస్ కమిషనర్


సజ్జన్నార్
సైబరాబాద్ పోలీస్ కమిషనర్

స్వాతి లక్రాకు అదనపు బాధ్యతలు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీచేశారు. ఇప్పటివరకు ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా ఐపీఎస్ అధికారుల బదిలీలపై దృష్టి సారించింది. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ బాధ్యతలను అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న అంజనీకుమార్‌కు అప్పగించారు. సైబరాబాద్ కమిషనర్‌గా సజ్జన్నార్‌ను నియమించారు. వీరితోపాటు పలువురు సీనియర్ అధికారులను కీలక స్థానాల్లోకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా జరిగిన 38 మంది ఐపీఎస్ అధికారుల బదిలీల్లో పలువురికి స్థానచలనం కలిగింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
1. టీ కృష్ణప్రసాద్	డీజీ (రైల్వేస్,రోడ్ సేఫ్టీ)	డీజీ (రోడ్ సేఫ్ట్ అథారిటీ)
2. సంతోష్‌మెహ్రా	అడిషనల్ డీజీపీ	డైరెక్టర్ – ఆర్‌బీవీఆర్‌ఆర్ పోలీస్ అకాడమీ
3. అంజనీకుమార్	అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్)	కమిషనర్– హైదరాబాద్ సిటీ
4. ఎం గోపీకృష్ణ	అడిషనల్ డీజీపీ (ఆర్గనైజేషన్)	డీజీ (ఫైర్ సర్వీసెస్)
5. రాజీవ్ రతన్	---	అడిషనల్ డీజీపీ (ఆర్గనైజేషన్)
6. జితేందర్	---	అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్)
7. సందీప్ శాండిల్య	కమిషనర్ (సైబరాబాద్)	అడిషనల్ డీజీపీ (రైల్వే&రోడ్ సేఫ్టీ) పదోన్నతి
8. సౌమ్యమిశ్రా	ఐజీ (వెల్ఫేర్ నుంచి బదిలీ)	(కేటాయించలేదు)
9. శిఖాగోయల్	ఐజీ (సీఐడీ)	ఏసీపీ (క్రైమ్స్, సిట్)
10. స్వాతిలక్రా	ఐజీ (లా అండ్ ఆర్డర్)	ఐజీ (లా అండ్ ఆర్డర్– షీటీమ్స్, మహిళా రక్షణ, భరోసా ఇంచార్జి – అదనపు బాధ్యతలు)
11. వీవీ నివాసరావు	అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్)	(చైర్మన్– తెలంగాణ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్)
12. అనిల్ కుమార్	వెయిటింగ్	అడిషనల్ ఏసీపీ (ట్రాఫిక్– హైదరాబాద్)

మిగతా 4వ పేజీలో

నేటి నుంచి అసెంబ్లీ

ఉదయం 10 గంటలకు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

ఉభయసభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్.. అనంతరం కౌన్సిల్, అసెంబ్లీ బీఏసీ : షెడ్యూలు ఖరారు


బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ తొమ్మిదో సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉదయం పది గంటలకు అసెంబ్లీ హాలులో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగిస్తారు. అసెంబ్లీ ప్రాంగణంలో గవర్నర్‌కు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంత నరసింహాచార్యులు స్వాగతం పలుకుతారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం ఉభయసభలు వాయిదా పడుతాయి. ఆ తర్వాత శాసనమండలి, శాసనసభల కార్యకలాపాల సలహా సంప్రదింపుల కమిటీ (బీఏసీ) లు.. మండలి చైర్మన్ కే స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి అధ్యక్షతన భేటీ అయి బడ్జెట్ సమావేశాల షెడ్యూలును ఖరారుచేస్తాయి. బడ్జెట్ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి, సమయం, ఏయే రోజుల్లో సమావేశాలకు సెలవు ఇవ్వాలి, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయసభల్లో ఎన్ని రోజులు చర్చ జరగాలి, బడ్జెట్‌ను ఎప్పుడు ప్రవేశపెట్టాలి, బడ్జెట్‌పై ఎన్ని రోజులు చర్చ జరగాలి.. వంటి అంశాలపై నిర్ణయం తీసుకొంటారు. ఈ నిర్ణయాల మేరకు మంగళవారం నుంచి ఉభయసభల సమావేశాలు కొనసాగుతాయి.



జిన్‌పింగ్‌కు తిరుగులేదు

జీవితకాలం చైనా అధ్యక్షుడిగా పార్లమెంట్ ఆమోదముద్ర

5

ఈ ఏడాది మిషన్ కాకతీయ లక్ష్యం

ఆరు వేల చెరువులు

నాలుగో విడుతకు సన్నద్ధం

- 3,570 చెరువులకు అనుమతులు మంజూరు
- అంచనా వ్యయం రూ. 1072 కోట్లు
- త్వరలోనే మిగతా చెరువులకు గ్రీన్‌సిగ్నల్


మిషన్ కాకతీయలో భాగంగా సిద్దిపేటలో చెరువు పూడికతీత పనుల దృశ్యం (ఫైల్ ఫొటో)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మిషన్ కాకతీయ నాలుగో విడుతలో భాగంగా ఈ సంవత్సరం ఆరువేల చెరువులకు మరమ్మతులు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో 3, 570 చెరువులకు పరిపాలనా అనుమతులు ఇప్పటికే మంజూరయ్యాయి. చెరువుల మరమ్మతులన్నీ ఈ ఎండకాలంలోనే పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. వానకాలం మొదలు కావడానికి ముందే చెరువులను మరమ్మతు చేసినట్టయితే, సకాలంలో నీటితో నిండుతాయని ప్రభుత్వ అభిప్రాయం. పరిపాలన అనుమతులిచ్చిన 3,570 చెరువుల కింద 2.62 లక్షల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు ప్రణాళిక సిద్ధంచేశారు. దీనికోసం రూ. 1072.01 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఉమ్మడి పాలనలో ఏండ్లుగా నిరాదరణకు గురైన చెరువులకు తెలంగాణ ప్రభుత్వం మరమ్మతులు చేస్తున్న విషయం విదితమే. మొత్తం 46,591 చెరువులను మరమ్మతులు చేయాలని సంకల్పించిన ప్రభుత్వం ఇప్పటికే మూడు విడుతల్లో వేల చెరువులను పునరుద్ధరించింది. నిరుడు కురిసిన వర్షాలకు చెరువులన్నీ కళకళలాడాయి. తూములు, చెరువు కట్టలను మళ్లీ నిర్మించి వర్షపునీటిని ఒడిసిపట్టడంతో ఆయకట్టులో సాగు పెరగడమే కాకుండా.. భూగర్భ జలాలు పైకొచ్చాయి. వర్షపు నీటితో మాత్రమే కాకుండా ఆయా ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నీటితో వాటి పరిధిలోని చెరువులను నింపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతేడాది 6 టీఎంసీల నీటిని దాదాపు 380 చెరువుల్లో

మిగతా 11వ పేజీలో

జీఎస్టీ రాబడిలో రికార్డు



19% వృద్ధిరేటు దాటిన మొదటి రాష్ట్రం

దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్), వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) రాబడులు స్థిరంగా పెరుగుతున్నాయి. గత ఏడాది వ్యాట్ రాబడితో పోలిస్తే జీఎస్టీ రాబడి గణనీయంగా పెరుగుతున్నది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు రాబడులు 19.57 శాతం పెరిగినట్టు తాజా నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రం కూడా ఇప్పటివరకు 17 శాతం వృద్ధిరేటును సాధించలేదని సమాచారం. ఒక్క తెలంగాణ మాత్రమే 19 శాతం పైగా వృద్ధిరేటును సాధించి మరోసారి సొంత ఆదాయాల వృద్ధిలో అగ్రస్థానంలో నిలిచింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక నవంబర్‌లో స్టేట్‌జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) దాదాపు వందకోట్లు తగ్గినా ఆ మేరకు కేంద్రం నష్టపరిహారం ఇచ్చింది. గత సంవత్సరం ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు వ్యాట్‌ద్వారా రూ.19,556.54 కోట్ల రాబడి వచ్చింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక ఈసారి అదే సమయానికి

మిగతా 11వ పేజీలో

మా బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తాం

■ టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ తరఫున తనను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికచేసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. తమపై ఉంచిన బాధ్యతలను సమర్థంగా, సక్రమంగా నిర్వహిస్తామని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించిన వెంటనే జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్యయాదవ్.. పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసివెళ్లి తెలంగాణభవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం: బడుగుల లింగయ్యయాదవ్

పేదవర్గాల నుంచి వచ్చాను. యాదవ కుటుంబం నుంచి వచ్చిన నాకు చట్టసభలు ఎట్లా ఉంటాయో, వాటిని చూస్తామో లేదో కూడా తెలియదు. అలాంటి నన్ను సీఎం కేసీఆర్ ఎంపికచేసి, నయా పైసా ఖర్చులేకుండా అత్యున్నతమైన రాజ్యసభకు పంపిస్తుండటం మరువలేను. ఇది నా అదృష్టం. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. తెలంగాణ వస్తే ఏమి వస్తది అని ప్రశ్నించినవారికి ఇదే మా సమాధానం. టీడీపీలో 12 ఏండ్లు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేశాను. ఎలాంటి ఆదరణ లభించలేదు. కానీ మూడేండ్లుగా టీఆర్ఎస్‌లో రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నా. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

అట్టడుగువర్గాల్లో ఆత్మవిశ్వాసం: బండ ప్రకాశ్‌ముదిరాజ్

రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు సీఎం కేసీఆర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. రెండు సీట్లకు బడుగు బలహీన, వెనుకబడినవర్గాల వారినే ఎంపికచేశారు. తెలంగాణ వస్తే అట్టడుగువర్గాలకు మేలు జరుగుతుందని నాడు చెప్పిన మాటలు ఇప్పుడు నిజమయ్యాయి. ఇప్పటివరకు చట్టసభలకు నోచుకోలేని అట్టడుగువర్గాలను సీఎం కేసీఆర్ ఎంపికచేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ముఖ్యమంత్రి దేశానికే దిక్సూచిగా ఉన్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

అభినందనల వెల్లువ

టీఆర్ఎస్ తరఫున ఎంపికైన రాజ్యసభ అభ్యర్థులకు పార్టీ ప్రజాప్రతినిధుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. టీఆర్ఎస్ఎల్పీ సమావేశం అనంతరం నాయకులు భారీఎత్తున టపాసులు పేల్చి సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభ పక్షనేత జితేందర్‌రెడ్డి, మంత్రులు కే తారకరామారావు, టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్నతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు. అభినందనలు తెలిపినవారిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీఎస్‌టీఎస్ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఏ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణలో సామాజికన్యాయం

■ ఫేస్‌బుక్‌లో ప్రశంసించిన మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో తెలంగాణలో సామాజిక న్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు ప్రశంసించారు. ఏపీలో అలాంటిది ఊహించలేమని పేర్కొన్నారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఆదివారం తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తెలంగాణలో ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరిని బీసీల నుంచి ఎంపికచేసిన టీఆర్ఎస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. పరోక్ష పద్ధతిలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో వెనుకబడిన, ఆర్థికంగా బలంగా లేనివారిని ఎంపికచేసే అవకాశం ఉన్నప్పటికీ ఏపీలో అది జరుగలేదని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో జరిగిన దర్శకుల ఎన్నికల్లో గెలుపొందిన ఎన్ శంకర్ ప్యానల్ విజయ సంకేతం

తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా శంకర్

■ సానా యాదిరెడ్డిపై 310 ఓట్ల తేడాతో గెలుపు

తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్ శంకర్ ఎన్నికయ్యారు. దర్శకుల సంఘం ఎన్నికలు ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలించాంబర్ కార్యాలయంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్ శంకర్, సానాయాదిరెడ్డి ప్యానళ్లు పోటీపడ్డాయి.ఈ పోటీలో ఎన్ శంకర్ ప్యానల్ విజయం సాధించింది. ఎన్ శంకర్ తన ప్రత్యర్థి సానాయాదిరెడ్డిపై 310 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శంకర్‌కు 518 ఓట్లు రాగా సానాయాదిరెడ్డికి 208 ఓట్లుపడ్డాయి. శంకర్ ప్యానల్ నుంచి ఉపాధ్యక్షులుగా ఏఎస్ రవికుమార్ చౌదరి, ఎస్ వీ భాస్కర్‌రెడ్డి గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా జీ రామ్‌ప్రసాద్, కోశాధికారిగా వై కాశీవిశ్వనాథ్, జాయింట్ సెక్రటరీలుగా కట్టా రంగారావు, ఎం ఎస్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గోపీచంద్, డీవీ రాజు ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా శ్రీకాంత్ అడ్డాల, అనిల్ రావిపూడి, ప్రియదర్శిని, గంగాధర్, కృష్ణబాబు, చంద్రకాంత్ రెడ్డి, అంజిబాబు, మధుసూదన్‌రెడ్డి గెలుపొందారు. సానా యాదిరెడ్డి ప్యానల్ నుంచి కేవలం ఈసీ సభ్యుడిగా కృష్ణమోహన్ ఒక్కరే గెలుపొందారు. తన ప్యానల్ విజయం సాధించడంపై శంకర్ హర్షం వ్యక్తంచేశారు. తమ ప్యానల్‌పై ఎంతో నమ్మకంతో సమర్థించి, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. దర్శకులకు కావాల్సిన అన్ని సౌకర్యాల్ని కల్పిస్తామని, వారి సమస్యల్ని పరిష్కరించడానికి నిరంతరం పాటుపడతామని చెప్పారు. దర్శకులతో పాటు అసిస్టెంట్, అసోసియేట్ ఇలా ప్రతి సభ్యుడు సహకారంతో దేశంలో దర్శకుల సంఘాన్ని తలమానికంగా తీర్చిదిద్దుతామని అన్నారు. దర్శకుల సంఘానికి గత వైభవాన్ని తీసుకొస్తామని జనరల్ సెక్రటరీగా ఎన్నికైన రామ్‌ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో అనిల్‌రావిపూడి, వీరశంకర్, కోటగిరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

-సినిమాడెస్క్

కోటా కోసం కొట్లాటే!

మూడోపేజీ తరువాయి...

ఎవరూ అపోహపడాల్సిన అవసరంలేదని తెలిపారు. అయితే, నోరు అదుపులో ఉంచుకోవాలని, అలా ఉంచుకోలేని ఒకరిద్దరికి సీట్లు దక్కకపోవచ్చని తెలిపారు. రెండు జాతీయ పార్టీలు ప్రజావసరాలు తీర్చడంలో విఫలమయ్యాయని ఆయన వివరించారు. దేశంలో 70వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా కేవలం 40 వేల టీఎంసీలను మాత్రమే వాడుకుంటున్నామని, ఇంకా 30 వేల టీఎంసీలు వాడుకోవడంలేదని పేర్కొన్నారు. మన పొరుగుదేశమైన చైనాలో 2400 కిలోమీటర్లు పైపులైన్ వేసుకొని సాగునీటిని అందిస్తున్నారని, ఆ దేశంతో పోలిస్తే అభివృద్ధిలో ఎంతో వెనుకబడిఉన్నామని చెప్పారు. ఒకప్పుడు మనకంటే వెనుకబడి ఉన్న దేశం నేడు ప్రపంచంలోనే అమెరికా తరువాతి అగ్రరాజ్యంగా ముందుకెళ్తున్నదని, మనం ఎందుకు వెనుకబడి ఉన్నామో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడానికి మీ అందరి మద్దతు అవసరమని అన్నారు. దీనికి శాసనసభాపక్షం మొత్తం హర్షధ్వానాల మధ్య ఏక్రగీవంగా మద్దతు తెలిపింది. మేమంతా మీ వెంటే ఉంటామంటూ టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రకటించారు.

పూర్తికావొచ్చిన మిషన్ భగీరథ

రాష్ట్రంలో మిషన్ భగీరథ పనులు పూర్తికావచ్చాయని, వీటి ద్వారా ప్రజలందరికీ తాగునీరు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల్లో అద్భుతమైన స్పందన వస్తున్నదని చెప్పారు. పెట్టుబడి పథకం ద్వారా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. గత మూడున్నర సంవత్సరాలపాటు తెలంగాణ అభివృద్ధిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అద్భుతమైన ప్రతిభ, పనితీరు కనబరిచి ప్రజలకు చేరువయ్యారని అభినందించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో భవిష్యత్‌లో కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇదే స్ఫూర్తితో, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పనిచేయాలని పిలుపునిచ్చారు.

బడుగులకు రాజ్యసభ సీట్లు

శాసనసభ పక్ష సమావేశం సందర్భంగా పార్టీకి సంబంధించిన ముగ్గురు రాజ్యసభ అభ్యర్థులను సీఎం కేసీఆర్ సభ్యులకు పరిచయం చేశారు. అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి పార్టీ అభ్యర్థులను ప్రకటించినట్టుగా వెల్లడించారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న జోగినిపల్లి సంతోష్‌కుమార్ పేరు ప్రకటించిన వెంటనే సభామందిరం మొత్తం హర్షధ్వానాలతో మారుమోగింది. తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలని నిర్ణయించినందున తన వెంట ఢిల్లీ స్థాయిలో నిత్యం ఉండటానికి ఉన్నత విద్యావంతుడైన సంతోష్‌కుమార్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసినట్టు వివరించారు. గత పదహారేండ్లుగా తన వెన్నంటి ఉండి సేవలందించారని తెలిపారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన బండా ప్రకాశ్, యాదవ సామాజిక వర్గానికి చెందిన బడుగుల లింగయ్య యాదవ్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. సమాజంలో వెనుకబడిన కులాలు ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచి చట్టసభల్లోకి రావడం కష్టంగా ఉన్నదని, ఆయా వర్గాలకు చెందిన వారిని చట్టసభలకు పంపించాలనే ఉద్దేశంతో.. సామాజిక న్యాయమే ధ్యేయంగా యాదవ్‌లు, ముదిరాజ్‌లకు రాజ్యసభ సభ్యత్వం ప్రకటించామని సీఎం కేసీఆర్ తెలిపారు. యాదవ్‌లకు రాజ్యసభ సీటు ఇస్తామని ముందుగానే హామీ ఇచ్చినవిధంగా వారికి సీటు కేటాయించామని చెప్పారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న లింగయ్యయాదవ్‌ను, ముదిరాజ్ సామాజికవర్గంలో ఉన్నత విద్యావంతుడైన బండా ప్రకాశ్‌ను ఎంపిక చేశామని తెలిపారు. ముగ్గురు అభ్యర్థుల గెలుపు కూడా నల్లేరు మీద నడక అని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాజ్యసభ ఎన్నికల బాధ్యతను మంత్రులు కే తారక రామారావు, ఈటల రాజేందర్, జీ జగదీశ్‌రెడ్డిలకు సీఎం కేసీఆర్ అప్పగించారు. వీరిని పార్టీకి చెందిన పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు.

క్రమశిక్షణతో లేకుంటే చర్యలు

దేవాలయంలాంటి శాసనసభను అందరూ గౌరవించుకోవాల్సిన అవసరం ఉన్నదని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న సమావేశాల్లో క్రమశిక్షణతో మెలుగాలని సూచించారు. ప్రతిపక్ష కాంగ్రెస్.. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తుందని, సభ నుంచి సస్పెండ్ కావాలని చూస్తుందని చెప్పారు. కానీ.. 'మనమందరం క్రమశిక్షణతో ఉండాలని స్పష్టంచేశారు. పోడియంలోకి వచ్చి సభను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే గతంలో ఏ విధంగా చర్యలు తీసుకున్నారో అదేవిధంగా నిబంధనల ప్రకారం వ్యవహరిద్దామన్నారు. ప్రతిపక్షాన్ని సభలో ఎండగట్టే విధంగా మంత్రులు, సభ్యులు సిద్ధం కావాలని కోరారు. ప్రజాసమస్యలను లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషిచేయాల్సిన ప్రతిపక్షం సభ నుంచి ఏ విధంగా సస్పెండ్ కావాలా అని చూస్తున్నదని, ఇలాంటి ప్రతిపక్షాన్ని ఎప్పుడు చూడలేదని సమావేశంలో అన్నారు. సభ జరుగకుండా అడ్డుకోవాలని ప్రతిపక్షం చూస్తున్నదని ఇంతకంటే దుర్మార్గమైన చర్య మరొకటి ఉండదని పేర్కొన్నారు. అధికారపార్టీ సభ్యులందరూ సభకు ప్రతిరోజూ విధిగా హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు సహా మంత్రులందరూ సమావేశానికి హాజరయ్యారు.

● అజ్మీర్ తబరుక్‌ను సీఎం కేసీఆర్‌కు అందజేత



రాజస్థాన్‌లోని అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గా నుంచి తీసుకొచ్చిన తబరుక్ (ప్రసాదం)ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ఆదివారం తెలంగాణభవన్‌లో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అందజేశారు. అనంతరం అజ్మీర్‌లో గెస్ట్‌హౌస్ కోసం పరిశీలించిన స్థలాల గురించి సీఎంకు ఆయన వివరించారు. అజ్మీర్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గెస్ట్‌హౌస్ స్థలాల పరిశీలనకు డిప్యూటీ సీఎం, పలువురు మైనారిటీ కార్పొరేషన్ల చైర్మన్లు, టీఆర్ఎస్ మైనారిటీ నేతలు మూడురోజులు రాజస్థాన్‌లో పర్యటించారు. అజ్మీర్ దర్గాను సందర్శించి రాష్ట్ర, దేశాభివృద్ధి, శాంతిసామరస్య స్థాపనకు థర్డ్ ఫ్రంట్ ఏర్పాటులో ముఖ్యమంత్రి కృషి ఫలించి ప్రధాని పగ్గాలు చేపట్టాలని డిప్యూటీ సీఎం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

మూడోపేజీ తరువాయి...

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
13. వీసీ సజ్జనార్	ఐజీపీ (స్పెషల్ ఇంటెలిజెన్స్)	కమిషనర్ ఆఫ్ పోలీస్ - సైబరాబాద్
14. దేవేంద్రసింగ్‌చౌహాన్	వెయిటింగ్	అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)
15. టీవీ శశిధర్‌రెడ్డి	డీజీ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్)	అడిషనల్ డైరెక్టర్-ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీ
16. జీ సుధీర్‌బాబు	కమిషనర్ ఆఫ్ పోలీస్ (వరంగల్ సిటీ)	జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రాచకొండ)
17. సీ రవివర్మ	వెయిటింగ్	డీఐజీ (సీఐడీ)
18. పీ ప్రభాకర్‌రావు	--	డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ఐబీ అండ్ ఎఫ్ఏసీ డీఐజీ ఇంటెలిజెన్స్
19. వీ రవీందర్	జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్ హైదరాబాద్ సిటీ)	కమిషనర్ ఆఫ్ పోలీస్ (వరంగల్ సిటీ)
20. తరుణ్‌జోషి	జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రాచకొండ)	డీఐజీగా పదోన్నతి, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్- హైదరాబాద్ సిటీ)
21. వీ శివకుమార్	కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిద్దిపేట)	సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఇంటెలిజెన్స్)
22. ఏ వెంకటేశ్వరరావు	డీసీపీ (వెస్ట్‌జోన్- హైదరాబాద్ సిటీ)	డీసీపీ (మాదాపూర్ జోన్-సైబరాబాద్)
23. పీ విశ్వప్రసాద్	డీసీపీ (మాదాపూర్ జోన్-సైబరాబాద్)	డీసీపీ (సెంట్రల్ జోన్-హైదరాబాద్)
24. ఏఆర్ శ్రీనివాస్	డీసీపీ (ట్రాఫిక్- సైబరాబాద్)	డీసీపీ (వెస్ట్ జోన్-హైదరాబాద్)
25. ఎం రమేశ్	గ్రూప్ కమాండర్ (గ్రేహౌండ్స్)	డీసీపీ (ఈస్ట్ జోన్-హైదరాబాద్)
26. సీ శశిధర్‌రాజు	డీసీపీ- ఎస్పీఎస్సీ	డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్
27. ఎం శ్రీనివాసులు	వెయిటింగ్	సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సీఐడీ)
28. ఆర్ రమారాజేశ్వరి	వెయిటింగ్	ఎస్పీ (జోగుళాంబ గద్వాల జిల్లా)
29. జోయల్ డేవిస్	డీసీపీ (సెంట్రల్ జోన్-హైదరాబాద్)	కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిద్దిపేట)
30. ఎస్ఎం విజయ్‌కుమార్	ఎస్పీ (జోగుళాంబ గద్వాల జిల్లా)	గ్రూప్ కమాండర్ (గ్రేహౌండ్స్)
31. బీ అనంతశర్మ	ఎస్పీ (జగిత్యాల)	డిప్యూటీ డైరెక్టర్ - ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీ
32. విశ్వజీత్ కంపాటి	ఎస్పీ (రాజన్న సిరిసిల్ల)	డైరెక్టర్-ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (జీహెచ్ఎంసీ)
33. బీకే రాహుల్ హెగ్డే	ఏఎస్పీ (ఏటూరునాగారం)	ఏఎస్పీ (రాజన్న సిరిసిల్ల)
34. సునీల్ దత్	ఏఎస్పీ (భద్రాచలం)	ఏఎస్పీ (జగిత్యాల)
35. అపూర్వరావు	ఏఎస్పీ (రామగుండం కమిషనరేట్)	ఏఎస్పీ (సీఐడీ)
36. చేతన ఎం	ఏఎస్పీ (వెయిటింగ్)	ఏసీపీ (సుల్తాన్ బజార్- హైదరాబాద్ సిటీ)
37 రక్షిత కే మూర్తి	వెయిటింగ్	ఏఎస్పీ (రామగుండం కమిషనరేట్)
38. పీఎస్ఎస్ గణపాత్రో	వెయిటింగ్	ఏఎస్పీ (భద్రాచలం)

టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే..

మూడోపేజీ తరువాయి...

ప్రాధాన్యమిస్తున్నదని చాటుకుంది. సీఎం కేసీఆర్ బీసీలకు ఒక రాజ్యసభ స్థానం కేటాయిస్తానంటూ గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకోవడంతోపాటు, అదే వర్గానికి చెందిన మరొకరికి కూడా స్థానం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. రాష్ట్రం నుంచి ఆరు రాజ్యసభ స్థానాలు ఉండగా, టీఆర్ఎస్ నుంచి ఇప్పటికే బీసీ వర్గానికి చెందిన ఇద్దరు (కేశవరావు, డీ శ్రీనివాస్) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారికి ప్రస్తుతం మరో ఇద్దరు జత కలువనున్నారు. గతంలో ఏ పార్టీ కూడా నాలుగేండ్ల వ్యవధిలో నలుగురు బీసీలకు రాజ్యసభ సీట్లు కేటాయించిన దాఖలాలు లేవు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీ తనకున్న ఆరు రాజ్యసభ స్థానాల్లో నాలుగు స్థానాలను బీసీలకు ఇచ్చింది. ఉద్యమపార్టీగా తెలంగాణను సాధించిన టీఆర్ఎస్ ఉద్యమకారులకు కూడా రాజ్యసభలో అవకాశం కల్పిస్తున్నది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న కెప్టెన్ లక్ష్మీకాంతారావుకు గత ఏడాదే రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వగా, తాజాగా జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు అవకాశం కల్పించారు.

మలిదశ ఉద్యమనేత జోగినిపల్లి

మలిదశ ఉద్యమ ప్రారంభం నుంచి సంతోష్‌కుమార్ చేసిన నిస్వార్థ సేవకు నిజమైన గుర్తింపు లభించింది. పార్టీ నేతలకు తలలో నాలుకలా.. సంతన్న అనగానే పలికే ఆయనకు రాజ్యసభ టిక్కెట్ ఇస్తున్నట్టు ప్రకటన వెలువడగానే రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి నేటి వరకు పార్టీకి, ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నంటే ఉన్న సంతోష్‌కుమార్‌కు మానవతావాదిగా, కార్యకర్తలకు అండగా ఉండే నేతగా గుర్తింపు ఉన్నది. తెలంగాణవ్యాప్తంగా కొన్ని వందల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం అందించడం, అనారోగ్యం బారినపడిన వారికి ఆర్థికంగా చేయూతనందించడం, దేవనార్ అంధుల పాఠశాల సహా పలు పాఠశాలలకు చేయూతనందించడం వంటి కార్యక్రమాల ద్వారా ఆయన ప్రత్యేకతను చాటుకున్నారు. పార్టీ కార్యక్రమాలను చక్కదిద్దడంలో దిట్ట అయిన సంతోష్‌ను రాజ్యసభకు పంపిస్తున్నారు. టీ న్యూస్ ఎండీగా ఉన్న ఆయన ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు.

బడుగుల నేత లింగయ్యయాదవ్

లింగయ్య యాదవ్ 36 ఏండ్లుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. 1982లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కేతేపల్లి మండల తెలుగు యువత, టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1995లో భీమారం ఎంపీటీసీగా గెలుపొందారు. 1998 నుంచి 2012 వరకు సుదీర్ఘ కాలం ఉమ్మడి నల్లగొండ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి 26 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2015లో టీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలుగుదేశంలో ఉన్నప్పటి నుంచే ఉద్యమ నేత కేసీఆర్‌తో ఆయనకు పరిచయం ఉన్నది.

ఉన్నత విద్యావేత్త ప్రకాశ్ ముదిరాజ్

డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ ఉన్నత విద్యావంతుడిగా ముదిరాజ్‌ల అభ్యున్నతికి దశాబ్దాలుగా కృషిచేస్తున్నారు. ఎంఏ, పీహెచ్‌డీ చేసిన బండ ప్రకాశ్ విద్యార్థి జీవితం నుంచి క్రియాశీల రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. విద్యావేత్తగా, జాతీయ జూడో సంఘానికి ఉపాధ్యక్షుడిగానే కాకుండా తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఆయన పనిచేస్తున్నారు. వరంగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా, ఉపాధ్యక్షుడిగా, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సభ్యులుగా పనిచేసిన ఆయన దాదాపు మూడు దశాబ్దాలపాటు కాంగ్రెస్ పార్టీలో పలు కీలక పదవులు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో మేధోపరమైన అంశాల్లో చురుకైన పాత్ర పోషించారు. కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యుడిగా పనిచేసిన ఆయన అనేక విద్యా, సాంస్కృతిక, కళా సంస్థల్లో సభ్యుడిగా కొనసాగుతున్నారు.

బయోడేటా...

జోగినిపల్లి సంతోష్‌కుమార్



- పుట్టిన తేదీ : 21-07-1975
- స్వస్థలం : కొదురుపాక గ్రామం బోయినపల్లి మండలం కరీంనగర్ జిల్లా
- తల్లిదండ్రులు : జోగినిపల్లి శశికళ, రవీందర్‌రావు
- భార్య : జోగినిపల్లి రోహిణి
- పిల్లలు : ఇషాన్, శ్రేయాన్
- విద్యార్హత : ఎంబీఏ, మాస్టర్ ఇన్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పుణె

బడుగుల లింగయ్యయాదవ్



- వయస్సు : 58 ఏండ్లు
- స్వస్థలం : భీమారం గ్రామం కేతేపల్లి మండలం నల్లగొండ జిల్లా
- తల్లిదండ్రులు : యలమంచమ్మ, అంతయ్య
- భార్య : నాగమణి
- పిల్లలు : డాక్టర్ యశ్వంత్, దీప్తి.
- విద్యార్హత : బీఏ, బీఈడీ.

బండ ప్రకాశ్ ముదిరాజ్

- వయస్సు : 63 ఏండ్లు
- స్వస్థలం : హన్మకొండ వరంగల్ అర్బన్ జిల్లా
- తల్లిదండ్రులు : శకుంతల, సత్యనారాయణ
- పిల్లలు : కీర్తి
- విద్యార్హత : ఎంఏ (గోల్డ్ మెడలిస్ట్), రూరల్ డెవలప్‌మెంట్‌లో పీహెచ్‌డీ

విస్తరించనున్న వైద్యసేవలు

■ రాష్ట్రవ్యాప్తంగా పెరుగనున్న వైద్యుల సంఖ్య

■ ఐదువేల డాక్టర్ పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్యశాఖ కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సర్కారు దవాఖానల్లో వైద్యులు, సిబ్బందిని అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నది. పెరిగిన అవసరాల దృష్ట్యా రెగ్యులర్ ప్రాతిపదికన వైద్యుల నియామకానికి వైద్య, ఆరోగ్యశాఖ సిద్ధమైంది. ఖాళీలతోపాటు కొత్తగా మంజూరైన వాటిని కలుపుకొని మొత్తం ఐదువేల వైద్యుల పోస్టులను భర్తీచేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ప్రభుత్వ వైద్యకళాశాలల సంఖ్య పెరుగనున్న నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులకు పదోన్నతులు కూడా పెరుగనున్నాయి. మెడికల్ కళాశాలల్లో సీనియర్ రెసిడెంట్ వైద్యులను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా గుర్తించనున్నారు. జిల్లా దవాఖానల్లో వైద్యులుగా పనిచేస్తున్న పీజీ విద్యార్థుల కోసం డిప్లొమా ఆఫ్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ) కోర్సులను నిర్వహించనున్నది.రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్ల సంఖ్య పెరిగింది. యూజీ (ఎంబీబీఎస్) సీట్ల సంఖ్య 700 నుంచి 1000 వరకు, పీజీ సీట్లు 571 నుంచి 792 వరకు పెరిగాయి. రాష్ట్రంలో కొత్తగా అనుమతించిన వైద్య కళాశాలల్లో మహబూబ్‌నగర్‌లో ఇప్పటికే ప్రారంభం కాగా.. సిద్దిపేటలో వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్ ప్రక్రియ జరుగనున్నది. వీటితోపాటు నల్లగొండ, సూర్యాపేటల్లో కూడా వైద్య కళాశాలలను ఏర్పాటుచేయనున్నారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాలుగా దవాఖానలను విభజించి ఇన్‌సర్వీస్ కోటా పీజీ సీట్లను పెంచనున్నారు. ఇన్‌సర్వీస్ కోటాలో భాగంగా క్లినికల్ విభాగం 30 శాతం, నాన్ క్లినికల్ కింద 50 శాతం, నో కోటా కింద 30 శాతం విద్యార్థులను మార్కుల స్కోర్ ఆధారంగా సీట్ల భర్తీ చేస్తారు.

రాజ్యసభ నామినేషన్లకు తుది గడువు నేడే

నేడు దాఖలుచేయనున్న టీఆర్ఎస్ అభ్యర్థులు

■ మూడుస్థానాలూ అధికార పార్టీకి దక్కే అవకాశం

■ ఎన్నిక ఏకగ్రీవమైతే ఈ నెల 15 తర్వాత విజేతల ప్రకటన

■ లేదంటే ఈ నెల 23న పోలింగ్, అదేరోజు ఓట్ల లెక్కింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు సోమవారంతో గడువు ముగియనున్నది. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు జరుగనున్న ఎన్నికలకు అభ్యర్థులు అసెంబ్లీ లాబీలో ఏర్పాటుచేసిన కౌంటర్‌లో నామినేషన్లు దాఖలుచేస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ ఎన్నికలకు అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంనుంచి మూడు రాజ్యసభ స్థానాల కోసం ఈ నెల 5వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) నోటిఫికేషన్ జారీచేసింది. అదే రోజునుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా, 9వ తేదీ వరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదు. శని, ఆదివారాలు సెలవుదినాలు కావడంతో, ఇక నామినేషన్ల దాఖలుకు గడువు సోమవారం మాత్రమే మిగిలింది. ఎన్నికలు జరుగుతున్న మూడు స్థానాలూ అధికార టీఆర్ఎస్‌కే దక్కే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ తన అభ్యర్థిని బరిలో దించుతామని ప్రకటించినప్పటికీ, శాసనసభలో సభ్యుల బలాబలాల ఆధారంగా మూడుస్థానాలు గెలుచుకొనే బలం టీఆర్ఎస్‌కే ఉంది. టీఆర్ఎస్ తమ అభ్యర్థుల పేర్లను ఆదివారం టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ప్రకటించింది. వారు సోమవారం నామినేషన్లు వేయనున్నారు. మూడు నామినేషన్లే దాఖలైతే తెలంగాణ నుంచి రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. ఒకవేళ మరో అభ్యర్థి బరిలో దిగితే పోలింగ్ అనివార్యమవుతుంది. ఎన్నిక ఏకగ్రీవమైతే ఈ నెల 15వ తేదీ తర్వాత.. ఎన్నికైన అభ్యర్థుల పేర్లను ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది. మరో అభ్యర్థి నామినేషన్ వేస్తే.. ఈ నెల 23వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఆ తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి.. విజేతలను ప్రకటిస్తుంది. రాపోలు ఆనందభాస్కర్ (కాంగ్రెస్), సీఎం రమేశ్ (టీడీపీ), కొన్నిరోజుల కిందట మృతి చెందిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి (కాంగ్రెస్) పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తుంది. వీరి స్థానంలో కొత్త అభ్యర్థులను ఈ నెల 26లోగా ఎన్నుకోవాల్సి ఉండటంతో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికయ్యే అభ్యర్థులు ఆరేండ్లపాటు పదవిలో కొనసాగుతారు.

నామినేషన్ల షెడ్యూల్	
నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ	మార్చి 5 (సోమవారం)
నామినేషన్ల దాఖలుకు తుది గడువు	మార్చి 12 (సోమవారం)
నామినేషన్ల పరిశీలన	మార్చి 13 (మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు	మార్చి 15 (గురువారం)
పోలింగ్ తేదీ (ఏకగ్రీవం కాకపోతే)	మార్చి 23 (శుక్రవారం)
పోలింగ్ జరిగే సమయం	ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు
ఓట్ల లెక్కింపు	మార్చి 23 (శుక్రవారం) సాయంత్రం 5 గంటల తరువాత
ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాల్సిన తేదీ	మార్చి 26 (సోమవారం)

తలపాగా ధరించాడని బార్ నుంచి గెంటేశారు

బ్రిటన్‌లో న్యాయవిద్యను అభ్యసిస్తున్న సిక్కు విద్యార్థికి అవమానం



అమ్రిక్ సింగ్

లండన్: తలపాగా ధరించాడని న్యాయవిద్యను అభ్యసిస్తున్న ఓ సిక్కు విద్యార్థిని బ్రిటన్‌లో బార్ నుంచి బయటకు గెంటేశారు. బ్రిటన్ నాట్టింగ్‌హామ్‌లోని ట్రెంట్ యూనివర్సిటీలో న్యాయవిద్య చివరి సంవత్సరం విద్యార్థి అమ్రిక్ సింగ్ (22) తలపాగా ధరించి స్నేహితులతో కలిసి శనివారం రాత్రి నాట్టింగ్‌హామ్‌షైర్‌లోని మాన్స్‌ఫీల్డ్‌లో ఉన్న రష్ లేట్ బార్‌కు వెళ్లాడు. అయితే, తలకు ఏమీ పెట్టుకోకుండా (నో హెడ్‌వేర్) లోపలికి వెళ్లాలనేది బార్ విధానం. లోపలికి వెళ్లగానే బార్‌కు చెందిన బౌన్సర్ తలపాగా తీసేయాలని సింగ్‌కు సూచించాడు. తలపాగా ధరించడం అనేది వెంట్రుకల రక్షణ కోసం, తమ మత సంప్రదాయమని సింగ్ తెలియజేశాడు. బహిరంగప్రదేశాల్లోనూ తలపాగా ధరించేందుకు అనుమతిస్తారని వివరించాడు. కానీ ఇవేమీ పట్టించుకోని బౌన్సర్ తలపాగా తీయాల్సిందేనని స్పష్టంచేశాడు. తీయకపోవడంతో అతన్ని బార్ నుంచి బయటకు గెంటేశాడు. 'ఈ ఘటన నా మనసును గాయపర్చింది. కేవలం తలపాగా తీయనందుకే నన్ను బయటకు గెంటేశారు' అని అమ్రిక్ సింగ్ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశాడు. బౌన్సర్లు తాను పెట్టుకున్న తలపాగాను బూట్లతో పోల్చడం సరైంది కాదని చెప్పాడు. తాను, తన తల్లిదండ్రులు కూడా బ్రిటన్‌లోనే పుట్టారని, ఆ దేశ విలువలను పాటిస్తున్నామని పేర్కొన్నాడు. ఈ ఘటనపై స్పందించిన బార్ యాజమాన్యం క్షమాపణలు కోరింది. దీనిపై విచారణ జరిపి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపింది.

18 ఏండ్లు నిండిన మరునాడే ఓటరుగా నమోదు



న్యూఢిల్లీ: ఓటర్లుగా నమోదయ్యేందుకు ఎదురుచూస్తున్న యువతకు కేంద్రం ఓ తీపి కబురు అందించింది. 18 ఏండ్లు నిండిన మరునాడే ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నది. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ప్రస్తుతం ఓటరు నమోదుకు జనవరి 1వ తేదీని ప్రామాణికం(కటాఫ్)గా తీసుకుంటున్నారు. అప్పటికి 18 ఏండ్లు నిండిన వారికే ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. ఆ తర్వాత రోజుల్లో పుట్టిన వారంతా ఓటరుగా నమోదు కోసం తర్వాతి ఏడాది జనవరి 1వ తేదీ వరకు ఎదురుచూడాల్సిందే. దీంతో జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు ఆ ఏడాది 18 ఏండ్లు నిండినా ఓటుహక్కు పొందలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో ఓటరు నమోదుకు పలు ప్రామాణిక తేదీలు ఉండాలని ఎన్నికల సంఘం 1970వ దశకం నుంచే ప్రయత్నిస్తున్నది. జనవరి 1తోపాటు ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1ని కటాఫ్ తేదీలుగా ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు. 2016లో కేంద్రం జనవరి 1, జూలై 1ని కటాఫ్ తేదీలుగా నిర్ణయిస్తూ చేసిన ప్రతిపాదన ముందుకు కదలలేదు. ఇప్పుడు కేంద్రం ఏడాదంతా ఓటరు నమోదు జరిగేలా ప్రతిపాదనలు రూపొందించింది.

ఎయిర్ ఇండియాకు కేంద్రం 325 కోట్లు బాకీ



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియాకు కేంద్రప్రభుత్వం రూ.325 కోట్లు బాకీ పడింది. అత్యంత ప్రముఖులు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని తదితరులు ప్రయాణించిన విమానాలకు కేంద్రప్రభుత్వం చార్జీలు చెల్లిస్తుంది. అయితే ఎయిర్ ఇండియాకు కేంద్ర ప్రభుత్వం ఎంత సొమ్ము చెల్లించింది.. ఇంకా ఎంత సొమ్ము చెల్లించాలి అని ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. దీనికి ఎయిర్ ఇండియా సమాధానమిస్తూ గత ఏడాది బకాయిలు రూ.84.01 కోట్లు, ఈ ఏడాది బకాయిలు రూ.241.80 కోట్లు కలుపుకొని మొత్తం రూ.325.81 కోట్లు కేంద్రప్రభుత్వం చెల్లించాలని తెలిపింది. ఈ బకాయిల్లో అత్యధికంగా విదేశాంగ శాఖ రూ.178.55 కోట్లు, పీఎంవో, క్యాబినెట్ సెక్రటరీ రూ.128.84 కోట్లు, రక్షణ శాఖ రూ.18.42 కోట్లు చెల్లించాలని పేర్కొంది. వాస్తవానికి గతేడాది బకాయిలు రూ.451.71కోట్లు, ఈ ఏడాది బకాయిలు రూ.553.01 కోట్లు కలుపుకొని మొత్తం రూ.1004.72 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. అందులో రూ. 678.91 కోట్లను చెల్లించిందని, మిగిలిన రూ.325.81 కోట్లు బకాయిలు ఉన్నాయని వివరించింది. 325.81 కోట్లలో గతేడాది బకాయిలు రూ.84.01 కోట్లు, ఈ ఏడాది బకాయిలు రూ.241.80 కోట్లు ఉన్నాయని తెలిపింది. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియాకు ప్రభుత్వ బకాయిలు గుదిబండగా మారాయి.

'మహా' రైతు పాదయాత్ర ఉగ్రరూపం!

- ముంబై చేరుకున్న 35వేలమంది రైతులు
- నేడు మహారాష్ట్ర అసెంబ్లీ ముట్టడి
- అన్నదాతల సంఖ్య 60 వేలకు చేరే అవకాశం
- చర్చలకు సిద్ధమన్న రాష్ట్ర ప్రభుత్వం

ముంబై, మార్చి 11:



రుణ మాఫీ కోరుతూ మహారాష్ట్ర అసెంబ్లీని ఘెరావ్ చేసేందుకు పాదయాత్రగా వస్తున్న రైతులు

చిన్నగా మొదలై మహోగ్రరూపం సంతరించుకుంటున్న మహారాష్ట్ర రైతు పాదయాత్ర అక్కడి రాష్ట్ర ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నది. మంగళవారం సాయంత్రం నాసిక్‌లో మొదలైన పాదయాత్ర ఆదివారం ముంబైకి చేరుకున్నది. పుడమి తల్లిని నమ్ముకుని కండలు కరిగించే అన్నదాతలు 180 కిలోమీటర్ల దూరాన్ని అవలీలగా పూర్తిచేశారు. సోమవారం అసెంబ్లీని ముట్టడిస్తామని నిరసన ప్రదర్శనకు నేతృత్వం వహిస్తున్న అఖిల భారత కిసాన్ మహాసభ (ఏఐకేఎస్) పేర్కొన్నది. కాగా రైతుల పాదయాత్రపై మహారాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందుతున్నది. వేల మంది రైతులు ఒక్కసారిగా నగరంలోకి రావడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఉపశమన చర్యలు చేపట్టింది. రైతులతో యాత్రను విరమింపజేయడానికి చర్చలకు సిద్ధమని ప్రకటించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం తరపున రైతులతో చర్చలు జరిపేందుకు మంత్రి గిరీశ్ మహాజన్‌ను ప్రభుత్వ ప్రతినిధిగా నియమించారు. సుమారు 35వేలమంది రైతులు ముంబై మహానగరంలో ప్రవేశించిన సందర్భంగా ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు గట్టి చర్యలు చేపడుతున్నారు. రైతు పాదయాత్రలో గిరిజన రైతులు కూడా పెద్దఎత్తున భాగస్వాములయ్యారు. ఏండ్ల తరబడి తాము దున్నుకుంటున్న భూములను తమ పేరిట బదలాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ దావ్లే మాట్లాడుతూ తాము మంత్రి గిరీశ్ మహాజన్‌ను కలిశామని.. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీఇచ్చారని పేర్కొన్నారు. శివసేన నాయకుడు ఆదిత్య ఠాక్రే రైతులను కలిసి సంఘీభావం తెలిపారు.

ముంబై నగర ప్రజలకు ఇబ్బందులు సృష్టించం: ఏఐకేఎస్

ముంబై మహానగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు సృష్టించకుండా శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని చేపడుతామని ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ దావ్లే హామీఇచ్చారు. 'మేం 25 వేల మందితో పాదయాత్ర ప్రారంభించాం. ఆ సంఖ్య ఇప్పుడు 50 వేలకు చేరుకున్నది. సోమవారం నాటికి ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నది. కానీ మేం నగర ప్రజలను ఇబ్బందులకు గురిచేయం. మేం మా యాత్రను ఉదయం 11 గంటల తర్వాత ప్రారంభిస్తాం. తద్వారా పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండబోవు' అని అన్నారు. రుణాల మాఫీ, కనీస మద్దతు ధర తదితర డిమాండ్లతో రైతులు చేస్తున్న ఈ పాదయాత్రకు కాంగ్రెస్‌తోపాటు శివసేన, రాజ్‌ఠాక్రే ఆధ్వర్యంలోని ఎంఎన్‌ఎస్ మద్దతు పలికాయి. కాగా పాదయాత్ర నిర్వాహకులు ఇది కేవలం వామపక్షాల నిరసన ప్రదర్శన కాదని.. రైతులందరి ఉమ్మడి ప్రయోజనాల కోసం చేస్తున్న యాత్ర అని పేర్కొంటున్నారు. వారంరోజులుగా పాదయాత్రలో పాల్గొంటున్న రైతులు కొద్దిగా మాత్రమే ఆహారం తీసుకుంటూ నడకను కొనసాగిస్తున్నారు. తెల్లవారుజామున మొదలవుతున్న యాత్ర.. మధ్యాహ్నం వరకు ఆగకుండా కొనసాగుతున్నది. మధ్యాహ్నం కొద్ది సమయం మాత్రమే విశ్రాంతి తీసుకుంటూ రాత్రివేళ రోడ్లపక్కనే ఆరుబయట నిద్రిస్తున్నారు.

ఉప ఎన్నికల్లో తగ్గిన పోలింగ్

యూపీలోని గోరఖ్‌పూర్‌లో 43%, ఫూల్పూర్‌లో 37.39 శాతమే

బీహార్‌లోని అరారియాలో 57%, భాబుయాలో 54%, జెహానాబాద్‌లో 50%



ఓటు వేసి సిరా చుక్క చూపుతున్న సీఎం యోగి

లక్నో/ పాట్నా: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫూల్పూర్, బీహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానాలకు ఆదివారం జరిగిన ఉప ఎన్నికల్లో మోస్తరు నుంచి తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీకి ఈ ఉప ఎన్నికలు పరీక్ష కానున్నాయి. గోరఖ్‌పూర్‌లో 43%, ఫూల్పూర్‌లో 37.39% ఓట్లు పోలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. బీహార్‌లో ని అరారియా లోక్‌సభాస్థానం పరిధిలో 57% పోలింగ్ రికార్డయిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అజయ్ వీ నాయక్ తెలిపారు. భాబుయా అసెంబ్లీ స్థానానికి 54.03, జెహానాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 50.06 శాతం ఓట్లు పోలయ్యాయని చెప్పారు. గోరఖ్‌పూర్ స్థానానికి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఫూల్పూర్ నుంచి డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య రాజీనామా చేసి ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. బీహార్‌లోని అరారియాలో సిట్టింగ్ ఆర్జేడీ ఎంపీ తస్లీముద్దీన్‌తోపాటు భాబుయా, జెహానాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు మృతి చెందారు. దీంతో ఈ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. గోరఖ్‌పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత సీఎం యోగి ఆదిత్యనాథ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుంచి బీజేపీకి విస్తృత స్థాయిలో మద్దతు లభిస్తున్నదని చెప్పారు. బీహార్‌లో గతేడాది బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీహార్ సీఎం నితీశ్‌కు అరారియా లోక్‌సభ, భాబూయా, జెహానాబాద్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు పరీక్ష కానున్నాయి. అరారియా లోక్‌సభ స్థానం నుంచి ఆర్జేడీ అభ్యర్థి తస్లీముద్దీన్ తనయుడు సర్ఫరాజ్ ఆలం, బీజేపీ అభ్యర్థి ప్రదీప్ సింగ్ పోటీలో ఉన్నారు. జెహానాబాద్‌లో మృతి చెందిన ఎమ్మెల్యే ముద్రికా యాదవ్ కొడుకు కుమార్ కృష్ణమోహన్‌కు ఆర్జేడీ టిక్కెట్ ఇచ్చింది. భాబుయాలో మరణించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనంద్ భూషణ్ పాండే భార్య రింకీ రాణిని బీజేపీ బరిలో నిలిపింది. ఈ స్థానాల ఎన్నికల ఫలితాలు 14న వెలువడతాయి.

ఆధ్యాత్మిక పర్యటనలో రజినీకాంత్



పాలంపూర్(హిమాచల్‌ప్రదేశ్): తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ ఆధ్యాత్మిక పర్యటనకు బయలుదేరారు. ప్రతి ఏటా ఆయన హిమాలయాల సందర్శనకు వెళ్తుంటారు. త్వరలో రాజకీయ పార్టీ పేరును ప్రకటించనున్న ఆయన ఈ సారి ఆధ్యాత్మిక పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. శనివారం ఆయన ధర్మశాల విమానాశ్రయానికి చేరుకున్నారు. తర్వాత ఆయన బైజ్‌నాథ్‌లోని ప్రఖ్యాత శివ మందిరం, మహకాల్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆయన పాలంపూర్‌లోని మహావతార్ బాబాజీ మెడిటేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ తన ఆధ్యాత్మిక గురువు యోగిరాజ్ అమర్ జ్యోతి జీ మహరాజ్‌ను కలుసుకున్నారు. రాత్రి అక్కడే నిద్రపోయిన రజినీ ఆదివారం ఉదయం కశ్మీర్‌కు సమీపం లోని శివ ఖోరిని సందర్శించారు. ఈ సందర్భంగా రజనీ విలేకరులతో మాట్లాడుతూ తన ఆధ్యాత్మిక పర్యటన చాలా బాగుందన్నారు. తాను ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడలేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

జీఎస్టీని చెత్తబుట్టలో పడేయాలి

- దానివల్ల ప్రతిరంగంపై ప్రతికూల ప్రభావం
- మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్‌హాసన్



చెన్నై: వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని చెత్తబుట్టలో పడేయాలని ప్రముఖ సినీనటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్‌హాసన్ అన్నారు. దేశంలోని అన్నిరంగాలపై జీఎస్టీ ప్రతికూల ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నారు. ఈరోడ్‌లో రెండోరోజు పర్యటనలోభాగంగా ఆదివారం కమల్‌హాసన్ మీడియాతో మాట్లాడారు. రూ.500, రూ.1,000 నోట్ల రద్దు సరైన నిర్ణయమైనా.. దాన్ని సరిగా అమలుచేయలేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం గోబిచెట్టిపాలెంలో ఆయన ప్రసంగించారు. ఇంజినీరింగ్, వైద్యవిద్యపైనే యువత శ్రద్ధచూపకుండా.. వ్యవసాయరంగంలోకి అడుగుపెట్టాలని సూచించారు. సారవంతమైన నేలలన్నీ యువత కోసం ఎదురుచూస్తున్నాయని, వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధులు మాత్రమే చేనేతరంగంలో పనిచేస్తున్నారని, వారి అనంతరం ఆ పరిశ్రమలో పనిచేసేందుకు ఎవరూలేరని చెప్పారు. కాబట్టి యువత చేనేతరంగంపై ఆసక్తి చూపాలని కమల్ సూచించారు.

తెగిపడిన కాలినే తలకింద పెట్టారు

- రోగికి వైద్య సేవల సమయంలో నిర్లక్ష్యం
- యూపీ ప్రభుత్వ దవాఖానలో ఘటన
- నలుగురిపై వేటు.. విచారణకు కమిటీ



గాయపడ్డ ఘన్‌శ్యామ్

ఝాన్సీ: రోడ్డు ప్రమాదంలో కాలు తెగిపడటం వంటి దృశ్యాలను చూస్తేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. కనీసం దగ్గరకెళ్లి.. ఆ దృశ్యాలను చూసేందుకే సాహసించం. కానీ కాలు విరిగి సర్కార్ దవాఖానకు వస్తే తలకింద పెట్టే దిండులేదని.. తెగిపడిన కాలినే బాధితుడి తల కింద దిండుగా పెట్టి సిబ్బంది మానవత్వం మరిచి అతి దారుణంగా వ్యవహరించారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో శనివారం జరిగింది. దీనిపై ఒక వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రభుత్వం నలుగురు సిబ్బందిపై వేటువేసింది. విచారణకు ప్రత్యేక కమిటీనీ నియమించింది. ఘన్‌శ్యామ్ (28) అనే వ్యక్తి బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఝాన్సీ జిల్లాలో శనివారం 25 మంది విద్యార్థులతో వెళ్తున్న బస్సు.. ట్రాక్టర్‌ను ఢీకొట్టే ప్రమాదం నుంచి తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఘన్‌శ్యామ్‌ను ఝాన్సీలో బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ అనుబంధ మహారాణి లక్ష్మీభాయి వైద్య కళాశాలకు తరలించారు. ఘన్‌శ్యామ్ స్ట్రెచర్‌పై చికిత్స పొందుతుండగా విరిగిన కాలినే అతని తలకింద ఆసరాగా పెట్టారు సిబ్బంది. దీనిపై రాష్ట్ర వైద్యవిద్యాశాఖ మంత్రి అశుతోశ్ టండన్ స్పందిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు వైద్యులు, ఇద్దరు నర్సులను సస్పెండ్‌చేశారు. 'అతనికి వెంటనే వైద్యసాయం అందించాం. బాధితుడి తల కొంచెం పైకి ఎత్తేందుకు ఏదైనా పెట్టాలని వైద్యుడు భావించారు. రోగి సహాయకులే విరిగిన కాలిని అతని తలకింద పెట్టారు. సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం' అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సాధన కౌశిక్ చెప్పారు. వైద్యులు అలోక్ అగర్వాల్, డాక్టర్ మహేంద్రపాల్‌సింగ్, ఇంచార్జి సిస్టర్ దీపా నారంగ్, నర్సు శశి శ్రీవాత్సవలను సస్పెండ్ చేసినట్టు ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ హరీశ్‌చంద్ర ఆర్య అన్నారు. కాగా, బాధితుడికి యూపీ సీఎం ఆదిత్యానాథ్ రూ.2 లక్షల సాయం ప్రకటించారు.

నవాజ్ షరీఫ్‌పై బూటు విసిరిన విద్యార్థి

పాక్ విదేశాంగ మంత్రిపై ఇంకు దాడి



పాక్ మాజీ ప్రధానిపైకి దూసుకొచ్చిన షూ.. ముఖంపై పడిన సిరాతో విదేశాంగశాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్

లాహోర్: పాకిస్థాన్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో మద్దతు కోసం ప్రజల్లోకి వెళ్తున్న అధికార పీఎంఎల్ - ఎన్ పార్టీ నేతలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఇన్నాళ్లు ప్రభుత్వంపై గూడుకట్టుకొన్న కోపాన్ని వివిధ రూపాల్లో ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై ఓ యువకుడు బూటు విసరడం కలకలం సృష్టించింది. వేదికపై షరీఫ్ మాట్లాడుతుండగా ఆయనపైకి షూ దూసుకు రావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. లాహోర్ సమీపంలో ఘరిసాహులోని జమియా నమీమియా ఇస్లామిక్ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఓ సెమినార్‌లో షరీఫ్ ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తుండగా మాజీ విద్యార్థి ఈ దాడి చేశాడు. దీంతో షూ షరీఫ్ చెవికి, భుజానికి తగిలింది. సదరు యువకుడు వేదికపైకి దూసుకొచ్చి నినాదాలివ్వడంతో అతడిని నిర్బంధించిన నిర్వాహకులు పోలీసులకు అప్పగించారు. వివాదం సద్దుమణిగాక షరీఫ్ ప్రసంగించారు. విదేశాంగ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ పైనా శనివారం ఇలాంటి దాడే జరిగింది. తన సొంత నియోజకవర్గం సియోల్‌కోట్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతుండగా ఆయన ముఖంపై ఓ వ్యక్తి నల్లసిరా పూసి దాడి చేశాడు. ఇటీవల తన సొంత నియోజకవర్గం నరోవాల్‌లో అంతరంగికశాఖ మంత్రి అసాన్ ఇక్బాల్ మాట్లాడుతున్నప్పుడు ఓ వ్యక్తి ఆయనపై చెప్పు విసిరాడు. దాడికి గురైన వారంతా అధికార పీఎంఎల్-ఎన్) పార్టీ వారు కావడం గమనార్హం.

1,700 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు

- అత్యధికంగా యూపీలో 539 కేసుల పెండింగ్
- సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 3,045 క్రిమినల్ కేసుల్లో దాదాపు 1,700 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు విచారణను ఎదుర్కొంటున్నారని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 248 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై విచారణ కొనసాగుతుండగా.. తమిళనాడులో 178, బీహార్‌లో 144, పశ్చిమబెంగాల్‌లో 139 మంది చట్టసభలసభ్యులు పలుకేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారన్నది. ఏపీ, కేరళ, తెలంగాణల్లో సుమారు 100 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నాయన్నది. 2014 నుంచి దాదాపు 3,816 కేసుల్లో 1,765 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు విచారణను ఎదుర్కొంటున్నారని, మార్చి 5వ తేదీనాటికి 771 కేసులు పరిష్కారమయ్యాయన్నాది. 3,045 కేసుల్లో విచారణ కొనసాగుతున్నదన్నది. వీటిలో యూపీలో 539, కేరళలో 373, తమిళనాడు, బీహార్, పశ్చిమబెంగాల్‌లో 300 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నది. గత డిసెంబర్‌లో సామాజిక కార్యకర్త అశ్వనీ ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం 2014లో ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేల వివరాలు తెలుపాలని కేంద్రాన్ని ఆదేశించింది.

అయోధ్యపై ఏకాభిప్రాయం కష్టమే!

అయినా గుడి నిర్మించి తీరుతాం: ఆరెస్సెస్

నాగ్‌పూర్: అయోధ్య వివాదంపై ఏకాభిప్రాయ సాధన కష్టమైనా రామమందిరం నిర్మించి తీరుతామని ఆరెస్సెస్ ఆదివారం స్పష్టంచేసింది. 'అయోధ్యలో రామమందిరం నిర్మిస్తారనేది ఖచ్చితం. అక్కడ వేరే ఏదీ నిర్మించబడదు' అని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి ఆదివారం మీడియాకు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు నుంచి అనుకూలమైన తీర్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కోర్టు ఆదేశం తర్వాతే అక్కడ మందిరం నిర్మిస్తామన్నారు. భూ యాజమాన్య హక్కుపై వచ్చే తీర్పును అనుసరించి గుడి నిర్మాణం అధారపడి ఉందన్నారు. వివిధ పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధన అంత సులభం కాదన్నారు.

దళిత మహిళలపై బీజేపీ ఎమ్మెల్యే దాడి

రాంచీ: దళిత మహిళలను కులం పేరుతో దూషించడమే కాకుండా కొట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉత్తరాఖండ్ బీజేపీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తుక్రాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. దళిత మహిళలను ఎమ్మెల్యే కొడుతున్న వీడియో సోషల్‌మీడియాలో వైరలైంది. దీంతో ఎమ్మెల్యే రాజ్‌కుమార్ సహా మరో ఇద్దరు బీజేపీ నేతలపై ఐపీసీ 323, 504 సెక్షన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అసత్యాలని ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తెలిపారు.

బీహార్‌లో రోడ్డు ప్రమాదం 8 మంది దుర్మరణం

సమస్తీపూర్: బీహార్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిదిమంది మరణించారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. సమస్తీపూర్ జిల్లాలోని హర్పూర్ అలౌత్ గ్రామ సమీపంలో కారును ఓవర్ టేక్ చేసి ముందుకెళ్లే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న ట్రక్‌ను ఆటో రిక్షా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో రిక్షాలో ప్రయాణిస్తున్న 8 మంది మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురిని చికిత్స నిమిత్తం ముజఫర్‌పూర్‌లోని దవాఖానకు తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

జీవిత కాలం చైనా అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్

చైనా పార్లమెంట్ ఆమోద ముద్ర ■ మావో తర్వాత శక్తిమంతమైన నేతగా జీ జిన్‌పింగ్

రాజ్యాంగానికి ఐదో సవరణ ■ మీడియా, పౌర సమాజంపై ఆంక్షలు కఠినమవుతాయన్న ఆందోళన



ఎన్పీసీలో రాజ్యాంగ సవరణపై హర్షం వ్యక్తం చేస్తున్న జిన్‌పింగ్

బీజింగ్, మార్చి 11: జీ జిన్‌పింగ్ (64) జీవిత కాలం చైనా అధ్యక్షుడిగా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. దేశ రాజ్యాంగంలోని ఒకే వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవిలో కొనసాగరాదన్న నిబంధనను రద్దు చేస్తూ చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) ప్రతిపాదించిన చరిత్రాత్మక రాజ్యాంగ సవరణకు చైనా పార్లమెంట్‌గా పరిగణించే నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్పీసీ) ఆదివారం ఆమోదం తెలిపింది. తద్వారా సీపీసీ వ్యవస్థాపక చైర్మన్ మావో జెడుంగ్ తర్వాత అధికార పార్టీ, మిలిటరీ అధిపతిగా శక్తిమంతమైన నేతగా జీ జిన్‌పింగ్ ఆవిర్భవించనున్నారు. ఈ రాజ్యాంగ సవరణకు ఎన్పీసీలో 2,958 మంది సభ్యులు అనుకూలంగా ఓటేయగా, ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మరో ముగ్గురు గైర్హాజరయ్యారని చైనా అధికార మీడియా తెలిపింది. బ్యాలెట్ వ్యవస్థ ద్వారా నిర్వహించిన పోలింగ్‌లో జిన్‌పింగ్ తొలుత తన బ్యాలెట్ పత్రాన్ని రెడ్ బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా రాజ్యాంగానికి విధేయులై ఉండాలన్నారు. అధికార యంత్రాంగం అవినీతికి దూరంగా ఉండాలని హితవు చెప్పారు.

చైనా రాజ్యాంగానికి ఇది ఐదో సవరణ

1954లో అమలులోకి వచ్చిన చైనా రాజ్యాంగానికి 1982 తర్వాత ఇప్పటివరకు నాలుగు సార్లు సవరించారు. తాజా సవరణ ఐదోది. 1949 నుంచి ఏక పార్టీ వ్యవస్థ అమలులో ఉన్న చైనాలో ఒకే వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిలో ఉండరాదన్న నిబంధన తొలగింపు అతిపెద్ద రాజకీయ మార్పు కానున్నది. అంతకుముందు ఈ ప్రతిపాదనను తొలగిస్తూ చైనా అధికార సీపీసీ అత్యున్నత సంస్థ ఏడుగురు సభ్యుల స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించించడంతో సీపీసీ ఉమ్మడి నాయకత్వ వ్యవస్థకు చరమగీతం పాడినట్లైంది. చైనాలో తాజా పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా, ప్రత్యేకించి చైనా పొరుగు దేశాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆయన ఆధ్వర్యంలోనే భారత్ - భూటాన్ - చైనా సరిహద్దుల్లోని డోక్లాం ముక్కోణ జంక్షన్‌లో రోడ్డు నిర్మాణంతో 73 రోజుల పాటు భారత్ - చైనా మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. ఇక పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) మీదుగా చైనా - పాకిస్థాన్ ఆర్థిక కారిడార్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులతో అనుసంధాన ప్రాజెక్టులు భారత్‌కు వ్యూహాత్మకంగా ఆందోళన కలిగించేవే. ఈ రాజ్యాంగ సవరణ చట్ట విరుద్ధమని పేర్కొన్న సామాజిక కార్యకర్త హు జియాను బీజింగ్ విడిచి వెళ్లాలని అధికారులు ఆదేశించారు. తాజా రాజ్యాంగ సవరణతో మీడియా, పౌర సమాజం, మత పరమైన అంశాలపై ఆంక్షలు మరింత కఠినతరం అవుతాయని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మావో తర్వాత తిరుగులేని నేత

జీ జిన్‌పింగ్‌కు ముందు 1993 నుంచి 2003 వరకు జియాంగ్ జెమిన్, 2003 నుంచి 2013 వరకు హు జింటావో దేశాధ్యక్షులుగా రెండు పర్యాయాలు పనిచేశారు. జీ జిన్‌పింగ్2013లో తొలిసారి దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చైనాలో అత్యంత శక్తిమంతమైన నేతగా ఎదిగారు. చైనా రాజ్యాంగంలో జీ జిన్‌పింగ్ సిద్ధాంతాలను చేరుస్తూ ఎన్పీసీ మరో రాజ్యాంగ సవరణ చేయనున్నది.



మంచి పని కాదని అనుకున్నప్పుడు ఆ పని చేయ సాహసించక పోవడం సరైనదే. కానీ ఒక పని నీవు చేయ సాహసించలేనప్పుడు, అది మంచి పని కాదని అనుకోవడం సరైంది కాదు.

సిగ్రిడ్ అండ్‌సెట్


ఉగాది శంఖారావం

ఓ నవ ముగ్ధ అడుగిడింది తెలుగువారి ముంగిట్లో,
పరువాల ఆ జవ్వని పేరు విలంబి యట,
చైత్రంతో పాటు వచ్చింది, చిత్తం నిలకడగా నిలపమనీ చెబుతూ,
ప్రాడః మాట పాటిస్తే పాటగ గడిచిపోతుందీ...
విలంబం కార్యాలలో వద్దనీ,
లేకపోతే తా లంబంగా గడుస్తానని హెచ్చరిస్తూ,
నా గతి మారదు అంటే సంగతి విలంబన అవుతుంది;
గులాబీ మాట, పాట బాట దేశ ప్రజపై గులాల్ చల్లాలి,
తెలంగాణ గులాబీల సౌరభం దేశమంతా వీయాలీ,
తెలుగోడ లేవరా, విలంబిలో త్రయంబికి పైగాం ఇవ్వరా...
విలంబన వద్దురా, ఆలంబనకు ఆధారమవ్వరా..
తెలుగోడ లేవరా, తెలంగాణ వాడ లేవరా...

– నండూరి రామచంద్రరావు, 99491 88444



దినాం ఉగాదే



మల్లెపూలు కొమ్మలల్ల
పూసుడు గాది
ఆడపిల్లల జడలకెల్లి నవ్వాలె!
మామిడికాయ్లు
ఎన్నిగాస్తె ఏం గాని
అగ్వకచ్చి పిల్లజల్ల తినాలె!
ఏసీల్గీసీల్ యాడ్కెల్లి
కొనాలె గాని
పచ్చని సెట్లగాలి ఊరంత రావాలె!
కవితలెంత సక్కగ రాస్న గాని
కోయిల పాట జరసేపు
కమ్మగినబడాలె!
సీకట్ల జమానెల్లి
ఎన్నెల కురవాలె
దినాం పండ్గ లెక్క జనం మురియాలె!

దేగల అనితాసూరి, 92475 00819

జ్ఞాపకాలు

కళ్ళు చీకట్లను కమ్ముకున్నప్పుడే
కలల్లో మెరుపులు మెరుస్తయ్!
జ్ఞాపకాలు గుండెను తడుముతయ్!!

అంకురించే ఆశలు వాడినప్పుడు
మళ్ళీ మిగిలిన జ్ఞాపకాలే తోడైతయ్!
నిర్జీవ మ్రాను
మళ్ళీ చిగురించే లోపే..
గీసుకున్న గీతలు–ఊసులు
కొన్నిసార్లు తెరదించేస్తయ్!

మది తలుపులు బిర్రుగ మూసినా
ఎక్కడో ఓ చోట
పట్టుకుని వేళాడుతుంటయ్
జ్ఞాపకాలు..
గోడకు అతికిన ఫోటోఫ్రేమ్‌లా...!!

– నర్రా ప్రవీణ్‌రెడ్డి, 93936 36405

చేతివృత్తులు (నానీలు)



దర్జాగా సాగిన
దర్జీ బతుకంతా..
చీలికలు పేలికలై
చితికింది...!



చెప్పులు తెగితే
చెప్పలేని తిప్పలు..
కుట్టిచ్చిన
ఆ చేతులకి వందనం!



మెరిసే
ఆభరణాల వెనక..
మాసిన స్వర్ణకారుల
బతుకులెన్నో...!



కుమ్మరిది
తీరని దాహం!
వేసవి కోసమే
ఏడాదంతా కష్టపడ్డడు!




ఆకలి పేగుల్ని
మెలి తిప్పుతున్నా..
నేత పోగుల్ని
అతుకుతూనే ఉంటాడు!



గీత కార్మికుడు
స్పైడర్ మేన్..
అయినా అతని
గీత మారదు..!




అరణ్యం లాంటి
నీ తలను..
అందమైన తోటలా
మార్చుతాడు క్షురకుడు!



కఠిన ఇనుము
కమ్మరి నైపుణ్యానికి
వంగిపోతూ
వందనం చేస్తోంది!



బట్టలు
ఉతకడమే కాదు!
విలువలకి
వలువలు చుడతాడు



అందరి గోడూ
దేవుడికి విన్నవించి..
తన గోడు
ఎదలో దాచుకుంటాడు..!

– వెన్నెల సత్యం, 94400 32210

ఆకు తొడిగిన మతి

తోవలు తొలుకొని
నీడలు నిద్రలేపుకొచ్చినయి
మడికట్ల మీదంగ
మంకెన చెట్టు పక్క నుంచి..

అడుగులు కరిగిపోయి
గుండె తడిసి పోతుంటె
ఎండిన మొటకాలువ నిద్రలేసింది
పిడకల గూడు వెనకాల
కీచురాయి చీకటి మంత్రం
రాత్రిని రాజేసి పోతున్న మినుగురులు

ఆకిట్లో అరుగు మీన
కాలం కాపల కాస్తుంది
మూడుతరాలుగా ముసల్ది
ముచ్చట పెడుతూ వుంది

ఆ పక్క నులకమంచంలో
నాకంటే ముందే
వెన్నెల పడుకొనివుంది
గల్మ పక్కన గాబులో
కాపిష్కి కన్ను కొడుతుంటే
గీనాత్రి నంత యద నింపుకున్న

గప్పుడెప్పుడో
మర్రి చెట్టుకింద మట్టిలో
మనసుపెట్టి ఆనవాలుగా
రాయి పెట్టొచ్చిన
గిప్పుడు దాని మీన
కాటికంటిన పెంకాసు కనిపించింది

ఇగురేసిన మతి
ఇగముగ తగిలి
సిగమూగే లోన
ఊరు నాలో పడుకొని కలువరిస్తుంది.

– మునాసు వెంకట్, 99481 58163

మౌఖిక సాహిత్యంతో నిఘంటువు

తెలంగాణలో వివిధ గాయక కులాలవారు పాడుతున్న సుదీర్ఘ ఇతిహాసాలు, జానపద గేయాలు, గేయకథలు, వచనకథలు తెలంగాణ నిఘంటు నిర్మాణంలో కీలకమైన పాత్రపోషిస్తాయి. '**తెలంగాణ నిఘంటువు**' అనగానే, ఇక్కడే మొదటి ప్రశ్న పుడుతుంది. భాషకు నిఘంటువు ఉంటుంది. కానీ ప్రాంతం పేరుతో నిఘంటువులు ఉంటాయా అని. 'తెలుగు నిఘంటువు' అని ఉండాలి కాని తెలంగాణ నిఘంటువు ఏమిటి అనే ప్రశ్న మొదటిగా భాషావేత్తల నుంచి వస్తుంది. ఏ ఆవిష్కరణ పుట్టుకైనా ఒక అవసరం నుంచే జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాని అవసరాలు ఏమిటి? ఏ పనులు చేపట్టాలి? ఏ వసతులను కల్పించుకోవాలి? అనే ప్రశ్నలు ప్రభుత్వానికి మాత్రమే కాదు, ప్రజలముందు సంస్థల ముందు ఉన్న ప్రశ్నలు. భాషా విషయికంగా తెలంగాణ రాష్ట్రానికి కొత్త అవసరాలు ఏర్పడ్డాయి. ఒకటి తెలుగును ఒక అధ్యయన అంశంగా పాఠశాలల్లోను కళాశాలల్లోను తప్పనిసరి అంశంగా పెట్టడం. రెండు– తెలుగును బోధన మాధ్యమభాషగా కళాశాల వరకు అమలు చేయడం. మూడోది– అన్నింటికన్నా ప్రధానమైన అవసరం తెలుగును అన్ని స్థాయిల్లోను పరిపాలన భాషగా అమలుచేయడం. ఇక నాలుగోది– న్యాయ పాలన. ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో కాక స్వతంత్ర పరిధిలో ఉంటుంది. కాని న్యాయపాలనలో, న్యాయస్థానాలలో భాష కూడా ప్రజల భాషలో ఉండాలనేది ప్రజల అభిమతం. అందువల్ల న్యాయపాలన భాష కూడా తెలుగులోనే ఉండాలి. ఇవన్నీ గాక మాధ్యమాలున్నాయి. అచ్చు, దృశ్యమాధ్యమాలున్నాయి. వాటి భాష ఎలా ఉండాలి, భాషకు సంబంధించిన ఈ అవసరాలు, ఈ పనులు అన్నీ ఇంతకుముందున్న ప్రభుత్వాలు ఉమ్మడి రాష్ట్రంలో చెప్పినవేగా కొత్తది ఏముంది అనేది మరొక ప్రశ్న. కాని ఇక్కడ తెలుగు అంటే తెలంగాణ ప్రాంతంలో మాట్లాడే తెలుగు అని గుర్తుపెట్టుకోవాల్సిన అంశం.

తెలంగాణలో భాషాపరమైన ఈ అవసరాలు సమకూర్చుకోవడానికి కొన్ని సాధనాలు లేదా పరికరకాలు అవసరం అవుతాయి. వాటిలో మొదటిది నిఘంటువులు. స్వాతంత్ర్యం కన్నా ముందునుంచే తెలుగు సినిమాల్లోను, పత్రికల్లోను ఒక తెలుగు వాడుకలో ఉన్నది. అది ఒక ప్రాంతం ప్రజలు కృష్ణ, గోదావరి ప్రాంత ప్రజలు మాట్లాడుకునే భాష ఆనాటి మాధ్యమాలలోకి వచ్చింది. దీన్నే 'శిష్ట వ్యావహారికం' అని భాషావేత్తలు అన్నారు. అది మాధ్యమాల ద్వారా అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అదే పద్ధతి నేటి దాకా కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ రాష్ట్రం కొద్దిరోజులు మనుగడలో ఉన్నది. కాని ఆ కొద్ది కాలంలో రాష్ట్రం తన భాషకు కావలసిన అవసరాలను ఆలోచించుకునే వ్యవధి చిక్కలేదు. ఈలోగానే తెలుగు వారికి అందరికీ కలిపి ఒక భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది. దీనితో తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన ప్రత్యేక భాషావసరాలు పూర్తిగా అడుగున పడిపోయాయి. అసలు ప్రభుత్వాలు భాషకు సంబంధించిన అంశాలను సీరియస్‌గా ఆలోచించే తీరిక గానీ చిత్తశుద్ధి కానీ ప్రదర్శించలేకపోయాయి. అధికార భాషా సంఘాలు, ఇతర కమిటీలు వ్యక్తుల కృషి, సంస్థల కృషి కావలసిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. అయినా ఉన్న కొద్దిగానైనా మాధ్యమాలలో, పాఠ్యపుస్తకాలలో, కొద్దిపాటిగా పాలనలోను ఉన్న తెలుగు అప్పటికి ప్రామాణిక భాషగా, మాధ్యమ భాషగా స్థిరపడిన భాషలోనే ఉండిపోయింది. తెలంగాణ ప్రాంతపు భాష ఉనికిని గురించి ఆలోచించే పరిస్థితి ఏ మాత్రం ఏర్పడలేదు. నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి సంధ్యలో మందుకు వచ్చిన అవసరాలన్నింటి లో ప్రముఖంగా భాష అనే అవసరం దాని అమలు అనే ఆవశ్యకత కొట్టవచ్చినట్లు కనపడింది. ఎందుకంటే రాష్ట్రం ఏర్పాటుకోసం జరిగిన ఉద్యమంలో ఉన్న ప్రధాన పోరాట భూమికలలో భాష చాలా ప్రముఖంగా నిలబడింది. రాష్ట్ర ఆవిర్భావానికి పాటుపడిన పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంతో తిరిగి పాలనలో కూడా భాష అంశం ప్రధానంగా నిలబడింది.

నిఘంటువులు నిర్మించుకోవడం కూడా ఆయా కాలాలకు తగిన అవసరాలకు అనుగుణంగానే ఉంటుంది. పద్యకావ్యాలు మాత్రమే ఉన్న రోజుల్లో వాటికి అనుగుణంగా ఆ అవసరాలకు పద్య నిఘంటువులు వచ్చాయి. క్రమంగా ఆధునిక విద్య ద్వారా ఆంగ్లభాషతో సంబంధాలు ఏర్పడి దానిలో ఆధునిక నిఘంటువులు చూసిన తర్వాత తెలుగుకు కూడా ఆధునిక నిఘంటువులు చేయవచ్చు అనే ఆలోచన కలిగి ఆ ప్రాతిపదికగా తెలుగులో అకారాదిగా ఏర్పాటు ఉండే, ఆధునిక నిఘంటువుల నిర్మాణం జరిగింది. కాలక్రమేణా భాషావసరాలకు అనుగుణంగా వివిధ రకాల, వివిధ శాస్త్రాల నిఘంటువులు తెలుగులో ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం అవసరానికి అనుగుణంగానే వ్యవహారభాషలో నిఘంటు నిర్మాణం ప్రధాన అవసరంగా నిలబడింది.

నేటి నిఘంటువుల నిర్మాణం కూడా పైన చెప్పిన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఈ రోజున జరుగవలసి ఉంది. మద్రాసు రాష్ట్రం 1950లో ఏర్పడింది. దరిమిలా 1956లోనే తమిళనాడు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడింది. రాష్ట్రంగా ఏర్పడిన తొలి సంవత్సరంలోనే పరిపాలన అంతా తమిళంలోనే ఉండాలని తీర్మానించుకున్నారు. పరిపాలనా భాషగా తమిళం అమలుకోసం పరిపాలన నిఘంటువు అవసరమని గుర్తించి ఆ ఏడాదే తమిళంలో పరిపాలన పద కోశాన్ని నిర్మించుకోవడం ప్రారంభించి పదేండ్లలో ఆ నిఘంటు నిర్మాణాన్ని పూర్తిచేశారు. తర్వాత ఆ నిఘంటువు అన్ని కార్యాలయాల్లో అధికారుల వద్ద ఉచితంగా అందేలా చర్యలు తీసుకున్నారు. పాలనా భాష విషయంలో ప్రభుత్వాల పట్టుదల అలా ఉండాలి. తెలుగు రాష్టం భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1956 నుంచి 2014 దాకా ఉన్నది. కాని ఇలాంటి ప్రజావసరమైన పనిని రాష్ట్రం చేపట్టలేదు. నియమించిన అధికార భాషా సంఘాలు కూడా ఈ పనిచేయలేకపోయాయి. తెలంగాణ ఏర్పడిన నాలుగేండ్ల తర్వాత నిఘంటు నిర్మాణాన్ని చేపట్టారు. దీన్ని పాలనా భాషానిఘంటువు అని కానీ, లేదా ఒక ప్రత్యేకమైన అవసరం కోసమని కానీ అన కుండా తెలంగాణభాషకు నిఘంటువు అని అన్నారు. నిజానికి తెలంగాణ రాష్ట్రానికి చాలా నిఘంటువుల అవసరం ఉంది. తెలంగాణలో నిజాం పాలనలో పరిపాలన అంతా ఉర్దూలో సాగింది. పాలనకు సంబంధించిన విశేషించి రెవెన్యూ, పదవులకు సంబంధించిన చాలా పారిభాషిక పదాలు ఉర్దూ పదాలు. గిర్దావర్, తెహసీల్, తెహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, మాలీ పటేల్, జప్తు, నాకాబంది, జమాబంది, ఠాణా, దఫ్తర్, అఫ్సర్, బలుతేదార్, గుత్తేదార్, కొత్వాల్, దస్తావేజ్, దరఖాస్తు, వసూల్, శిస్త్, కమామీష్.. ఇలా వందల పదాలు పాలనకు సంబంధించినవి ప్రజలభాషలో నిలిచిపోయాయి. నేటికీ ఇవి జన వ్యవహారంలో ఉన్నాయి. తెలంగాణ పాలన భాషకు నిఘంటువు నిర్మించుకుంటే ఈ వ్యవహార పదాలు బాగా ఉపయోగపడతాయి. అంతే కాదు అప్పటి న్యాయపాలన ఉన్నత విద్య కూడా ఉర్దూలోనే సాగింది. న్యాయపాలనలో చాలా పదాలు ఉర్దూ నుంచి తెలుగులోకి దిగుమతి అయి నేటికీ జన వ్యవహారంలో నిలిచి ఉన్నాయి. అవి కూడా ప్రత్యేక న్యాయపాలన నిఘంటువు నిర్మించుకోవడానికి ఉపయోగపడుతాయి. తెలంగాణకు విద్యాబోధన కోసం మరొక నిఘంటువు అవసరం ఉన్నది.

> **తెలంగాణ పాలన భాషకు నిఘంటువు నిర్మించుకుంటే ఈ వ్యవహార పదాలు బాగా ఉపయోగపడతాయి. అంతే కాదు అప్పటి న్యాయపాలన ఉన్నత విద్య కూడా ఉర్దూలోనే సాగింది. న్యాయపాలనలో చాలా పదాలు ఉర్దూ నుంచి తెలుగులోకి దిగుమతి అయి నేటికీ జన వ్యవహారంలో నిలిచి ఉన్నాయి. అవి కూడా ప్రత్యేక న్యాయపాలన నిఘంటువు నిర్మించుకోవడానికి ఉపయోగపడుతాయి.**

పాఠశాల, కళాశాల విద్య తెలుగులో చెప్పడానికి ఆ స్థాయిలో వివిధ శాస్త్రాలు తెలుగులో రచించి బోధించడానికి ఉపయోగపడేలా, పాఠశాల కళాశాల స్థాయి నిఘంటువు ఒకటి అవసరం ఉంది. దీన్ని కూడా ఆధునిక వ్యవహార భాషలోనే నిర్మించుకోవాలి. వీటన్నింటికి మించి తెలంగాణలో వ్యవహారంలో ఉన్న జనం భాషకు పూర్తి స్థాయి నిఘంటువు అవసరం ఉంది. ఇందుకోసం జనవ్యవహారంలో ఉన్న లక్షలాది పదాలను సేకరించవలసి ఉన్నది.

తెలంగాణలో వ్యవహారంలో లభించే అన్ని పదాలను సేకరించే బృహత్‌కార్యం రాష్ట్రప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా చేపట్టినట్లు తెలుస్తూ ఉంది. ఇది ఆహ్వానించదగినది. ఇలాంటి వ్యవహార కోశం అవసరం చాలా ఉన్నది. కారణం ఇటీవలి కాలంలో భాషలో చాలా వేగవంతంగా మార్పులు వస్తున్నాయి. నిజానికి సాహిత్యంలో మార్పులు పరిణామాలు వేగంగా వస్తాయి. దీనితో పోలిస్తే భాష వ్యవహారంలో మార్పులు పరిణామాలు చాలా ఆలస్యంగా వస్తాయి. కాని గడిచిన రెండు దశాబ్దాలలో సామాజిక పరిణామాలు, సాంకేతికంగా దేశంలో జరిగే అభివృద్ధి, దృశ్యమాధ్యమాల వ్యాప్తి కారణంగా భాషలో మార్పులు వేగవంతంగా వస్తున్నాయి. ఇంగ్లీష్ పదా లు వ్యవహారంలో చాలావేగంగా దూరిపోతున్నాయి. రెండు మూడు దశాబ్దాల క్రితం మారుమూల గ్రామాలలో జానపద సాహిత్య సేకరణకు పోతే అక్కడి గ్రామస్థులతో మాట్లాడినప్పుడు ఎక్కడో ఒక ఇంగ్లీషు పదం తప్ప అన్నీ తెలుగు మాటలే వినిపించేవి. ఈరోజుల్లో గ్రామాలలో విద్యాగంధంలేనివారి దగ్గర కానీ, లేదా కొద్దిగా చదువుకున్న వారి దగ్గర కానీ, చివరికి వయోధికులతో మాట్లాడినా వారి భాషలో ఇంగ్లీషు పదాలు చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలంగాణ ఉర్దూ పదాల కలయిక శతాబ్దాలుగా ఉన్నదే. కాని తెలంగాణ భాషలో ఇటీవలి కాలంలో వచ్చిన పరిణామం చాలా ఎక్కువ. ముందుముందు ఇంకా వేగంగా మార్పులు జరిగే అవకాశం ఉన్నది. ఈ సామాజిక పరిణామాల దృష్ట్యా వ్యవహార భాషా సేకరణ చాలా అవసరం. ఈ పదాలతో ఒక బృహత్ కోశాన్ని నిర్మిస్తే, తర్వాత వచ్చే దశాబ్దాలలో ఎలాంటి మార్పులు వచ్చాయో అంచనా వేసేందుకు అవకాశం ఉంటుంది. ఇది ఒక కాలంలో భాషను రికార్డు చేయ డం వంటిది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వృత్తి పద కోశాలను తయారుచేసింది. ఈ పదకోశాల కోసం తెలంగాణ జిల్లాల్లో కూడా పదాలను సేకరించారు. ఆ తర్వాత తెలంగాణలో వ్యవహారంలో ఉన్న భాషను సేకరించడం జరుగలేదు. ఇప్పుడు అలా సేకరిస్తే కనీసం ఇరువై ముప్పై ఏండ్ల క్రితం ఉన్న పదాలు కొన్ని ఎలా లుప్తం అయ్యాయి, వాటి స్థానంలో ఇతర భాషా పదాలు ఎలా వచ్చి చేరాయి అనే విషయం తెలుస్తుంది. ప్రాచీన కావ్యాలు అందునా తెలంగాణ ప్రాంత కవులు రాసిన కావ్యాలలో ఉన్న పదజాలం కూడా ఆనాటి వ్యవహారాన్ని చెప్పేవి కొన్ని కనిపిస్తాయి. వాటిని ఆనాడు ఉన్న భాషకు చేసిన నమోదుగా చెప్పవచ్చు. ఈ తరహాలోనే తెలంగాణ వ్యవహారంలో ఉన్న తెలుగు పదజాలాన్ని అంతా సేకరించాలి. ఇలా సేకరించడానికి ఒక ప్రణాళిక (ప్లాన్) ఒక విధానం (మెథడాలజీ) అవసరం.

ఇలాంటి జన వ్యవహారంలో ఉన్న భాషను సేకరించడానికి రెండు మంచి పద్ధతులు ఉన్నాయి. అది వివిధ గ్రామాలలోని ప్రజల్లోకి వెళ్ళి వారితో సంభాషించి పదాలను సేకరించడం. ఇలా సంభాషించడం అనేది నియతంగా ఉండదు. దీనికి ప్రత్యేకించి శిక్షణ ఇవ్వడం కూడా కష్టం. కాగా ఇలా వ్యవహార భాషను సేకరించడానికి బాగా తోడ్పడేది మౌఖిక సాహిత్యం. తెలంగాణ మౌఖిక సాహిత్యానికి గని వంటిది. చాలా ఆశ్రిత గాయక కులాలు సుదీర్ఘమైన పురాణాలను, ఇతిహాసాలను, అద్భుత కథలను పాడుతున్నారు. వివిధ రకాలైన జానపద గేయాలు, గేయకథలు ఇంకా పాడుతున్న కుల గాయకులున్నారు. ఈ సాహిత్యం అంతా తెలంగాణ వ్యవహార భాషకు అద్దం పడుతుంది. ఒగ్గుకథ, బైండ్లకథ, గౌడజెట్టికథ, డక్కలి పటం కథ, నులక చందయ్యల కథ, చిందు యక్షగానం, చిరుతల యక్షగానం, పిచ్చుకుంటి కథ, కూనపులికథ, అద్దపోళ్ళకథ, చాకలి పటం కథ, పాండవుల కథ, తోటి వారి కథ.. ఇలా వివిధ కులాల్లో ఉన్న గాయకులు ఇంకా వారి కథలను ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈ కథా సాహిత్యంలో ఉన్నదంతా తెలంగాణ వ్యవహార భాషయే. ఇక్కడ ఒక ఉదాహరణ గ్రహించవచ్చు. ద్రావిడ విశ్వవిద్యాలయంలోని జానపదవిజ్ఞాన శాఖ పన్నెండు రోజుల పాటు ఒగ్గుకథా కళారూపంలో మల్లన్న పురాణాన్ని సేకరించింది. ఇది 65 గంటలపాటు రికార్డు అయింది. దీన్ని కాగితాల మీద రాసినప్పుడు 1600 పూర్తి నిడివి పుటలు వచ్చింది. దీనిలో ఇప్పటిదాకా అచ్చుకాని సుమారు రెండు వందల సామెతలు వచ్చాయి. నిఘంటువులకు ఎక్కని కొన్ని వందల పదాలు వచ్చాయి. ఒక్క మల్లన్న కథలోనే ఇన్ని వచ్చాయి. ఇక ఒగ్గు కళాకారులు చెప్పేవే కనీసం పది దీర్ఘ ఇతిహాసాలున్నాయి. వాటిలో కూడా కొన్ని వందల వేల పదాలు లభిస్తాయి. ఈతీరులోనే మిగతా వివిధ కులాల గాయకులు పాడే కథలలో కొన్ని లక్షల పదాలు ఇప్పటిదాకా నిఘంటువులకు ఎక్కనివి దొరుకుతాయి. తెలుగు విశ్వవిద్యాలయంలో భాగమైన ఓరుగల్లు ప్రాంగణంలోని జానపద విజ్ఞాన గిరిజన విజ్ఞాన పీఠం వారు కొన్ని వందల గంటల మౌఖిక సాహిత్యాన్ని వేరువేరు కుల గాయకుల నుంచి సేకరించిన సాహిత్యం ఉన్నది. అది అంతా విని తిరిగి కాగితాల మీద రాస్తే కొన్ని వేలు, లక్షల పదాలు తెలంగాణ వ్యవహారానికి సం బంధించినవి లభిస్తాయి.

ఇలా సేకరించడంలో మరొక వైవిధ్యం ఉంది. ప్రతి కులం వారికి వారి సామాజిక నేపథ్యాన్ని బట్టి వారి దాతల వృత్తి నేపథ్యాన్ని బట్టి పద సంచయం మారుతుంది. అందువల్ల వేరు వేరు కుల గాయకులు పాడిన కథా సాహిత్యం నుంచి పద సంచయాన్ని సేకరించడం వల్ల వేరు వేరు సామాజిక నేపథ్యాలలోని వృత్తులలోని పదజాలం బాగా దొరికే వీలుంది. ఈ వైవిధ్యం నిఘంటు నిర్మాణానికి మంచి వరం అవుతుంది. ఇక ఇప్పటికే సేకరించిన సామెతలకు అదనంగా తిరిగి సామెతలు పొడుపు కథలు సేకరించడం వల్ల కూడా వ్యవహార భాష మరింత దొరుకుతుంది. అంతే కాదు, ఇలాంటి వివిధ కులాల వారి గాయకులు పాడే సాహిత్యంలో దేశ్య పదాల శాతమే నూటికి తొంభైకి పైగా ఉన్నది. ఇది వ్యవహార భాషా నిఘంటువుకు పెద్ద వరమే అవుతుంది. తెలంగాణ భాషకు నిఘంటువు నిర్మించే క్రమంలో నేటి వ్యవహార భాషను సేకరించడానికి ఇలా మౌఖిక సాహిత్యం వివిధ కులాల గాయకులు పాడినది చాలా గొప్ప ఆకరం అవుతుంది. నిఘంటు నిర్మాతలు మౌఖిక సాహిత్యాన్ని తప్పక పరిగణనలోనికి తీసుకొని నిఘంటు నిర్మాణంలోనికి గ్రహించవలసి ఉంది. లేకుంటే ఈ లోపం ఎప్పటి కీ లోపంగానే మిగిలిపోతుంది. నిఘంటువు అసమగ్రం అసంపూర్ణం అవుతుంది. అందువల్ల తెలంగాణ వ్యవహార భాషా నిఘంటువు కోసం మౌఖిక సాహిత్యం తప్పనిసరి విస్తృత ఆకరంగా నిలిచి ఉంది. దాన్ని వినియోగించుకోవడం మన కర్తవ్యం.

> **వ్యవహార భాషను సేకరించడానికి బాగా తోడ్పడేది మౌఖిక సాహిత్యం. తెలంగాణ మౌఖిక సాహిత్యానికి గని వంటిది. చాలా ఆశ్రిత గాయక కులాలు సుదీర్ఘమైన పురాణాలను, ఇతిహాసాలను, అద్భు త కథలను పాడుతున్నారు. వివిధ రకాలైన జానపద గేయాలు, గేయకథలు ఇంకా పాడుతున్న కుల గాయకులున్నారు. ఈ సాహిత్యం అంతా తెలంగాణ వ్యవహార భాషకు అద్దం పడుతుంది.**

– ఆచార్య పులికొండ సుబ్బాచారి, 94404 93604

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 12 మార్చి 2018

WWW.NTNEWS.COM

సిలికాన్ వ్యాలీలో రెండు దశాబ్దాల కాలం పాటు తిరుగులేని సంచలనంగా పేరు ప్రతిష్ఠలు సంపాదించిందిన వాణి కోలా అమెరికాలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కెరీర్ పారంభించి మోస్ట్ సక్సెస్‌ఫుల్ వ్యాపారవేత్తగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ-కామర్స్, మొబైల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్, మింత్రా, స్నాప్‌డీల్, బ్లూస్టోన్ లాంటి కంపెనీల విజయానికి కారణం వాణి.

సక్సెస్ మంత్ర



వెంచర్ క్యాపిటల్ రంగంలోని తొలితరం సంస్థల్లో వాణి కోలా సారథ్యంలోని కలారి క్యాపిటల్ ఒకటి. సుమారు 65 కోట్ల డాలర్ల విలువైన ఆస్తులతో వ్యాపారాన్ని నిర్వర్తిస్తున్నారీమె. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కలారి క్యాపిటల్ కెస్టార్ట్ పేరుతో సీడ్ ఫండింగ్ అందిస్తున్నది. స్వదేశానికి తిరిగివచ్చి భారత్ నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆవిర్భవించేందుకు వెంచర్ క్యాపిటలిస్ట్‌గా చేయూతనిస్తున్న వాణి కోలా సక్సెస్‌మంత్ర.

తొలి వెంచర్ క్యాపిటలిస్ట్ వాణి కోలా

వాణి కోలా భారతీయ వెంచర్ క్యాపిటలిస్ట్. భారతీయ వ్యాపార రంగంలో ఆమె ఒక సంచలనం. అందుకే ఫార్చ్యూన్ ఇండియా ఆమెను ఇండియన్ బిజినెస్‌లో అత్యంత శక్తివంతమైన మహిళగా పేర్కొంది. ఆమె భారతదేశపు తొలి దశ వెంచర్ కాపిటల్ సంస్థలలో ఒకటైన కలారీ క్యాపిటల్‌కు వ్యవస్థాపకురాలిగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో అత్యంత చురుకైన, విజయవంతమైన వెంచర్ క్యాపిటలిస్ట్‌గా వాణి పేరుగాంచారు.

చదువు, కెరీర్

వాణి హైదరాబాదులో జన్మించారు. ఇక్కడే చదువుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, అరిజోనా స్టేట్ యూనివర్సిటీ నుండి మాస్టర్ ఆఫ్ సైన్స్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికా వెళ్లిన ఆమె సిలికాన్ వ్యాలీలో దాదాపు 22 సంవత్సరాల పాటు తన కెరీర్‌ను కొనసాగించారు. అక్కడే సర్టస్ సాఫ్ట్‌వేర్ సంస్థను స్థాపించి దానికి సీఈఓగా వ్యవహరించారు. సర్టస్ స్థాపించడానికి ముందు రైట్‌వర్క్స్ అనే సంస్థను స్థాపించడమే కాక దానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు.

సిలికాన్‌వ్యాలీ నుంచి..

వాణి 22 సంవత్సరాల పాటు సిలికాన్ వ్యాలీలో పారిశ్రామికవేత్తగా పనిచేసిన తర్వాత 2006లో భారతదేశానికి తిరిగి వచ్చారు. ఆ తర్వాత బెంగళూరులో వెంచర్ క్యాపిటలిస్ట్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. న్యూ ఎంటర్‌ప్రైజ్ అసోషియేట్స్ (NEA)తో కలిసి భారత దేశంలో వెంచర్ కాపిటల్‌లోకి ప్రవేశించిన ఆమె 2012లో ఇండో యూఎస్ అడ్వైజర్స్ (IUVP)తో కలసి NEA భాగస్వామ్యం లేకుండానే కలారి క్యాపిటల్‌ను రీబ్రాండ్ చేశారు. 2012 సెప్టెంబరులో కలారి క్యాపిటల్ 150 మిలియన్ డాలర్ల నిధులతో తన కార్యకలాపాలు ప్రారంభించింది. వాణి నాయకత్వంలో ఆ సంస్థ 2017 నాటికి 650 మిలియన్ల ఆస్తులను సంపాదించుకున్నది.



అవకాశాలు పుష్కలం

'ఒక సంస్థను స్థాపించి దానిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడం అంత సులభం కాదు. అయితే ఈ పనిలో బోలెడు సంతృప్తి ఉంటుంది. ప్రొఫెషనల్‌గా మీకు దన్నుగా ఉండే వారిని జాగ్రత్తగా ఎంచుకోండి, వ్యక్తిగతంగా అండగా నిలబడే బలమైన వ్యవస్థను నిర్మించుకోండి. భారత్‌లో ఇప్పుడు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని వాణి కొత్తగా వచ్చే పారిశ్రామికవేత్తలకు సలహా ఇస్తున్నారు. అలాగే ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల కోసం చిన్న సైజు ఫండ్‌ను ఏర్పాటు చేయాలి. వారి విజయాలకు గుర్తింపు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో గుర్తింపు వారిని మరింత ప్రోత్సహిస్తుంది. అలాగే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్, కాంట్రాక్టుల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కూడా ప్రభుత్వాలను కోరుతున్నారు వాణి.

మార్కెట్ల అధ్యయనం..

భారతదేశానికి వచ్చిన తర్వాత వాణి కొత్త సంస్థలను స్థాపించడం కంటే వెంచర్ క్యాపిటలిస్ట్‌గా కొత్త ప్రయాణాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. వాణి దాదాపు ఒక నెల పాట ఇక్కడి మార్కెట్‌ను పరిశోధించి తన ప్రయాణానికి మార్గం సుగమం చేసుకున్నారు. తన పరిశోధనలో ఎంతో మందిని కలుసుకున్నారు. మాల్స్‌లలో కూర్చుని గమనిస్తూ భారతదేశ మార్కెట్‌ను వ్యాపార విపణిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత నూతన వెంచర్‌ను ప్రారంభించడానికి నిర్ణయించుకున్నారు.

మహిళలకు సవాలే..

భారతదేశంలో మహిళా పారిశ్రామికవేత్తలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అంటారు వాణి. 'ఉదాహరణకు ఇన్వెస్టర్ల విశ్వాసం. మహిళలు ప్రమోట్ చేస్తున్న స్టార్టప్‌లలో పెట్టుబడులకు ఇన్వెస్టర్ల నుంచి భరోసా లభించడం లేదు. అదేవిధంగా నెట్‌వర్కింగ్ సమస్య. బలమైన నెట్‌వర్కింగ్ లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకుపోవడం సాధ్యంకాదు. పైగా మహిళలు ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్, కుటుంబపరమైన బాధ్యతలను బ్యాలెన్స్ చేస్తుండాలి. సామాజిక కట్టుబాట్లు, నియమాలు, నియంత్రణలు ఎలాగూ వారిని మానసికంగా ప్రభావితం చేస్తూనే ఉంటాయి. వీటన్నింటిని అధిగమించాల్సి ఉంది' అంటారామె.

టెక్నాలజీ పైనే దృష్టి

కలారీ సంస్థ ప్రధానంగా టెక్నాలజీ కంపెనీలపైనే దృష్టి సారిస్తున్నది. ఎనిమిదేళ్లుగా కన్స్యూమర్ ఇంటర్నెట్ అవకాశాల గనిగా మారింది. ప్రస్తుతం ఇందులో వృద్ధి జోరు తగ్గింది. అందువల్ల ఫైనాన్షియల్ సర్వీసులు, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో సపోర్టింగ్ సర్వీసులపై ఫోకస్ చేస్తున్నట్లు వాణి పేర్కొంటున్నారు.

అవార్డులు

క్యాపిటలిస్ట్ వ్యాపారవేత్తగా వాణి సత్తా చాటడంతో ఆమె విజయాల్ని గుర్తించిన పలు సంస్థలు అవార్డులు ప్రకటించాయి. ఎకనామిక్ టైమ్స్ ప్రారంభించిన మొట్టమొదటి ప్రారంభ పురస్కారాలలో భాగంగా, 2015లో ఉత్తమ పెట్టుబడిదారిగా మిడిస్ టచ్ పురస్కారాన్ని ఇచ్చి సత్కరించింది. వ్యాపారంతో పాటు వ్యవస్థాపకతలో ఆమె చూపిన చొరవకు గాను NDTV ఉమన్ ఆఫ్ ఎర్త్ అవార్డును గెలుచుకున్నారు.



ప్రముఖ సంస్థల్లో పెట్టుబడులు

కలారి ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలువురు పారిశ్రామిక వేత్తలతో పనిచేస్తూ అంతర్జాతీయ కంపెనీలను నిర్మించడానికి, టెక్నాలజీపై దృష్టి కేంద్రీకరించడానికి, భారతదేశ దేశీయ వృద్ధిని మరింత వృద్ధి చేయడానికి ఆమెకు అవకాశం లభించింది. వాణి ఇ-కామర్స్, మొబైల్ సేవలు, విద్య, ఆరోగ్య సంరక్షణ సంస్థలలో పెట్టుబడులు పెట్టారు. కోలా ముఖ్యమైన వెంచర్ క్యాపిటల్ విజయాల్లో స్నాప్‌డీల్, మింత్రా, విఐఎ, అర్బన్ లాడర్, జివమే, రూబిక్యూ డాట్ కామ్, పవర్ టు ఎస్ఎంఇ, బ్లూస్టోన్‌లు ఉన్నాయి. ఫిబ్రవరి 2015 లో రతన్ టాటా ఈ సంస్థలో సలహాదారుగా కూడా వ్యవహరించారు. పలు వేర్వేరు విలువలు కలిగిన పోర్ట్‌పోలియో కంపెనీలను ఆమె తయారు చేశారు. కలారి సంస్థ రవి వెంకటేశన్, రామ్ గుప్తా వంటి పారిశ్రామిక నిపుణులను కూడా వెలుగులోకి తీసుకువచ్చింది. కలారీ, కెస్టార్ట్ మధ్య దాదాపు 75 కంపెనీలకు ఫండింగ్ అందజేశారు. వీటిలో మహిళలు సహవ్యవస్థాపకులుగా ఉన్నవి డజను వరకు ఉన్నాయి.

ఎదిరించి.. ఎదుగుతూ!



'ఆడదంటే పిల్లలను కనే యంత్రమా?' అన్న ఒకే ప్రశ్న ఆమె జీవితాన్ని మార్చేసింది. కట్టుబాట్ల కహానీలను దాటేసి స్త్రీ స్వేచ్ఛను చాటి చెప్పింది. పురుషులతో సమానంగా స్త్రీలను ఎందుకు చూడరని నినదించింది. ఆ సంకల్పంతో అనుకున్నది సాధించి దినదినాభివృద్ధి చెందుతున్నది!

ఆమె పేరు గీతా టాండన్. బాలీవుడ్ స్టంట్ ఉమన్‌గా ఆమెకు మంచి పేరున్నది. కానీ గీతా టాండన్ గత జీవితం అంతా ఆటు పోట్లే. జీరో నుంచి జీవితాన్ని మొదలుపెట్టి.. ఆ ఆటు పోట్లను అధిగమించింది ఆమె. గీత చిన్నతనంలోనే వాళ్లమ్మ చనిపోయింది. ఆలనా పాలనా చూసేవాళ్లు లేక బాల్యంలోనే ఎన్నో అవస్థలు పడింది. తెలిసిన వాళ్ల అబ్బాయితోనే గీతకు 15 ఏండ్ల వయసున్నప్పుడే పెండ్లి చేశారు. అప్పట్నుంచి ఆమె జీవితం మరింత అగాధంలోకి నెట్టబడింది. పొద్దున్నే లేవడం వండి పెట్టడం.. బట్టలు తుకడం.. ఇల్లు కడుగడం ఇదే సరిపోయేది. ఓ పక్కింటి వాళ్ల పలకరింపుల్లేవు.. పుట్టింటి వాళ్ల చూపుల్లేవు. అప్పుడు గీత బాగా ఆలోచించింది. ఆడదంటే పిల్లల్ని కనే యంత్రమా అని ప్రశ్నించింది. దానికి ఇంట్లో కట్టుబాట్లు మరింత కట్టుదిట్టం చేయడం.. వాటిని సహించలేక గీత తన ఇద్దరు పిల్లలతో ఇంట్లో నుంచి బయటకు రావడం.. తెలిసిన స్నేహితురాలి సహకారంతో పెండ్లిళ్లలో నృత్యాలు చేసే పనిలో కుదురడం జరిగిపోయాయి. తన సత్తా ఏంటో నిరూపించుకొని పరిచయాలు పెంచుకొని సినిమాల వైపు మళ్లింది. దినదినాభివృద్ధి చెందుతూ బాలీవుడ్‌లో పేరుమోసిన స్టంట్ ఉమన్‌గా పేరు సంపాదించింది గీత.


జుట్టు రాలుతున్నదా?



జుట్టు రాలిపోవడం ఇప్పుడు సర్వసాధారణం అయిపోయింది. అయితే జుట్టు పెరుగుదల ఆహారపు అలవాట్లు, జీవనశైలితో ముడిపడి ఉంటుంది. కాబట్టి జుట్టు ఊడకుండా ఉండేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో చదువండి.

- కురుల పెరుగుదల పాలకూర అద్భుతమైన ఆహారం. ఇందులో ఐరన్, విటమిన్ ఎ, సి, ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. ఇవి కాంతులీనే కురులు పొందడానికి తోడ్పడుతాయి.
- పాలు, పెరుగు, గుడ్లలో విటమిన్ బీ12, ఐరన్, జింక్, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు వంటి అత్యవసర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిలోని బయోటిన్ జుట్టు రాలడాన్ని అరికడుతుంది.
- వాల్‌నట్స్‌లో ఉండే బయోటిన్, బి కాంప్లెక్స్, విటమిన్లు, మెగ్నీషియం ఉంటాయి. ఇవి జుట్టు క్యూటికల్‌ని బలంగా చేసి మాడుకు పోషణ అందిస్తుంది.
- జుట్టు పలుచబడకుండా అరికట్టే విటమిన్ ఈ బార్లీలో పుష్కలంగా ఉంటుంది. అంతేకాక ఎర్ర రక్త కణాల ఉత్పాదనకు తోడ్పడి కుదుళ్లను బలంగా చేసే ఐరన్, కాపర్ దీనిలో మెండుగా ఉంటాయి.

అపవిత్రం ఎలా అవుతుంది?



శానిటరీ నాప్‌కిన్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెరుగుతున్నది. సంస్థలు.. సంఘాలు.. ప్రభుత్వాలు ఈ మార్పునకు కారణమవుతున్నాయి. నిన్నామొన్నటి వరకు ప్యాడ్స్ అనే మాట వస్తేనే 'షీ' అని చీదరించుకున్న వాళ్లే ఇప్పుడు 'ఇట్స్ ఫర్ షి' అని అవగాహన కల్పిస్తున్నారు.

పీరియడ్స్‌పై అవగాహన కల్పించడాన్ని చాలెంజ్‌గా తీసుకొని కొన్ని విద్యాసంస్థలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అలాంటి వాటిలో ముందుగా చెప్పుకునేది నోయిడాలోని అమిటీ యూనివర్సిటీ. కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అశ్విని కుమార్ చౌబే మొదట ఈ కార్యక్రమంలో #YesIBleed అనే యాష్‌ట్యాగ్ చాలెంజ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లి ప్రజల్లో మార్పు తీసుకురావాలని సూచించారు. ఇక అప్పట్నుంచి అమిటీ యూనివర్సిటీ రోజూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నది. రాజకీయ నాయకులను.. స్వచ్ఛంద సేవకులను.. టీచర్లను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారు నిర్వాహకులు. నెలసరి.. రుతుక్రమం అనేవి బూతు మాటలు కాదు. అవి మహిళకు సంబంధించిన ఆరోగ్య పదాలు. వాటిని తప్పుగా ప్రచారం చేయొద్దు అని చెప్తున్నారు. రుతుస్రావం అయితే మహిళ అపవిత్రం ఎలా అవుతుంది? అని ప్రశ్నిస్తున్నారు. దేశంలో ఇంకా 50 శాతం మందికి పీరియడ్స్‌పై అవగాహన లేదని.. #YesIBleed కార్యక్రమం ద్వారా వారినందరిలోనూ మార్పు తీసుకురావాలని పిలుపునిస్తున్నారు అమిటీ యూనివర్సిటీ విద్యార్థులు.

నాకు గుండె జబ్బు రావచ్చా?

నా వయసు 51 సంవత్సరాలు. జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాను. రోజూ బస్సులో వెళ్లి వస్తుంటాను. ఇటీవల ఓసారి ఛాతిలో నొప్పి వస్తే డాక్టర్‌కు చూపించుకున్నాను. అయితే అది గుండె సంబంధింత నొప్పి కాదని చెప్పారు. కానీ ఒక రకమైన భయం మనసులో ఉండిపోయింది. గుండెపోటు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? దయచేసి వివరాలు తెలుపగలరు.

- ఆర్. సుజాత, సిద్దిపేట



నిజానికి పురుషులతో పోలిస్తే స్త్రీలలో గుండె సంబంధిత సమస్యలు ఆలస్యంగా ప్రారంభం అవుతాయి. అయితే మీరు ఆ వయసు పరిధిలోకి ప్రవేశించారనే చెప్పవచ్చు. కొన్ని జాగ్రత్తలతో గుండె సంబంధిత సమస్యలను నివారించడం సాధ్యమే. మనం తీసుకునే ఆహారం, జీవనశైలి నేరుగా గుండె మీద ప్రభావం చూపుతాయి. సమతుల, పౌష్టికాహారం తీసుకోవడం అవసరం. పండ్లు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా చిక్కుళ్లు, పొద్దుతిరగుడు గింజల నేనే, వెల్లుల్లి కొలెస్ట్రాల్‌ను అదుపు చెయ్యడంలో కీలక పాత్ర వహిస్తాయి. మాంసాహారం తీసుకురనే వారైతే చికెన్, మటన్‌కు బదులుగా ఒమేగా 3 ఫ్యాటి ఆసిడ్లు ఎక్కువగా ఉండే చేపలు, రొయ్యల వంటి సీ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం మంచిది. మనదేశంలో స్త్రీలలో పొగ తాగే వారు చాలా తక్కువ కానీ పొగతాగే వారి పరిసరాల్లో ఉండడం వల్ల పరోక్షంగా నికోటిన్ ప్రభావానికి గురవుతుంటారు. కాబట్టి పొగతాగే వారికి దూరంగా ఉండాలి. ఒత్తిడి కూడా గుండె ఆరోగ్యాన్ని చాలా ప్రభావితం చేస్తుంది. కాబట్టి వీలైనంత వరకు ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్త పడాలి. వారంలో కనీసం 5 రోజుల పాటైనా వ్యాయామం చెయ్యడం తప్పనిసరి. ఇందుకు మీకు ఏ రకమైన వ్యాయామ పద్ధతి అనువుగా ఉంటే దాన్ని అనుసరించవచ్చు. యోగా, ధ్యానం వంటివి సాధన చెయ్యడం ద్వారా ప్రశాంతంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. వీటితో పాటు తగినంత విశ్రాంతి కూడా అవసరమే. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు ఈ నియమాలన్నీ క్రమం తప్పకుండా అనుసరించడంతో పాటు బీపీ, షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడం తప్పనిసరి. అయితే కొన్నిసార్లు అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వంశపారంపర్యంగా గుండెజబ్బులు రావచ్చు. వీటిని అదుపు చెయ్యడం లేదా నివారించడం సాధ్యపడకపోవచ్చు. కేవలం వాయిదా వెయ్యగలం అంతే.



డాక్టర్ జి. రమేష్
ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్
యశోద హాస్పిటల్
హైదరాబాద్

సునీత.. సూపర్ నర్సు!






పని చేయడానికి ఒక నిబద్ధత ఉండాలి. ఎంతటి కష్టాన్నైనా ఎదురించే ధైర్యం ఉండాలి. ఈ నర్సుకి కావాల్సినంత ధైర్యం, నిబద్ధత మెండుగా ఉన్నాయి. అందుకే ఏడు సంవత్సరాలుగా తన వృత్తిని నిర్విరామంగా చేస్తున్నది.

సునీతా ఠాకూర్ ఏఎన్ఎమ్ పూర్తి చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో నివాసం. ఆమె వైద్యం చేసే చోటుకి వెళ్లాలంటే ఇంద్రావతి నదిని దాటుకొని వెళ్లాలి. ఆ నదిలో మొసళ్లు సంచరిస్తుంటాయి. అయినా ఆమె మాత్రం ఏ మాత్రం భయం లేకుండా ఏడు సంవత్సరాలుగా పడవలో ఆ నదిని దాటుకొని వెళ్లి వైద్యం చేస్తున్నది. పైగా ఆ పడవను ఆమె స్వయంగా నడుపుతున్నది. ఎన్నోసార్లు మొసళ్లు ఆమె దారికి అడ్డుపడినా భయపడక వైద్యం చేస్తున్నది. గర్భవతులను, శిశువులను సంరక్షించడమే ఆమె బాధ్యతగా ముందడుగు వేస్తున్నది. అయితే సునీత కేవలం నది దాటడమే కాదు.. దాదాపు ఎనిమిది కిలోమీటర్ల మేర అడవిని దాటుకొని పల్లెల్లోకి వెళ్లాలి. అక్కడ ఎలాంటి వాహన సౌకర్యం ఉండదు. అయినా సునీత ఒక్కరోజు కూడా మానేయకుండా ఆ అడవుల్లో తిరుగుతూ వైద్యం చేస్తున్నది. 'ఇది నక్సలైట్ ఏరియా కూడా. అయితే ఏంటి? నేను నా ఉద్యోగం నేను చేస్తున్నా. ఎవరికీ నేను భయపడాల్సిన అవసరం లేదు. ఎంతోమంది పేదవాళ్లు ఇక్కడ వైద్యం కోసం వేచి చూస్తున్నారు. వాళ్లందరి సంరక్షణ నా బాధ్యత' అంటున్నది సునీత.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 12 మార్చి 2018

ప్రపంచ అవినీతి సూచీ-2017

ప్రభుత్వ విభాగాల్లో అవినీతి, పత్రికా స్వేచ్ఛ ఆధారంగా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 'ప్రపంచ అవినీతి సూచీ- 2017' పేరుతో నివేదికను విడుదల చేసింది. గతేడాది జరిగిన సంఘటనలను పరిగణలోకి తీసుకుని 180 దేశాలకు ర్యాంకులను కేటాయించింది. అవినీతి, పత్రికా స్వేచ్ఛను ఆధారంగా చేసుకుని ప్రతి దేశానికీ 0 నుంచి 100 మధ్య మార్కులు కేటాయించింది. '0' మార్కులు వస్తే అత్యంత అవినీతి గల దేశమని, 100 మార్కులు వస్తే పూర్తి నిజాయితీ గల దేశమని పేర్కొన్నది. ఈ ఏడాది 89 మార్కులతో అత్యంత తక్కువ అవినీతి గల దేశంగా న్యూజిలాండ్ నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో డెన్మార్క్ (88), ఫిన్లాండ్ (85), నార్వే (85), స్విట్జర్లాండ్ (85) ఉన్నాయి. 9 మార్కులతో అత్యంత అవినీతి గల దేశంగా సోమాలియా నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో దక్షిణ సూడాన్ (12), సిరియా (14), ఆఫ్ఘనిస్థాన్ (15), యెమెన్ (16) ఉన్నాయి. 40 మార్కులతో భారతదేశం 81వ స్థానంలో ఉన్నది. 2016లో భారత్ ర్యాంకు 79. బ్రిక్స్ దేశాల్లో దక్షిణాఫ్రికా 71, చైనా 77, బ్రెజిల్ 96, రష్యా 135వ స్థానంలో ఉన్నాయి. భారత్ పొరుగు దేశాలైన భూటాన్ 26, శ్రీలంక 91, పాకిస్తాన్ 117, బంగ్లాదేవ్ 143వ స్థానాల్లో ఉన్నాయి.



RRB, VRO, Group-IV



ప్రజాస్వామ్య ఒరవడి

గవర్నర్ జనరళ్ల నిర్ణయాలు

భారతదేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలకు పునాది పడింది బెంగాల్ విభజన సమయంలోనే ఆ తర్వాత క్రమంగా ప్రజా ఉద్యమాలన్నీ కలిసి స్వాతంత్రోద్యమంగా మార్పుచెందాయి. ఆ ఉద్యమాలకు మూలంగా నిలిచిన నాటి గవర్నర్ జనరళ్ల కొన్ని ముఖ్య నిర్ణయాలు నిపుణ పాఠకుల కోసం...

లార్డ్ రెండో మింటో (1905-10)

- ఇతని కాలంలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా 'స్వదేశీ ఉద్యమం' జరిగింది.
- ఢాకాలో 'ముస్లిం లీగ్' (1906)ను స్థాపించారు.
- ఇతను 1909లో మింటోమార్లే సంస్కరణలుగా పేరుగాంచిన భారత శాసన సభల చట్టాన్ని జారీ చేశారు.
- 'ఖుదీరామ్ బోస్'ను ఉరితీశారు.

లార్డ్ రెండో హార్డింజ్ (1910-16)

- ఇతని కాలంలో ఐదో జార్జి రాజు భారతదేశాన్ని సందర్శించాడు. ఇతని గౌరవార్థం 1911లో ఢిల్లీలో పట్టాభిషేక దర్బార్‌ను ఏర్పాటు చేశారు.
- ఇతను బెంగాల్ విభజనను రద్దు చేశాడు.
- రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చాలని 1911లో ప్రకటించి, 1912లో మార్చారు.
- రవీంద్రనాథ్ ఠాగూర్‌కు సాహిత్యంలో నోబెల్ (1913) బహుమతి వచ్చింది.
- మొదటి ప్రపంచ యుద్ధం (1914) ప్రారంభమైంది.
- 1915లో హిందూ మహాసభ ఏర్పడింది.

లార్డ్ ఛేమ్స్‌ఫర్డ్ (1916-21)

- ఇతని కాలంలో తిలక్, అనిబీసెంట్‌లు 'హోంరూల్ లీగ్'ను (1916) స్థాపించారు.
- కాంగ్రెస్‌లోని అతివాదులు, మితవాదులు 1916లో లక్నో సమావేశంలో ఒకటయ్యారు (1907 సూరత్ సమావేశంలో విడిపోయారు).
- 1919లో భారతీయులు నల్లచట్టంగా అభివర్ణించిన 'రౌలత్ చట్టాన్ని' జారీ చేశాడు.
- 1917లో చంపారన్ సత్యాగ్రహం, 1919లో ఖిలాఫత్ ఉద్యమం, 1919, ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ మారణకాండలు జరిగాయి.
- ప్రసిద్ధి చెందిన సహాయ నిరాకరణోద్యమం 1920లో ప్రారంభమైంది.
- మాంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలుగా ప్రసిద్ధిగాంచిన 1919 భారత శాసనసభల చట్టం చేశారు.
- వేల్స్ యువరాజు ఎడ్వర్డ్ భారతదేశాన్ని సందర్శించాడు.
- ఇతను పూనాలో 'మహిళా విశ్వవిద్యాలయాన్ని' ఏర్పాటు చేశాడు. 1917లో విద్యాభివృద్ధి కోసం సాడ్లర్ కమిషన్‌ను ఏర్పాటు చేశాడు.

లార్డ్ రీడింగ్ (1921-26)

- ఇతని కాలంలో చౌరీచౌరాలో అల్లర్లు జరగడంతో సహాయ నిరాకరణ ఉద్యమం నిలిచిపోయింది.
- 1920-21లో కేరళలో మోప్లా తిరుగుబాటు వచ్చింది.
- 1921లో 'భారత కమ్యూనిస్టు ఆఫ్ ఇండియా' కాన్పూర్‌లో స్థాపించారు.
- ఇతని కాలంలో 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)' నాగ్‌పూర్‌లో ఏర్పాటైంది.
- 1925లో కాకోరి దోపిడీ కేసు జరిగింది.
- 1923 నుంచి భారతదేశం, ఇంగ్లండ్‌లోను ఒకేసారి ఐసీఎస్ పరీక్షలు నిర్వహించే విధానం ఏర్పాటు చేశారు.
- వైస్రాయ్‌లలో ఈయన ఒక్కడే యూదు జాతికి చెందినవాడు.

లార్డ్ ఇర్విన్ (1926-31)

- ఇతని కాలంలో సైమన్ కమిషన్ భారతదేశాన్ని 1927లో సందర్శించింది.
- 1927లో స్వదేశీ సంస్థానాధీశులకు, బ్రిటిష్ వారికి మధ్య సంబంధాలను పెంపొందించడానికి బట్లర్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- 1928లో 'ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్' ఏర్పాటైంది.
- 1928లో మోతీలాల్ నెహ్రూ రాజ్యాంగ నివేదికను తయారు చేశాడు.
- 1929లో లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో 'పూర్ణ స్వరాజ్' ప్రతిపాదనను అంగీకరించారు.
- ప్రసిద్ధిగాంచిన 'శాసనోల్లంఘన ఉద్యమం' 1930లో ప్రారంభమైంది.
- మొదటి రౌండ్ టేబుల్ సమావేశం 1930లో జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ నుంచి ఎవరూ హాజరు కాలేదు.
- గాంధీ-ఇర్విన్ ఒడంబడిక (1931) జరిగింది.
- ఇతడిని 'క్రైస్తవ వైస్రాయ్' అని అంటారు.

లార్డ్ వెల్లింగ్‌టన్ (1931-36)

- ఇతని కాలంలో రెండో, మూడో రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగాయి.
- రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి మాత్రమే 'గాంధీ' హాజరయ్యారు.
- మూడు రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరైంది- డాక్టర్ బీఆర్ అంబేద్కర్
- ఇతని కాలంలోనే బ్రిటిష్ ప్రధాని రామ్‌సే మెక్ డొనాల్డ్ 'కమ్యూనల్ అవార్డ్'ను ప్రకటించారు. దీని ప్రకారం షెడ్యూల్డ్ తెగలు, తరగతులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పడ్డాయి.
- ప్రత్యేక నియోజకవర్గాలను వ్యతిరేకించిన గాంధీ, అంబేద్కర్‌కు మధ్య పూనాలోని ఎరవాడ జైలులో 'పూనా ఒప్పందం' జరిగింది.
- ఈ ఒప్పందం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలు కాకుండా రిజర్వు నియోజకవర్గాలు ఉంచాలనే అంశాన్ని నిర్ణయించుకున్నారు.
- కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, ఆల్ ఇండియా కిసాన్ సభ ఏర్పడింది.
- డెహ్రాడూన్‌లో భారత సైనిక అకాడమీని స్థాపించారు.
- 1935 భారత ప్రభుత్వ చట్టం రూపొందింది.

లార్డ్ లిన్ లిత్‌గో (1936-42)

- ఇతని కాలంలో 1935 చట్టం ప్రకారం ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో పూర్తి మెజారిటీ సాధించింది.
- కానీ, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జాతీయ కాంగ్రెస్ నాయకులను సంప్రదించకుండానే భారతదేశానికి జర్మనీ శత్రువుగా బ్రిటన్ ప్రకటించడంతో రాష్ట్రాల్లోని మంత్రివర్గాలు రాజీనామా చేశాయి.
- దీన్ని ముస్లిం లీగ్ విమోచన దినంగా పాటించింది.
- ఇతని కాలంలోనే ఆరో జార్జి ఇంగ్లండ్‌కు చక్రవర్తి అయ్యాడు.
- 1939లో సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్'ను ఏర్పాటు చేశాడు.
- 'క్రిప్స్ రాయబారం (1942)' జరిగింది. దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం (1942) ప్రారంభమైంది.

లార్డ్ వేవెల్ (19430-47)

- ఇతని కాలంలో 1944లో సీఆర్ ఫార్ములా (చక్రవర్తుల రాజగోపాలచారి ఫార్ములా) వచ్చింది.
- 1945లో వేవెల్ ప్రణాళిక, సిమ్లా సమావేశం జరిగింది.
- 1946లో క్యాబినెట్ మిషన్ (మంత్రివర్గ త్రయం) భారత్‌ను సందర్శించింది.
- ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్యాదినాన్ని పాటించింది (1946, ఆగస్టు 16).
- ఇతని కాలంలోనే రాజ్యాంగ పరిషత్ ప్రథమ సమావేశం జరిగింది.
- ఆజాద్ హింద్ ఫౌజ్, జపాన్ దళాలు భాతరదేశ భూభాగం నుంచి ఉపసంహరించబడ్డాయి.
- 'ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్‌ఏ)' సైనికులపై విచారణ జరిగింది.

లార్డ్ మౌంట్‌బాటన్ (1947-48)

- బ్రిటిష్ ఇండియా చివరి వైస్రాయ్, స్వతంత్ర భారత తొలి గవర్నర్ జనరల్.
- దేశ విభజన పథకాన్ని (1947) ప్రవేశపెట్టాడు. ఫలితంగా దేశం ఇండియా, పాకిస్థాన్‌లుగా విడిపోయింది.
- 1947, ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందింది.

చక్రవర్తుల రాజగోపాలచారి (1948-50)

- స్వతంత్ర భారతదేశ చివరి గవర్నర్ జనరల్. గవర్నర్ జనరల్ పదవి చేపట్టిన మొదటి భారతీయుడు.
- 1948, జూన్ 21 నుంచి 1950, జనవరి 25 వరకు గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు.

బ్రిటిష్ ఈస్టిండియా కాలంలో పత్రికారంగం

- **బెంగాల్ గెజిట్ (1780):** దీని ప్రచురణకర్త 'జేమ్స్ అగస్టస్ హిక్కీ'. ఇంగ్లిష్ భాషలో వెలువడిన ఈ పత్రిక భారతదేశంలో ప్రచురించిన మొదటి రాజకీయ వాణిజ్య పత్రిక.
- **ఇండియా గెజిట్ (1780):** దీని ప్రచురణకర్తలు పీటర్ రీడ్, బెర్నార్డ్ మెసింక్. వెలువడిన భాష- ఇంగ్లిష్. వీరు తమ ప్రతిక ద్వారా వ్యాపారాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించారు.
- **కలకత్తా గెజిట్ (1784):** ప్రచురణకర్త- ఈస్టిండియా కంపెనీ. బెంగాలీ, పర్షియన్, ఇంగ్లిష్ తదితర భాషల్లో నోటీసుల ముద్రణ.
- **మద్రాస్ కొరియర్ (1785):** ప్రచురణకర్తలు- రిచర్డ్ జాన్సన్, హ్యూగ్ బాయ్డ్. వెలువడిన భాష- ఇంగ్లిష్. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ ప్రకటనల కోసం ప్రచురించిన పత్రిక.
- **బాంబే కొరియర్ (1790):** ప్రచురించింది- లుక్ ఆష్ బర్నర్. వెలువడిన భాష- ఇంగ్లిష్. 1838లో బాంబే కొరియర్ 'రాబర్ట్ నైట్' సంపాదకత్వంలో 'బాంబే టైమ్స్'గా మారింది.
- **బాంబే హర్కార్ (1795):** ప్రచురించింది- విలియం హంటర్. వెలువడిన భాష- ఇంగ్లిష్. ఈ పత్రిక ద్వారకానాథ్ ఠాగూర్ నేతృత్వంలో బ్రహ్మ సమాజానికి మద్దతుగా పనిచేసింది.
- **మద్రాస్ గెజిట్ (1795):** ప్రచురణకర్త- విలియం. వెలువడిన భాష- ఇంగ్లిష్. ప్రభుత్వం తరపున మద్రాస్, బాంబేల నుంచి వెలువడిన పత్రిక.
- **కలకత్తా మార్నింగ్ పోస్ట్ (1798):** ప్రచురణకర్త- ఆర్చి బాల్డ్. వెలువడిన భాష- ఇంగ్లిష్. 1799లో జారీచేసిన పత్రికా నిబంధనలను పాటించిన మొదటి పత్రిక.
- **సోమ్‌ప్రకాష్ (1858):** ప్రచురణకర్త- ద్వారకానాథ్ విద్యాభూషణ్. వెలువడిన భాష- బెంగాలీ. కలకత్తా నుంచి ప్రచురించిన రాజకీయ పత్రిక.
- **పయనీర్ (1865):** ప్రచురణకర్త- ఎస్ఎస్ ఘోష్. వెలువడిన భాష- ఇంగ్లిష్. సమాకాలీన సంఘటనలపై వార్తలు, వ్యాసాలు ప్రచురించే దినపత్రిక.
- **ది ఇండియన్ రివ్యూ (1900):** ప్రచురణకర్త ఏ నటేశన్. వెలువడిన భాష- ఇంగ్లిష్. ప్రఖ్యాత భారతీయుల రాజకీయ చరిత్రలపై వ్యాసాలు ప్రచురించే మాసపత్రిక.



సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492 575 006

దేశంలోని నౌకాశ్రయాలు

కాండ్లా పోర్ట్- గుజరాత్



గుజరాత్‌లో అతిపెద్ద పోర్ట్ ఇది. 1950లో దీని నిర్మాణం జరిగింది. కచ్ జిల్లాలో గాంధీధామ్ సిటీకి దగ్గరలో ఈ పోర్ట్ ఉంది. ఇండియాలోనే కాకుండా ఆసియాలోనే స్పెషల్ ఎకానమిక్ జోన్‌గా ప్రసిద్ధి. పెట్రోలియం, కెమికల్స్, ఐరన్, విత్తనాలు, ఉప్పు, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన వస్తువులను ఎగుమతి, దిగుమతి చేస్తుంది. భారతదేశంలోనే అత్యధిక ఆదాయ వనరుగా ఈ పోర్ట్‌కు పేరుంది. గుజరాత్‌లో ఈ పోర్ట్ కాకుండా, ముంద్రా అనే మరో పోర్ట్ కూడా ఉంది. ఇది దేశంలో అతిపెద్ద ప్రైవేట్ పోర్ట్.

జవహర్‌లాల్ నెహ్రూ- మహారాష్ట్ర

దీన్ని నవ సేవ ఓడరేవు అని కూడా పిలుస్తారు. 1989 మే 26న ప్రారంభమైంది. మహారాష్ట్రలోని కొంకన్ తీర ప్రాంతంలో ఈ ఓడరేవు ఉంది. దేశంలోనే అతిపెద్ద కంటైనర్ వ్యవస్థ కలిగిన పోర్ట్ ఇది. అంతర్జాతీయంగానూ కంటైనర్ వ్యవస్థను కలిగి ఉన్నందున కింగ్ ఆఫ్ పోర్ట్‌గా కూడా పేరుంది. టెక్స్‌టైల్స్, మిషనరీ, ఆయిల్, కెమికల్స్, కూరగాయల వంటి ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులను కొనసాగిస్తుంది.

ముంబై పోర్ట్

వెస్ట్ ముంబైలో సహజసిద్ధమైన ప్రదేశంలో ఈ పోర్ట్ ఉంది. 1870లో ఈ పోర్ట్ నిర్మాణం జరిగింది. ఇండియాలోనే అతిపెద్ద పోర్ట్ ఇది. క్రూడ్, పెట్రోలియం ఎగుమతి, దిగుమతి చేస్తూ అంతర్జాతీయ కంటైనర్ వ్యవస్థను కలిగి ఉంది.

మార్మగావ్ పోర్ట్- గోవా

గోవాలోని ప్రధాన పోర్ట్ ఇది. 1963లో ప్రధాన నౌకాశ్రయంగా గుర్తించబడింది. గోవాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇనుము, దానికి సంబంధించిన రా మెటీరియల్‌కు ఎగుమతి కేంద్రంగా మారింది. భారతదేశపు అత్యాధునిక పోర్ట్‌గా పేరుగాంచింది.

పనంబూర్ పోర్ట్- కర్ణాటక

ఈ పోర్టు న్యూ మంగళూరు పోర్ట్‌గా సుపరిచితం. 1974 మే 4న ఈ పోర్ట్ ప్రారంభమైంది. కర్ణాటకాలోని దక్షిణ కన్నడ జిల్లాలో సూరత్‌కల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉంది. కర్ణాటకలో ప్రధానమైన ఈ పోర్టు దేశంలో అతిపెద్ద పోర్టు అని చెప్పవచ్చు. మాంగనీస్, గ్రానైట్ స్టోన్స్, కాఫీ, కలప, పెట్రోలియం వంటి ఉత్పత్తులను ఎగుమతి చేస్తుంది.

కొచ్చిన్ పోర్ట్- కేరళ

దేశంలోని అతిపొడవైన పోర్ట్ ఇది. 1928 మే 26న ప్రారంభమైంది. అరేబియా సముద్రానికి ప్రధాన పోర్ట్ కూడా. విల్లింగ్డన్, వల్లర్‌పడం అనే ద్వీపాల మీద ఈ పోర్ట్ ఉంది. సముద్ర సుగంధాలను కలిగిన పోర్ట్ ఇది. దీనికి సొంతంగా కొచ్చి అనే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కూడా ఉంది.

టుటికోరిన్ పోర్ట్-తమిళనాడు

లోతైన సముద్ర నౌకాశ్రయం ఇది. దేశంలో ఉన్న ఇతర పోర్టుల్లోకెల్లా అతి ప్రధానమైంది. 1974లో ప్రారంభమైంది. తమిళనాడులోని అతిపొడవైన రెండో పోర్టే కాకుండా, దేశంలో అతిపెద్ద కంటైనర్ వ్యవస్థను కలిగి ఉంది. బెంగాల్ వద్ద సముద్ర వాణిజ్యం, పెర్ల్ చేపల పెంపకానికి ఉత్తమ ఓడరేవు ఇది. పెర్ల్ సిటీగా ప్రసిద్ధి.

చెన్నై పోర్ట్

దేశంలో అతి పురాతన పోర్ట్ చెన్నై పోర్ట్. 1881లో పోర్ట్ ఆపరేషన్స్ ప్రారంభమయ్యాయి. దేశంలో అతిపెద్ద పొడవైన రెండో నౌకాశ్రయం కూడా. కార్ల కోసం హబ్ పోర్ట్ ఉంది. ఆటోమొబైల్స్, బొగ్గు, ఫర్టిలైజర్స్, పెట్రోలియం ప్రొడక్ట్స్ ఎగుమతి, దిగుమతులను చేస్తుంది. ఈ పోర్ట్ టెర్మినళ్ల చుట్టూ లైట్‌హౌస్, ఇంట్రా పోర్ట్ కనెక్టివిటీ, రైల్వే టెర్మినస్‌ను కలిగి ఉంది.

వైజాగ్ పోర్ట్

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉంది. 1933, డిసెంబర్ 19న ప్రారంభమైంది. దేశంలో అతి పురాతన ఓడరేవు కాకుండా, అతి పొడవైన నౌకాశ్రయం కూడా. ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్ కాకుండా కాకినాడ నౌకాశ్రయం కూడా ఉంది.

పారదీప్ పోర్ట్- ఒడిశా

ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో ఉంది. 1966 మార్చి 12న ప్రారంభమైంది. లోతైన నీటి ఓడరేవు ఇది. సొంత రైల్వే సిస్టమ్ ఈ నౌకాశ్రయానికి ఉంది. జాతీయ రహదారి పోర్ట్, ఇతర రహదారి నెట్‌వర్క్‌ను జత చేస్తుంది.

హల్దియా పోర్ట్- వెస్ట్ బెంగాల్

వెస్ట్ బెంగాల్‌లోని హుగ్లీ నది ఒడ్డున ఈ పోర్ట్ ఉంది. 1967లో ప్రారంభమైంది. కలకత్తాలో ప్రధాన పోర్ట్. కెమికల్స్, పెట్రో కెమికల్స్, ఆయిల్స్ వంటి ఉత్పత్తులను దిగుమతి చేస్తుంది.

... బాలు జాజాల

పరిశోధన సంస్థలు

ప్రతి విషయానికి పరిశోధన అనేది ముఖ్యం. సమస్యల పరిష్కారానికి, నూతన విషయాలను నిరూపించడానికి, కొత్త ఆలోచనలు, సిద్ధాంతాలను అభివృద్ధి చేయడానికి చేసే అధ్యయనాన్ని పరిశోధన అంటారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే అందుకు తగిన వనరుల లభ్యత అవసరం. వాటిని సమాజాభివృద్ధికి అనుగుణంగా, పర్యావరణహితంగా ఎలా వాడుకోవాలో, ఏం చేయాలో పరిశోధన ద్వారానే తెలుస్తుంది. ఇందుకు దేశంలో ఉన్నత విద్య తర్వాత పరిశోధన చేయడానికి చాలా సంస్థలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్

- దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది.
- ఇది భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో 1958లో ఏర్పడింది.
- దీని ఆధ్వర్యంలో 52 ప్రయోగశాలలు ఉన్నాయి.
- శక్తికి మూలం సైన్స్‌లోనే ఉంది అనేది దీని నినాదం.

సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ

- ఇది తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉంది.
- దీనిని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 1977లో ఏర్పాటు చేశారు.
- మానవ జీవన భద్రత, అంటురోగాలు తదితర వ్యాధులపై అధ్యయనం చేస్తుంది.
- దీనికి డైరెక్టర్‌గా రాకేష్ మిశ్రా వ్యవహరిస్తున్నారు.

నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- ఇది హైదరాబాద్‌లో ఉంది.
- దీనిని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 1961లో ఏర్పాటు చేశారు.
- భూగర్భ జల వనరులు, భూకంప ప్రమాదం, భూమి లోపలి నిర్మాణం, దాని పరిణామం వంటివాటిపై అధ్యయనం చేస్తుంది.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్

- ఇది హైదరాబాద్‌లో ఉంది.
- దీనిని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ ఆధ్వర్యంలో 1958లో ఏర్పాటు చేశారు.
- దీనికి డైరెక్టర్‌గా ఆర్ హేమలత వ్యవహరిస్తున్నారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ

- ఇది హైదరాబాద్‌లో ఉంది.
- దీనిని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 1944లో ఏర్పాటు చేశారు.
- ప్రాథమిక, అనువర్తిత, బయో, బయోఇన్ఫర్మాటిక్స్, రసాయన ఇంజినీరింగ్‌లపై పరిశోధనలను నిర్వహిస్తుంది.
- దీనికి డైరెక్టర్‌గా శ్రీవారి చంద్రశేఖర్ వ్యవహరిస్తున్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్

- ఇది న్యూఢిల్లీలో ఉంది.
- దీనిని 1929లో స్థాపించారు.
- వ్యవసాయ విద్య, పరిశోధనకు సంబంధించినవాటిపై బాధ్యత వహిస్తుంది.
- దీని అధ్యక్షుడు రాధామోహన్ సింగ్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్

- ఇది ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఉంది.
- అటవీ పరిశోధన, అటవీ వినియోగదారుల సంస్థలకు అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, అటవీ విద్యను అందించడానికి 1987లో స్థాపించారు.

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్

- ఇది ముంబైలో ఉంది. అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తున్న భారత ప్రభుత్వ జాతీయ కేంద్రం.
- దీనిని సర్ హోమీ బాబా విజన్‌తో, దొరాబ్జి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో 1945లో స్థాపించారు.
- దీనిలో భౌతిక, రసాయన, జీవ, గణిత శాస్త్రాల్లో, కంప్యూటర్ సైన్స్ విద్యలో పరిశోధనలు చేస్తున్నారు.
- సందీప్ త్రివేది దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

సెంట్రల్ గ్లాస్, సెరామిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- ఇది కోల్‌కతాలో ఉంది.
- దీనిని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 1950లో స్థాపించారు.
- ఇది గాజు, సెరామిక్, మైకా ప్రాంతాలను అధ్యయనం చేస్తుంది.
- కే మురళీధరన్ దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

సెంట్రల్ షీప్ అండ్ ఊల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- ఇది రాజస్థాన్‌లోని మల్‌పురాలోని అవికానగర్‌లో ఉంది.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ అనుబంధ సంస్థ అయిన దీనిని 1962లో స్థాపించారు.
- ఇది గొర్రెలు, కుందేళ్లకు సంబంధించిన పరిశోధన, శిక్షణ నిర్వహిస్తుంది.
- దీని ఆఫీస్ ఇన్‌చార్జ్‌గా అరుణ్ కుమార్ తోమార్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్సెస్

- ఇది ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఉంది.
- ఇది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేస్తున్నది.
- దీనిని ప్రత్యేకంగా చేపల పెంపకంలో పరిశోధన చేయడానికి 1983లో స్థాపించారు.
- కుల్‌దీప్ కుమార్ దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ

- ఇది కర్ణాటకలోని బెంగళూరులో ఉంది.
- దీనిని 1938లో స్థాపించారు.
- ఇది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్స్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.

సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ జ్యూట్ అండ్ అలైడ్ ఫైబర్స్

- ఇది పశ్చిమబెంగాల్‌లోని బరక్‌పూర్‌లో ఉంది.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఆధ్వర్యంలో దీనిని 1953లో స్థాపించారు.
- ఇది జనపనార, అనుబంధ పంటలపై పరిశోధన చేస్తుంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ అండ్ ట్రీ బ్రీడింగ్

- ఇది తమిళనాడులోని కోయంబత్తూరులో ఉంది.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దీనిని 1988లో స్థాపించారు.
- అటవీ నిర్మూలన, సాంఘిక అటవీప్రాంతాల్లోని చెట్ల రకాల జాతులను గుర్తించడానికి, అటవీ అభివృద్ధికి ఇది కృషిచేస్తుంది.
- మోహిత్ గెరా దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్

- ఇది కోల్‌కతాలో ఉంది.
- మహేంద్ర లాల్ సర్కార్ అనే ఒక ప్రైవేట్ వైద్యుడు దీనిని 1876లో స్థాపించారు.
- ప్రాథమిక సైన్స్‌పై ఈ సంస్థ దృష్టి పెడుతుంది.
- దీనికి అధ్యక్షుడిగా మన్మోహన్ శర్మ, డైరెక్టర్‌గా శంతను భట్టాచార్య వ్యవహరిస్తున్నారు.


ఆరిడ్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- ఇది రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఉంది.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దీనిని 1988లో స్థాపించారు.
- వేడి, సెమీ శుష్క ప్రాంతాల్లో జీవవైవిధ్యాన్ని కాపాడటానికి, సాంకేతికతను అందించడానికి అటవీ శాస్త్రంలో శాస్త్రీయ పరిశోధనను నిర్వహిస్తుంది.
- ఐడీ ఆర్య దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

... చాపల సత్యం

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 12 మార్చి 2018

'బయోస్టాసిస్'తో మృత్యుంజయం!



- ప్రమాదాలు, యుద్ధాల్లో తీవ్రంగా గాయపడినవారు ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే ఘటన జరిగినప్పటి నుంచి వైద్య చికిత్స అందడానికి మధ్యనున్న స్వల్పకాలం ఎంతో అమూల్యమైనది. క్షతగాత్రులను దవాఖానలకు తీసుకెళ్లినప్పుడు ఒకవేళ వారు చనిపోతే 'కొంచెం ముందుగా తీసుకొచ్చి ఉంటే ప్రాణాలు దక్కేవి' అని వైద్యులు చెప్పడం మనం తరచూ వింటూనే ఉంటాం. ప్రమాదం జరిగిన ప్రాంతానికి దగ్గరలో దవాఖాన లేకపోవడంవల్ల, సరైన రవాణా సదుపాయం లేకపోవడంవల్ల బాధితులను దవాఖానకు చేర్చడంలో ఆలస్యం జరుగుతుంది. దీంతో సకాలంలో వైద్యం అందక మరణం సంభవిస్తుంది. ఇలాంటి మరణాలను అడ్డుకోవడమే లక్ష్యంగా అమెరికా రక్షణ పరిశోధన సంస్థ 'డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ప్రాజెక్టు ఏజెన్సీ' (DARPA)కి చెందిన శాస్త్రవేత్తలు ఓ సంచలన అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. ఆపత్కాలంలో బాధితుల శరీరంలో జీవక్రియలను నెమ్మదింపజేసి ప్రాణాలను నిలబెట్టడమే లక్ష్యంగా పరిశోధనలకు సిద్ధమయ్యారు. ఈ ప్రాజెక్టుకు 'బయోస్టాసిస్' అని పేరుపెట్టారు. మన శరీరంలో పరమాణు స్థాయిలో నిరంతరం జీవరసాయన చర్యలు జరుగుతాయి. ఈ జీవక్రియలను ఎలాంటి ప్రమాదం లేకుండా కణస్థాయిలో క్రమంగా కణజాల స్థాయిలో, అవయవ స్థాయిలో నెమ్మదింపజేయడంపై DARPA సైంటిస్టులు దృష్టి కేంద్రీకరించారు. ఈ పరిశోధన పూర్తయితే చావు, బతుకుల మధ్య ఉన్న ఆ స్వల్పకాలంలో జీవక్రియల వేగం తగ్గించి బాధితుల ప్రాణాలను కాపాడొచ్చు.

ఎంసెట్ -2018

- **తొలిసారి ఆన్‌లైన్‌లో ఎంసెట్**
- **మే 2, 3న అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీం పరీక్ష**
- **మే 4, 5, 7న ఇంజినీరింగ్ స్ట్రీం పరీక్ష**
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ ఏప్రిల్ 4**

తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ – 2018 (టీఎస్ ఎంసెట్) నోటిఫికేషన్‌ను జేఎన్‌టీయూహెచ్ విడుదల చేసింది.



- **వివరాలు:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చర్, మెడికల్ తదితర కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా నిర్వహించే ప్రవేశపరీక్ష ఎంసెట్. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ నిర్వహిస్తుంది.
- **ప్రవేశాలు కల్పించే కోర్సులు:** బీఈ, బీటెక్/బీటెక్ (బయో టెక్నాలజీ)/ బీటెక్ (డెయిరీ టెక్నాలజీ), బీటెక్ (అగ్రి.ఇంజినీరింగ్), బీఫార్మసీ, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ (ఫారెస్ట్రీ), బీవీఎస్సీ & ఏహెచ్/బీ.ఎఫ్.ఎస్సీ.
- **ఫార్మా – డీ**

అర్హతలు

ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ, బీటెక్ (డెయిరీ టెక్నాలజీ), బీటెక్ (అగ్రి ఇంజినీరింగ్), 50 శాతం సీట్లు బీఫార్మసీ & బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సులకు:

- కనీసం 45 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 40 శాతం మార్కులతో) ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/ బయాలజీ లేదా తత్సమాన సబ్జెక్టులు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ వొకేషనల్ కోర్సులు చదివిన/చదువుతున్నవారు అయితే సంబంధిత బ్రిడ్జి కోర్సు చేసి ఉండాలి.
- ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం తీసుకునేవారికి డిసెంబర్ 31 నాటికి 16 ఏండ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- బీటెక్ (డెయిరీ టెక్నాలజీ), బీటెక్ (అగ్రి. ఇంజినీరింగ్), బీటెక్ (ఎఫ్‌టీ)లో ప్రవేశాలు పొందాలనుకునేవారికి 2018, డిసెంబర్ 31 నాటికి 17 ఏండ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి 22 ఏండ్లు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అయితే 25 ఏండ్లు మించరాదు.

బీఫార్మసీ (ఎంపీసీ వారికి కేటాయించగా మిగిలిన 50 శాతం) –

- ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఆప్షనల్ సబ్జెక్టులుగా చదివిన వారు.
- ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులు. ప్రవేశ సమయానికి 16 ఏండ్లు మించరాదు. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- ఫార్మా – డీ కోర్సు (ఎంపీసీ విద్యార్థులకు– 50 శాతం, బైపీసీ– 50 శాతం సీట్లు కేటాయిస్తారు)
- ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్/బయాలజీ ఆప్షనల్ సబ్జెక్టులుగా చదివినవారు. ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత. 2018, డిసెంబర్ 31 నాటికి 17 ఏండ్లు నిండి ఉండాలి.

బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్/బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ (ఫారెస్ట్రీ), బీవీఎస్సీ & ఏహెచ్/బీ.ఎఫ్.ఎస్సీతోపాటు బీటెక్ (ఎఫ్‌టీ)లో మిగిలిన 50 శాతం సీట్లకు అర్హతలు:

- ఇంటర్/10+2 లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులు. లేదా ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

కింద పేర్కొన్న ఏవైనా రెండు సబ్జెక్టులను చదివి ఉండాలి.

బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ –
1. ఫిజికల్ సైన్సెస్ 2. బయాలజికల్/ నేచురల్ సైన్సెస్.
3. అగ్రికల్చర్
4. వొకేషనల్ కోర్సు ఇన్ అగ్రికల్చర్

బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ –
1. ఫిజికల్ సైన్సెస్ 2. బయాలజికల్/నేచురల్ సైన్సెస్
3. అగ్రికల్చర్ 4. వొకేషనల్ కోర్సు ఇన్ అగ్రికల్చర్

బీఎస్సీ (ఫారెస్ట్రీ) –
1. ఫిజిక్స్ 2. కెమిస్ట్రీ 3. బయాలజీ
లేదా 1. మ్యాథమెటిక్స్ 2. బయాలజీ 3. ఫిజిక్స్ 4. కెమిస్ట్రీ

బీవీఎస్సీ & ఏహెచ్ –
1. ఫిజికల్ సైన్సెస్ 2. బయాలజికల్ లేదా నేచురల్ సైన్సెస్

బీ.ఎఫ్.ఎస్సీ –
1. ఫిజికల్ సైన్సెస్ 2. బయాలజికల్/నేచురల్ సైన్సెస్
3. వొకేషనల్ కోర్సులో ఫిషరీ సైన్సెస్

బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) –
1. మ్యాథ్స్ 2. ఫిజికల్ సైన్సెస్ లేదా
1. ఫిజికల్ సైన్సెస్ 2. బయాలజికల్/నేచురల్ సైన్సెస్

ప్రవేశాలు కల్పించే విధానం:

- ఎంసెట్‌లో వచ్చిన మార్కులకు నార్మలైజేషన్ విధానంలో 75 శాతం వెయిటేజీ, ఇంటర్‌లో సంబంధిత గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ర్యాంకులను ప్రకటిస్తారు. ఈ ర్యాంకుల ఆధారంగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

స్ట్రీం	తేదీ	సమయం
అగ్రికల్చర్ & మెడికల్ (ఏఎం)	మే 2, 3	ఉదయం 10 గం|| నుంచి 1వరకు మ. 3 గం. నుంచి 6 వరకు
ఇంజినీరింగ్ (ఈ)	మే 4, 5, 7	ఉదయం. 10గం. నుంచి 1 వరకు మధ్యాహ్నం 3 నుంచి 6 వరకు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 4

ఫీజు:

అగ్రికల్చర్ & మెడికల్ –
- ఎస్సీ/ఎస్టీలకు రూ. 400/–, ఇతరులకు రూ. 800/–

ఇంజినీరింగ్
- ఎస్సీ, ఎస్టీలకు రూ. 800/–, ఇతరులకు రూ. 1,600/–
- **వెబ్‌సైట్:** http://eamcet.tsche.ac.in

TS EAMCET – 2018 Office
Examinations Building, Ground Floor,
Jawaharlal Nehru Technological University Hyderabad
Kukatpally, Hyderabad – 500 085.
Telangana Phone: +91 9912330730, 9121266980
Timings: 10.00 AM to 5.00 PM
Email: helpdesk.tseamcet2018@jntuh.ac.in
Link: http://eamcet.tsche.ac.in

... ✍ **కేశవపంతుల వేంకటేశ్వరశర్మ**

'పది' ఒత్తిడిని జయిద్దామిలా

రాష్ట్రవ్యాప్తంగా మార్చి 15 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధం కాగా, మరికొందరు కొన్నిరకాల ఆలోచనల్లో అనవసరమైన ఒత్తిడికి లోనవడం సర్వసాధారణం. ఈ భయాందోళనలను, ఒత్తిడిని జయించి మానసికంగా ఎలా సన్నద్ధం కావాలో, ఎలాంటి ప్రణాళికలు ముందస్తుగా అమలు చేయాలో తెలుసుకుందాం.

మానసిక సంసిద్ధత

- ప్రతి విద్యార్థి ముందుగా కింది విధంగా అనుకోవడం, తనను తాను విశ్లేషించుకోవడం చాలా అవసరం. రాష్ట్రంలో నేను ఒక్కడినే పది పరీక్షలు రాయడం లేదు. నాతోపాటు దాదాపు 4 లక్షల మంది రాస్తున్నారు. వారిలో నేను ఒక్కడిని. ఇంతమందికి లేని భయం, ఆందోళన నాకే ఎందుకుండాలి? అవసరం లేదు. రాష్ట్రంలో ఎస్ఎస్‌సీ బోర్డు స్థాపించినప్పటి నుంచి ఎన్నో ఏండ్లుగా, ఎన్నో లక్షల మంది ప్రతి ఏడాది ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. తమ శక్తి మేరకు ఫలితాలు సాధిస్తున్నారు. జీవితంలో వివిధ రకాల స్థాయిల్లో విజయకేతనం ఎగురవేస్తున్నారు. ఇంతమంది, ఇన్ని రకాలుగా ఆయా రంగాల్లో విజయం సాధించినప్పుడు మనమెందుకు సాధించలేమని ఆలోచిద్దాం. ఇలా చేయడంవల్ల మనం మానసికంగా పరీక్షలకు సిద్ధమైనట్లే అని భావించాలి.

స్వయం విశ్లేషణ

- విద్యా సంవత్సరం (2017, జూన్) ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మనమందరం మన శక్తి మేరకు ప్రతి సబ్జెక్టులో, ప్రతి పరీక్షలో బాగానే ఫలితాలు రాబట్టామని గ్రహించాలి. మన హాజరు శాతం పాఠశాలలో బాగానే ఉందని గుర్తుతెచ్చుకోండి. మిమ్మల్ని మీరు నమ్మండి. మనలో దాగి ఉన్న అనంతమైన శక్తిని, నైపుణ్యాలను, విషయ పరిజ్ఞానాన్ని విశ్వసించుకోవాలి. ఇటీవల ముగిసిన ప్రీ–ఫైనల్ పరీక్షలు కూడా బాగా రాశారని గుర్తుకు తెచ్చుకోండి. Formative Assessment ఎగ్జామ్స్, మీ సబ్జెక్టుల్లో మీరు చేసిన ప్రాజెక్ట్ వర్క్స్, సృజనాత్మకతను పెంచే వివిధ అంశాలను చక్కగా రికార్డ్స్‌లో నిక్షిప్తం చేశారని గ్రహించండి. ఇప్పటివరకు మన తల్లిదండ్రులు, అధ్యాపకులు, శ్రేయోభిలాషులు ఎంతగానో ప్రోత్సహించారని మరవద్దు. పెద్దల సహకారం, మార్గదర్శనం, ఆశీర్వాదం ఉందని బలంగా నమ్మండి. మనల్ని మనం అన్ని కోణాల్లో విశ్లేషించుకుని, మన శక్తిసామర్థ్యాలను బేరీజు వేసుకొని, మనం ఎవరి కంటే తక్కువ కాదని నమ్ముతూ ఒత్తిడిని జయిద్దాం.

పక్కా ప్రణాళిక

- ప్రతి సబ్జెక్టులో ఇప్పటివరకు మనం రాసిన అన్ని రకాల ప్రశ్న, జవాబు పత్రాలను మరోసారి తిరగేద్దాం. మన తప్పొప్పులను తెలుసుకుందాం. తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం, అన్ని ముఖ్యమైన అంశాల పునశ్చరణ చేసుకుందాం. ప్రతి సబ్జెక్టులో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని మౌలిక అంశాలను, విద్యా ప్రమాణాలను మననం చేసుకుందాం. ప్రతి సబ్జెక్టు పరీక్షకు ముందు ఒక్కసారి ఈ విషయాలను పునరావలోకనం చేసుకోవడం అత్యవసరం.

పాటించాల్సిన సూచనలు

- పబ్లిక్ ఎగ్జామ్స్‌లో పాటించాల్సిన సూచనల్లో అతి ముఖ్యమైంది మన ప్రజంటేషన్. స్కూల్ టాపర్ అయినా, ఎంత గొప్ప పరిజ్ఞానం ఉన్నా పరీక్షల్లో జవాబులను రాసే విధానం కీలకం. ఈ విధానం నైపుణ్యాలను ఆవిష్కరింపజేయడంతో పాటు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింపజేస్తుంది. అంటే ఒక విద్యార్థిగా ఎంత సీరియస్‌గా, జాగ్రత్తగా ఉన్నారో ఈ పరీక్షల ఫలితాలు ఎంత ముఖ్యమైనవో చెప్పకనే చెబుతుంది. ప్రజంటేషన్ అనేది ఏడాదికాలం పడ్డ కష్టానికి, తెలివితేటలకు, భవిష్యత్ ప్రణాళికలకు కొలమానం.
- ఇందులో ముఖ్యంగా చేతిరాత కీలకం. జవాబు పత్రాల మూల్యాంకనం చేసే అధ్యాపకులకు మన శక్తి ఏ పాటిదో తెలియజేస్తుంది. అందుకే చేతిరాత, అక్షరాలు వీలైనంత మేరకు గుండ్రంగా, చక్కగా, పొందికగా, అందరికీ అర్థమయ్యేరీతిలో ఉండాలి. కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి. బాగా తెలిసిన జవాబులనే ముందుగా రాయాలి. ప్రశ్నల క్రమసంఖ్యను తారుమారు చేయకూడదు.

జీవశాస్త్రం, భౌతికశాస్త్రంలో బొమ్మలు వేయాల్సి వస్తే నీట్‌గా వేసి, భాగాలు గుర్తించండి. గణితంలో చిత్తుపని కోసం కేటాయించిన చోటే ఆ పనిచేయండి. మార్జిన్స్ కొట్టి జవాబులు రాయాలి. సోషల్‌సైన్స్‌లో మ్యాప్ పాయింటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలి. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా రాయాలి. సబ్జెక్టు ఏదైనా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కూడా 10/10 జీపీఏలో కీలకం.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇక సామాజిక అంశాల విషయానికొస్తే.. ఇప్పటివరకు వ్యక్తిగత శ్రద్ధ, సంసిద్ధత, ప్రణాళికల గురించి చూశాం. ఇప్పుడు పరీక్షలకు వెళ్లే ముందు పరీక్షా కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చూద్దాం.

1. సమయపాలన అన్నింటి కంటే ముఖ్యమైంది. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలి.
2. ఒకరోజు ముందుగానే పెద్దలతో కలిసి వెళ్లి పరీక్ష కేంద్రాలను, సెంటర్ కోడ్‌ను నిర్ధారించుకోవాలి.
3. హాల్‌టికెట్‌ను ఒకటి లేదా రెండు జిరాక్స్ ప్రతులు తీయించి ఒకటి తల్లిదండ్రుల వద్ద, మరొకటి ఇంటి వద్ద భద్రంగా ఉంచండి. పాఠశాలలో ఎలాగో ఒక జిరాక్స్ ప్రతి సిద్ధంగా ఉంటుంది.
4. ఒకటి కంటే ఎక్కువ పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, కంపాస్ బాక్సు ఇతర సామగ్రి తీసుకెళ్లాలి.
5. ప్రస్తుతం ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారని తెలుసుకోండి. జాగ్రత్తగా మసులుకోండి.
6. ఎగ్జామ్ హాల్‌లో ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడుతున్నారేమో చూసుకొని, వారి చెడు ప్రభావం పడకుండా జాగ్రత్త పడాలి.
7. ఎవరైనా మీకు సమాధానాలు చెప్పినా వాటిని నమ్మవద్దు.
8. పరీక్ష రాస్తున్నప్పుడు ఎవరి సహాయం తీసుకోవద్దు, ఎవరికీ సహాయం చేయవద్దు అని గుర్తుపెట్టుకోండి. అనవసరమైన ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు. తనిఖీ బృందాలుగా పైస్థాయి అధికారులు విస్తృతంగా పర్యటిస్తారని మరవద్దు.
9. పరీక్షలు పూర్తయ్యేవరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తెచ్చుకోవద్దు. తగినంత నీరు తాగుతూ ఉండాలి. సరైన ఆహారం తీసుకోవాలి. మసాలాలు, వేపుళ్లు, జంక్‌ఫుడ్స్ వంటివి తీసుకోవద్దు.



సయ్యద్ ఖాసీం అలీ
ప్రిన్సిపాల్, శ్రీ చైసిన్జ్ హైస్కూల్
కర్మన్‌ఘాట్, 8008969621

అకాడమీ అవార్డులు

సినీరంగంలో అత్యున్నత అవార్డులుగా పరిగణించే ఆస్కార్ అవార్డులను (90వసారి) ఇటీవలే ప్రకటించారు. నటులు, టెక్నీషియన్లకు అత్యుత్తమ గుర్తింపును ఇవ్వడానికి హాలీవుడ్ నటులు, దర్శకులు, నిర్మాతలు, రచయితలు, సాంకేతిక నిపుణులతో కూడిన ఐదు విభాగాలతో 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ అండ్ సైన్సెస్' సంస్థ 1927లో ఏర్పడింది. ఇది చలనచిత్ర రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి 1929 నుంచి పురస్కారాలు ఇవ్వడం ప్రారంభించింది. మొదటిసారిగా అవార్డుల ప్రదానోత్సవం హాలీవుడ్ హోటల్ రూజ్‌వెల్ట్‌లో 1929, మే 16న జరిగింది.

- 1927, 28లో సినిమా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించడానికి నటుడు డగ్లస్ ఫియరీ బ్యాంక్స్, విలియమ్ డెమిలి ఏర్పాటు చేశారు.
- ఆస్కార్ బహుమతుల ప్రదానోత్సవాన్ని 1930లో రేడియోల ద్వారా ప్రసారం చేయగా, 1953లో దూరదర్శన్ ద్వారా ప్రసారం చేశారు.
- ఆస్కార్ ప్రతిమను వెండితో తయారుచేసి దానిపై 24 క్యారెట్ల బంగారు ప్లేటు అమరుస్తారు. ఒక్కో ప్రతిమకు 900 డాలర్లు ఖర్చవుతుంది.
- దీన్ని ఎంజీఎం స్టూడియో ఆర్ట్ డైరెక్టర్ సెడ్రిక్ గిబ్బన్ రూపొందించాడు.
- లాస్ ఏంజెల్స్‌కు చెందిన ప్రముఖ శిల్పి జార్జి స్టాన్లీ కాంస్యంతో ఆస్కార్ ప్రతిమను తయారు చేశారు.
- ఈ ఏడాది 90వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో మార్చి 5న జరిగింది.
- తొమ్మిది సినిమాల హోరాహోరీ పోటీలో 'ది షేప్ ఆఫ్ వాటర్' ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఇది 13 విభాగాల్లో నామినేషన్ పొంది ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఒరిజినల్ స్కోర్, ఉత్తమ నిర్మాణ విలువల కేటగిరీల్లో 4 అవార్డులు అందుకుంది.
- డన్‌కిర్క్ సినిమాకు మూడు అవార్డులు, బ్లేడ్ రన్నర్ 2049, కోకో, డార్కెస్ట్ అవర్, 'త్రీ బిల్ బోర్డ్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి' సినిమాలకు రెండు చొప్పున వచ్చాయి.
- మనిషిని పోలిన జలచరంతో ఒక మూగ యువతి ప్రేమ కథాంశంగా రొమాంటిక్ ఫాంటసీ 'ది షేప్ ఆఫ్ వాటర్' సినిమా రూపొందింది. ఈ సినిమాకు ఉత్తమచిత్రం, ఉత్తమ దర్శకుడు సహా నాలుగు విభాగాల్లో అవార్డులు లభించాయి.
- రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన 'డార్కెస్ట్ అవర్' సినిమాలో కనబర్చిన నటనకుగాను గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అందుకున్నాడు.
- ఉత్తమ నటిగా ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్ ఆస్కార్ అందుకున్నారు. 60 ఏళ్ల వయసులో ఉత్తమ నటిగా అకాడమీ అవార్డు సొంతం చేసుకున్నారు.



- తన కూతురిపై అత్యాచారం చేసి చంపిన దోషులను శిక్షించే విషయంలో పోలీసుల అలసత్వాన్ని ప్రశ్నిస్తూ తల్లి తీసుకున్న ఓ నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారి తీసిందనే స్ఫూర్తిదాయక కథాంశంతో రూపొందిన 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి' చిత్రంలో ఆమె అసమాన నటనకు ఈ అవార్డు లభించింది.
- ట్రాన్స్‌జెండర్ ఇతివృత్తంతో రూపొందిన చిలీ దేశానికి చెందిన 'ది ఫెంటాస్టిక్ ఉమెన్' సినిమా ఉత్తమ విదేశీ చిత్రంగా నిలిచింది.

ఆస్కార్ ప్రత్యేకతలు

- ఆస్కార్ నామినేషన్లు పొందినవారందరూ పురస్కారం గెలవకున్నా ప్రత్యేక బహుమతులు (గిఫ్ట్ ప్యాకులు) అందుకుంటారు. ఒక్కోదాని ఖరీదు సుమారు లక్ష డాలర్లు ఉంటుంది.
- ఇప్పటి వరకు అత్యధికంగా 17 ఆస్కార్ నామినేషన్లు పొందిన సినిమాలు లా లా ల్యాండ్ (2016), టైటానిక్ కాగా, 16 నామినేషన్లు పొందిన చిత్రం ఆల్ ఎబౌట్ ఈవ్ (1950).
- 11 విభాగాల్లో నామినేషన్ పొంది, అన్ని విభాగాల్లో అవార్డు అందుకున్న సినిమాలు లార్డ్ ఆఫ్ ద రింగ్స్, ద రిటర్న్ ఆఫ్ ద కింగ్ (2014) కాగా, 9 విభాగాల్లో నామినేషన్ పొందిన చైనీస్ చిత్రం లాస్ట్ ఎంపరర్ కూడా అవార్డులు దక్కించుకున్నది.
- 1982 నాటి కాబెరెట్ సినిమాకు 8 ఆస్కార్ అవార్డులు లభించినప్పటికీ ఉత్తమ చిత్రంగా నిలువలేకపోయింది.

భారతీయులకు ఆస్కార్

ఏడాది	అవార్డు	సినిమా	విభాగం
1983	భాను అథేయ	గాంధీ	కాస్ట్యూమ్ డిజైన్
1992	సత్యజిత్‌రే (హానరరీ ఆస్కార్)		
2009	రసూల్ పూకుట్టి	స్లమ్‌డాగ్ మిలియనీర్	బెస్ట్ సౌండ్ మిక్సింగ్
2009	ఏఆర్ రెహమాన్	స్లమ్‌డాగ్ మిలియనీర్	బెస్ట్ ఒరిజినల్ మిక్సింగ్
2009	ఏఆర్ రెహమాన్	స్లమ్‌డాగ్ మిలియనీర్	బెస్ట్ ఒరిజినల్ సాంగ్

ఆస్కార్-2018 గ్రహీతలు

- **ఉత్తమ చిత్రం:** ది షేప్ ఆఫ్ వాటర్
- **ఉత్తమ దర్శకుడు:** గెలెర్మో డెల్‌టోరో (ది షేప్ ఆఫ్ వాటర్)
- **ఉత్తమ నటుడు:** గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్)
- **ఉత్తమ నటి:** ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
- **ఉత్తమ సహాయ నటుడు:** సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)
- **ఉత్తమ సహాయనటి:** ఎలిసన్ జేలీ (ఐ, టోన్యా)
- **ఉత్తమ యానిమేటెడ్ చిత్రం:** కోకో
- **ఉత్తమ సినిమాటోగ్రఫీ:** రోజర్ ఏ డికిన్స్ (బ్లేడ్ రన్నర్ 2049)
- **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ :** మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్)
- **ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్:** ఇకారస్
- **ఉత్తమ విదేశీ చిత్రం:** ఏ ఫెంటాస్టిక్ ఉమెన్ (చిలీ)
- **ఉత్తమ మేకప్, కేశాలంకరణ:** కజుహిరొ సుజి, డేవిడ్ మాలి–నోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్ (డార్కెస్ట్ అవర్)
- **ఉత్తమ సంగీతం (ఒరిజినల్ స్కోర్):** అలెగ్జాండ్రే డెస్‌ప్లేట్ (ది షేప్ ఆఫ్ వాటర్)
- **ఉత్తమ సంగీతం (ఒరిజినల్ సాంగ్):** రిమెంబర్ మీ (కోకో)
- **ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం:** డియర్ బాస్కెట్‌బాల్
- **అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే:** జేమ్స్ ఐవరీ (కాల్ మి బై యువర్ నేమ్)
- **ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** జోర్డన్ పీలే (గెట్‌అవుట్)
- **ఉత్తమ సౌండ్ మిక్సింగ్:** మార్క్ వెంగర్టెన్, గ్రెగ్ ల్యాండెకర్, ఎ రిజో (డన్‌కిర్క్)
- **ఉత్తమ సౌండ్ ఎడిటింగ్:** రిచర్డ్ కింగ్, అలెక్స్ గిబ్సన్ (డన్‌కిర్క్)
- **ఉత్తమ ఫిల్మ్ ఎడిటింగ్:** లీ స్మిత్ (డన్‌కిర్క్)
- **ఉత్తమ డాక్యుమెంటరీ (షార్ట్ ఫిలిం):** హెవెన్ ఈజ్ ఏ ట్రాఫిక్ జామ్ ఆన్ ద 405
- **ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్:** జాన్ నీల్సన్, గెర్డ్ నెఫ్జెర్, పాల్ లాంబార్ట్, రిచర్డ్ ఆర్ హూహర్ (బ్లేడ్ రన్నర్ 2049)
- **ప్రొడక్షన్ డిజైన్:** పాల్ డెన్హమ్ ఆస్టర్‌బెర్రీ



అనంతరావు కృష్ణయ్య
నడిగూడెం, సూర్యాపేట జిల్లా
9948750605

సుడోకు

డైలీ సుడోకు 149 సమాధానం

2	4	8	5	1	7	6	9	3
9	5	3	2	6	8	7	1	4
7	6	1	3	4	9	5	2	8
6	2	4	9	5	1	3	8	7
1	7	9	8	3	6	4	5	2
8	3	5	4	7	2	1	6	9
4	1	2	7	8	5	9	3	6
5	9	7	6	2	3	8	4	1
3	8	6	1	9	4	2	7	5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

డైలీ సుడోకు -150

2	1	3				7		
		9			2			
	7	8	4					6
	9			8				
7		2		4		6		3
				7			5	
9					6	8	7	
			5			4		
		7				5	6	9

సమాధానం రేపటి సంచికలో

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 12 మార్చి 2018

అంతా సంతోషమే..!

నూతన ఏడాది మొదలై కొన్ని మాసాలే అయినా కెరీర్‌పరంగా ఎంతో సంతోషంగా వున్నానని చెప్పింది చెన్నై సోయగం సమంత. ప్రస్తుతం ఆమె తమిళ, తెలుగు భాషల్లో పలు భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా వుంది. సమంత కథానాయికగా నటించిన 'రంగస్థలం' ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేసుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు రామలక్ష్మి అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. తెలుగు, తమిళంలో సమంత 'యూ టర్న్' చిత్రంలో అనే సినిమాలో నటిస్తున్నది. ఇటీవలే చిత్రీకరణ మొదలైంది. ఇందులో ఈ సొగసరి జర్నలిస్ట్ పాత్రలో కనిపించనుంది. మరోవైపు తమిళంలో విశాల్ సరసన 'ఇరుంబు థిరై' చిత్రాన్ని పూర్తిచేసుకుంది. ఈ సినిమా 'అభిమన్యుడు' పేరుతో తెలుగులో ఇదే నెలలో ప్రేక్షకులముందుకురానుంది. మరో తమిళ చిత్రం 'సీమ రాజా' చిత్రీకరణ కూడా ఈ మధ్యే పూర్తయింది. వీటితో పాటు సమంత 'మహానటి' 'సూపర్‌డీలక్స్' చిత్రాల్లో నటిస్తున్నారు. కొత్త సంవత్సరం మొదలై మూడు నెలలే కావొస్తున్నా తన వృత్తిజీవితంలో ఎన్నో శుభపరిణామాలు చోటుచేసుకున్నాయని సమంత ఆనందం వ్యక్తం చేసింది. '2018 నాకు మరపురాని అవకాశాల్ని ఇచ్చింది. నేను చాలా సంతోషంగా వున్నాను. ఇంకా మనం మార్చి నెలలోనే వున్నాం. రాబోవు రోజుల్లో మరిన్ని విజయాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ సమంత ట్విట్టర్‌లో పేర్కొంది. ఇదిలావుండగా వివాహం తర్వాత తన భర్త నాగచైతన్యతో కలిసి సమంత ఓ చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'నిన్నుకోరి' ఫేం శివ నిర్వాణ దర్శకత్వం వహించనున్నారు.


సమంత

ఏఎన్నార్‌గా నాగచైతన్య



అలనాటి మహానటి సావిత్రి జీవితకథ ఆధారంగా రూపొందిస్తున్న చిత్రం 'మహానటి'. కీర్తి సురేష్ టైటిల్ రోల్‌ని పోషిస్తున్నది. నాగ్‌అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్-స్వప్న సినిమాస్ పతాకాలపై స్వప్నదత్ నిర్మిస్తున్నారు. సావిత్రి జీవితంలో జరిగిన ముఖ్య సంఘటనల్ని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సావిత్రి సినీ జీవితంలో ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు కీలకమైన వ్యక్తులు. వీరిద్దరి పాత్రల్ని ఎవరు పోషిస్తారనే విషయంలో సందిగ్ధత నెలకొంది. తాజాగా అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో ఆయన మనవడు నాగచైతన్య నటించబోతున్నాడు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. త్వరలో నాగచైతన్య షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు.

దేవుడు వరమందిస్తే..


సాయిధరమ్‌తేజ్

పాపులర్ గీతాలు సినిమా టైటిల్స్‌గా వస్తున్న విషయం తెలిసిందే. ఇదే జాబితాలో సాయి ధరమ్‌తేజ్ తాజా చిత్రం చేరనుంది. వివరాల్లోకి వెళితే...ఫీల్‌గుడ్ రొమాంటిక్ లవ్ స్టోరీల స్పెషలిస్ట్‌గా పేరుతెచ్చుకున్నారు కరుణాకరన్. ఆయన దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్ ఓ చిత్రంలో నటిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నది. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్.రామారావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథానుసారం కథానాయిక పాత్రకు అధిక ప్రాధాన్యత వుండే ఈ ప్రేమకథా చిత్రానికి 'దేవుడు వరమందిస్తే..!' అనే టైటిల్‌ను ఖరారు చేయాలనే ఆలోచనలో చిత్ర బృందం వున్నట్లు తాజా సమాచారం. రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీతం అందిస్తున్నారు.

తొమ్మిదేళ్ల తరువాత..!


ప్రభుదేవా

సల్మాన్‌ఖాన్, ప్రభుదేవా కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'వాంటెడ్'. ఈ సినిమా తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి సినిమా చేయలేదు. దాదాపు తొమ్మిదేళ్ల విరామం తరువాత వీరిద్దరు కలిసి ఓ చిత్రానికి పనిచేయబోతున్నారు. వివరాల్లోకి వెళితే..సల్మాన్‌ఖాన్ ఇన్‌స్పెక్టర్ చుల్‌బుల్ పాండే పాత్రలో ఆకట్టుకున్న చిత్రం 'దబాంగ్'. అభినవ్ కశ్యప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సంచలన విజయాన్ని సాధించడంతో పాటు భారీ వసూళ్లను రాబట్టింది. దీనికి సీక్వెల్‌గా 'దబాంగ్-2' చిత్రాన్ని తెరకెక్కించారు. సల్మాన్ తమ్ముడు అర్బాజ్ ఖాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మంచి వసూళ్లనే సాధించింది. దీనికి సీక్వెల్‌గా రానున్న 'దబాంగ్-3'పై భారీ అంచనాలు నెలకొనడంతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించే దర్శకుడు ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. కాగా ఈ మూడవ సీక్వెల్‌కు తానే దర్శకుడిగా వ్యవహరిస్తానని ప్రభుదేవా వెల్లడించి ఆ సస్పెన్స్‌కు తెరదించారు. ''దబాంగ్-3' చిత్రానికి దర్శకత్వం వహించనున్నాను. సల్మాన్‌ను డైరెక్ట్ చేసే అవకాశం వస్తే ఎవరు కాదంటారు చెప్పండి? సల్మాన్‌తో అతని తమ్ముళ్లతో నాకు మంచి అనుబంధం వుంది. ఈ మూడవ భాగంలో సల్మాన్‌ఖాన్, సోనాక్షిసిన్హా, అర్బాజ్‌ఖాన్‌తో పాటు పాత టీమ్ అంతా నటిస్తారు. సాజిద్-వాజిద్ సంగీతం అందించనున్నారు' అని తెలిపారు. ఈ చిత్రాన్ని సల్మాన్ సోదరుడు అర్బాజ్‌ఖాన్ నిర్మించనున్నారు.

ఆయన కళ్లలో నీళ్లు కనిపిస్తాయి!

'మనం సైతం గొప్ప కార్యక్రమం. కాదంబరి కిరణ్ ఈ సేవా కార్యక్రమాన్ని తన జీవితంలో భాగం చేసుకున్నారు. కష్టాల్లో ఉన్న వారి గురించి మాట్లాడుతుంటే ఆయన కళ్లలో నీళ్లు కనిపిస్తాయి' అని అన్నారు ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సినీ కార్మికులకు 'మనం సైతం' ద్వారా కాదంబరి కిరణ్ బృందం శనివారం సహాయాన్ని అందించింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు వీవీ వినాయక్ తన వంతుగా మనం సైతంకు లక్షరూపాయల్ని విరాళంగా అందజేశారు. 'మనం సైతం' విస్తరించడం ఆనందంగా ఉందని, సేవాభావం ఉన్నవాళ్లు చాలా మంది ఇందులో భాగస్వాములు అవుతున్నారని కాదంబరి కిరణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సి. కల్యాణ్, జి. నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాదంబరి కిరణ్, వినాయక్


ఇలియానా

అందుకే దూరమయ్యాను!

గోవా భామ ఇలియానా దక్షిణాది చిత్రసీమపై వివాదాస్పద వ్యాఖ్యల్ని చేసింది. తెలుగు, తమిళ భాషల్లో తనను గ్లామర్ పాత్రల కోసమే తీసుకునేవారని, నటిగా ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఏమాత్రం ఇవ్వలేదని విమర్శించింది. ఆ కారణం చేతనే దక్షిణాదికి గుడ్‌బై చెప్పి హిందీ పరిశ్రమలోకి వచ్చానని చెప్పింది. బాలీవుడ్‌లో తన సామర్థ్యానికి తగిన పాత్రలు లభించాయని, నటిగా తానేమిటో ప్రేక్షకులు తెలుసుకున్నారని పేర్కొంది. 'దక్షిణాదిలో ప్రవేశించేనాటికి నా వయస్సు 20ఏళ్లే. ఆ సమయంలో తెలుగు, తమిళంలో వరుస చిత్రాల్లో నటించాను. అగ్ర హీరోల సరసన అవకాశాలు దక్కాయి. అయితే ప్రతి ఒక్కరు నన్ను గ్లామర్ కోణంలోనే చూసేవారు. ఏ సినిమాలోనూ నటనకు ఆస్కారం వుండేది కాదు. ఈ క్రమంలో సహనం కోల్పోయాను. నటిగా నా ప్రతిభ ఏమిటో నిరూపించుకోవాలనుకున్నాను. ముంబయికి షిఫ్ట్ అయ్యాను. ఇక్కడ నేను కోరుకున్న అవకాశాలు దక్కాయి. అభినయప్రధాన పాత్రల ద్వారా ప్రేక్షకులకు చేరువయ్యాను. బాలీవుడ్ దర్శకనిర్మాతలు నన్నెంతగానో ప్రోత్సహిస్తున్నారు. దక్షిణాది పరిశ్రమపై నాకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదు. నటిగా మంచి పాత్రలు ఇవ్వలేదనే అసంతృప్తి వుంది. అందుకే సౌత్‌కు దూరమయ్యాను' అని ఇలియానా చెప్పింది. ప్రస్తుతం ఆమె హిందీలో అజయ్‌దేవ్‌గణ్ సరసన 'రైడ్' అనే చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.

క్యాంపస్ కహానీ

''కార్తికేయ' చందు మొండేటికి, 'స్వామిరారా' సుధీర్‌వర్మకు ఎలాంటి పేరు తెచ్చిపెట్టాయో అదే రీతిలో ఈ సినిమా దర్శకుడు శరణ్ మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకముంది. వినోదంతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం మిళితమైన చిత్రమిది' అని అన్నారు నిఖిల్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా కథానాయికలు. అజనీష్ లోకనాథ్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు శనివారం విజయవాడలో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను హీరో అల్లరి నరేష్ విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'కన్నడంలో పెద్ద విజయాన్ని సాధించిన ఈ చిత్రం తెలుగులో అదే స్థాయి సక్సెస్‌ను అందుకోవాలి. ఆహుతి ప్రసాద్ తనయుడు కార్తీక్ ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉన్నది' అని తెలిపారు. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో స్నేహం, ప్రేమ, వినోదం అంశాలతో ముడిపడిన కథ ఇదని, ఈ నెల 16న సినిమా విడుదల చేస్తామని నిఖిల్ చెప్పారు. ప్రతి విద్యార్థి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. తెలుగులో తాము నటించిన తొలి చిత్రమిదని కథానాయికలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి మాటలు: చందూ మొండేటి, స్క్రీన్‌ప్లే: సుధీర్‌వర్మ.


నిఖిల్

అమెరికా వ్యథలు


పద్మజ, రామ్మోహన్, తనికెళ్ల భరణి, శంకర్, రవికుమార్, లక్ష్మణ్

తేజస్, పల్లవిదొర, వంశీ కోడూరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అమీర్‌పేట్ టు అమెరికా'. భానుకిరణ్ చల్లా దర్శకుడు. పద్మజ కొమండూరి నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను నటుడు తనికెళ్ళభరణి విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ బాగుంది. అమెరికాలో తెలుగువాళ్లు పడే వ్యథలను దర్శకుడు కళ్లకుకట్టినట్లుగా యదార్థ కోణంలో చూపించారు. ఈ సినిమాకు కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన రామ్మోహన్ కష్టపడి ఈ సినిమా చేశారు. ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాలి' అని తెలిపారు. రామ్మోహన్ కొమండూరి మాట్లాడుతూ 'సందేశాత్మక కథాంశంతో రూపొందించిన చిత్రమిది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన కొందరు యువతీయువకులకు అక్కడ ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి? అమెరికా వెళ్లి బాగా డబ్బు సంపాదించాలని అనుకున్న వారి కలలు ఎలా కరిగిపోయాయన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ప్రేమ, వినోదం, భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. ఎనభై శాతం అమెరికాలో ఇరవై శాతం ఇండియాలో చిత్రీకరించాం. ఈ నెల 23న చిత్ర గీతాల్ని, 30న సినిమాను విడుదల చేయనున్నాం. కథాబలమున్న మంచి సినిమాగా తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాసర్ల శ్యామ్, మణిచందన, రాజేశ్వరి, బందూక్ లక్ష్మణ్, రవికుమార్, శ్రీనివాస్, కార్తీక్ కొడకండ్ల తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరి పెద్దారెడ్డి వినోదాలు..


సతీష్‌రెడ్డి, మౌర్యానీ

సతీష్‌రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. వీజే రెడ్డి దర్శకుడు. సీహెచ్ రఘునాథరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకురానున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'పల్లెటూరి నేపథ్యంలో ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది. సమాజహితం కోసం పాటుపడే పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. ఓ యువతికి మంచి చేయబోయి అతడే సమస్యల్లో చిక్కుకుంటాడు. అవేమిటి? వాటి నుంచి అతడు ఎలా బయటపడ్డాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. కథలోని మలుపులు ఆకట్టుకుంటాయి' అని అన్నారు. 28 రోజుల్లోనే ఈ సినిమా చిత్రీకరణను పూర్తిచేశామని, ఇటీవలే విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని, సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, యు.ఎ సర్టిఫికెట్ లభించిందని నిర్మాత చెప్పారు. ప్రభాస్ శ్రీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: సంజీవ్ మేగోటి, సంగీతం: గురురాజ్.

'బంగారు తెలంగాణ' గీతాలు


చిత్రలేఖ, అంజిరెడ్డి, బిపిన్

షిరిడి సాయి క్రియేషన్స్ సంస్థ రూపొందిస్తున్న చిత్రం 'బంగారు తెలంగాణ'. స్వీయనిర్మాణ దర్శకత్వంలో బిపిన్ తెరకెక్కిస్తున్నారు. బిపిన్, రమ్య, అక్షర, లయన్ స్వామి, బాబూమోహన్, సాయిత్రిశాంక్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర ఆడియోను శనివారం హైదరాబాద్‌లో కూర అంజిరెడ్డి ఆవిష్కరించారు. దర్శకనిర్మాత బిపిన్ మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్నారు. కేసీఆర్‌గారి కృషి వల్లే బంగారు తెలంగాణ సాధ్యమయింది. ఈ చిత్రంలో ఐదు పాటలున్నాయి. ఈ చిత్ర విడుదలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌గారు అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం' అన్నారు. తెలంగాణ సాధించిన క్రమాన్ని ఈ సినిమాలో తెలియజెప్పామని చిత్ర సమర్పకుడు కూర అంజిరెడ్డి తెలిపారు. తెలంగాణ గురించి నేటి యువతరం అంతా తెలుసుకునేలా చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని సహనిర్మాత ఏవిస్వామి చెప్పారు.

రేపు కోయిల్ అళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ అళ్వార్ తిరుమంజనం అత్యంత వైభవంగా టీటీడీ నిర్వహించనున్నది. ఈ నెల 18న తెలుగు సంవత్సరాది శ్రీ విళంబినామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆస్థానం నిర్వహించనుండటంతో ఈ నెల 13న ఈ కార్యక్రమం చేపట్టనున్నది. ఏడాదిలో నాలుగుసార్లు కోయిల్ అళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఈ ఆలయశుద్ధి కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహిస్తుంది. ఉదయం ఆరు గంటలకు మొదలయ్యే తిరుమంజనం సుమారు ఐదుగంటలపాటు కొనసాగనున్నది. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలంలో శుద్ధి కార్యక్రమాన్ని ఆలయ సిబ్బంది అత్యంత పవిత్రంగా నిర్వహిస్తారు.

దేశంలోని రైతులకు పెద్ద దిక్కు కేసీఆర్

- మూడో కూటమే ప్రత్యామ్నాయం
- న్యూజిలాండ్ టీఆర్ఎస్ కార్యవర్గ సమావేశంలో నేతలు



ఆక్లాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన న్యూజిలాండ్ టీఆర్ఎస్ కార్యవర్గ సమావేశంలో సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ రైతన్నకు పెద్ద దిక్కు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని న్యూజిలాండ్ టీఆర్ఎస్ కార్యవర్గ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. దేశంలో వ్యవసాయం మీద ఎంతోమంది జీవితం ఆధారపడి ఉన్నదని, ఇన్నాళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రాధాన్య రంగాలను విస్మరించాయని చెప్పారు. దేశంలోని రైతులకు ఎవరూ చేయని పనులను సీఎం కేసీఆర్ చేస్తారనే నమ్మకం ఉన్నదని, మూడోఫ్రంట్ ఏర్పాటుతో ఇది సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆక్లాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న పథకాలు రైతులు, వ్యవసాయంపై ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తున్నాయని విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో హానరరీ చైర్‌పర్సన్ కల్యాణ్‌రావు, కార్యదర్శి నర్సింగరావు, ఉపాధ్యక్షులు జగన్‌రెడ్డి, రామారావు, సీతారామారావు, అభిలాశ్‌రావు, సునీత విజయ్, సుశాంతి, అరుణ్, ప్రకాశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్, నర్సింగరావు, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మిక రంగయ్యగౌడ్

థర్డ్ ఫ్రంట్‌కు మాజీ సైనికుల మద్దతు

- కేసీఆర్‌కు తోడుంటామన్న తెలంగాణ మాజీ సైనికోద్యోగుల సంఘం

బషీర్‌బాగ్: దేశ రాజకీయవ్యవస్థను మార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటుచేయనున్న థర్డ్ ఫ్రంట్‌కు మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సైనికోద్యోగుల కుటుంబాలతో సమావేశమై థర్డ్ ఫ్రంట్‌కు మద్దతివ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు రాష్ట్ర మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మిక రంగయ్యగౌడ్ ఆదివారం మీడియాకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫ్రంట్ లక్ష్యాన్ని ప్రచారంచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎం పద్మనాభం, చంద్రమౌళి, కేవర్‌సింగ్, మణిబాయ్, అనసూయ, జయలక్ష్మి పాల్గొన్నారు.

భావితరాలకు తెలిసేలా తెలంగాణ చరిత్ర

- సెంటర్ ఫర్ తెలంగాణ హిస్టరీ అండ్ కల్చర్ సొసైటీ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ సంస్కృతి, చరిత్రను భావితరాలకు చాటిచెప్పేలా సెంటర్ ఫర్ తెలంగాణ హిస్టరీ అండ్ కల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో సమగ్రచరిత్ర నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ప్రామాణికమైన సమగ్రచరిత్ర అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివారం మీడియాతో సంఘం అధ్యక్షుడు అడపా సత్యనారాయణ, కార్యదర్శి ద్యావనపల్లి సత్యనారాయణ, కోశాధికారి అంజయ్య, సెంటర్ ఇంచార్జి సుధారాణి చెప్పారు. తెలంగాణ చరిత్రను సమగ్రంగా అందుబాటులోకి తెచ్చేందుకు తమ సంఘం ద్వారా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ చెప్పినట్టుగా ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన తెలంగాణ చరిత్ర రచనాసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేయాలని కోరారు. పురావస్తుశాఖలో తెలంగాణచరిత్రకు ఉపయోగపడే నాలుగువేల శాసనాలు, రెండులక్షల నాణేలు, వందేండ్ల వార్షిక నివేదికలు ఉన్నాయని చెప్పారు.

థర్డ్‌ఫ్రంట్‌తోనే రాష్ట్రాలకు హక్కులు

- కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్లే చాన్సే లేదు: ఎంపీ డీ శ్రీనివాస్



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: దేశానికి మూడో కూటమి అవసరం చాలా ఉన్నదని, అది అధికారంలోకి వచ్చినప్పుడే రాష్ట్రాలకు హక్కులు దక్కుతాయని టీఆర్ఎస్ ఎంపీ డీ శ్రీనివాస్ స్పష్టంచేశారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇన్నాళ్లు పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీలు దేశానికి చేసిందేంలేదన్నారు. రైతులు సహా అన్ని వర్గాలవారికి ఫలాలు అందాలంటే కేసీఆర్ నేతృత్వంలో ఏర్పడే మూడోఫ్రంట్ వల్లనే సాధ్యమవుతుందని చెప్పారు. పలు రాష్ట్రాల్లో ఎస్సీ, బీసీలు, మైనార్టీల సంఖ్య పలురకాలుగా ఉన్నదని, అందుకే రిజర్వేషన్ల అంశం రాష్ట్రాలకే వదిలేయాలని సూచించారు. తెలంగాణతోపాటు, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు రిజర్వేషన్లపై పోరాటం చేస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్‌లోకి రావాలని ఆ పార్టీ నేతలెవరూ తనను సంప్రదించలేదని, ఒకవేళ పిలిచినా వెళ్లే చాన్సే లేదని స్పష్టంచేశారు.

సకల మహాసభకు సమాయత్తం

- 17 నుంచి సన్నాహక సభలు: కారం రవీందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగుల బదిలీ, కొత్త జిల్లాల్లో హెచ్ఆర్‌ఏ అమలుచేయాలనే డిమాండ్లతో ఈ నెల 25న జరిగే సకల ఉద్యోగుల మహాసభ కోసం ఈ నెల 17 నుంచి 22 వరకు జిల్లాల్లో సన్నాహకసభలు నిర్వహిస్తామని ఉద్యోగ సంఘాల జేఏసీ తెలిపింది. ఆదివారం టీఎన్జీవో భవన్‌లో జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. గత ఐదేండ్లుగా రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలు లేవని, ఈ వేసవిలో బదిలీలు చేపట్టాలని కారం రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కొత్త జిల్లా కేంద్రాల్లో కూడా హెచ్ఆర్‌ఏను అమలుచేయాలన్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ సెక్రటరీ జనరల్ వీ మమత మాట్లాడుతూ ఆర్డర్ టు సర్వ్ ప్రకారం కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, బదిలీ చేస్తే చాలా సమస్యలకు పరిష్కారాలు వస్తాయన్నారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవో సహాఅధ్యక్షుడు మందాడి ఉపేందర్‌రెడ్డి, సహాయ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్, టీటీయూ అధ్యక్షుడు ఎం మణిపాల్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి నారాయణరెడ్డి, టీయూటీఎఫ్ అధ్యక్షుడు స్వామిరెడ్డి, లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబూరావు పాల్గొన్నారు.

నంబర్‌వన్ ఉగ్రవాది నాథూరాం గాడ్సే

- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాథూరాం గాడ్సే దేశంలో నంబర్ వన్ ఉగ్రవాది అని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీని హత్యచేసిన గాడ్సే గురించి మాట్లాడితే తనకు నోటీసులు ఇస్తారా అని పుణె పోలీసులను ప్రశ్నించారు. మహారాష్ట్రలోని పుణెలో ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన బహిరంగసభలో ఒవైసీ ప్రసంగించారు. 'మేం ఈ దేశ పౌరులం. అసలైన దేశభక్తులం. ఈ దేశానికి ఎన్నడూ ద్రోహం తలపెట్టలేదు. ఇకముందు కూడా తలపెట్టబోం' అని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులను ఉద్దేశించి అన్నారు. ముస్లింలు పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని వ్యాఖ్యలు చేస్తున్నవారు.. మాతృభూమిని దోచుకున్న నీరవ్ మోదీ, విజయ్‌మాల్యాలను ఆర్థిక ఉగ్రవాదులుగా ప్రకటించగలరా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ట్రిపుల్ తలాక్ బిల్లును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

పాకిస్థాన్ జైలులో 17 మంది భారతీయులు

- మానసికస్థితి బాగాలేదని సమాచారం ఇచ్చిన పాక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాకిస్థాన్‌లోని జైలులో 17 మంది భారతీయులు ఉన్నారని ఆ దేశం భారత ప్రభుత్వానికి సమాచారం అందజేసింది. కేంద్రహోం శాఖ ఈ సమాచారాన్ని అన్ని రాష్ట్రాల డీజీపీలకు చేరవేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, ఇటీవల కేంద్రం నుంచి కొన్ని ఫొటోలు వచ్చాయి. అవి బాగాలేకపోవడంతో కలర్ ఫొటోలు పంపాలని కోరామని చెప్పారు. ఫొటోలు వచ్చిన తర్వాత అందులో ఉన్న వ్యక్తుల్లో తెలంగాణ వాళ్లు ఉన్నారా లేదా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. కానీ ఆ ఫొటోలో తెలుగువాళ్ల ఆనవాళ్లు కనిపించలేదని వివరించారు.

ఆరు వేల చెరువులు

మూడోపేజీ తరువాయి...

నిల్వచేశారు. వెనుకబడిన జిల్లాలుగా పేరొందిన ప్రాంతాలకు నాలుగో విడుతలో ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. అత్యధికంగా నాగర్‌కర్నూల్, వనపర్తి, సిద్దిపేట, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, కరీంనగర్, వరంగల్ రూరల్ జిల్లాలో ఎక్కువ చెరువులకు అనుమతులు జారీ చేశారు. ఇప్పటివరకు పరిపాలన అనుమతులు మంజూరుచేసిన చెరువులకు.. తూములు, కట్టల మరమ్మతులు, మట్టితవ్వకం వంటి పనులను చేపడ్తారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో 1714 చెరువుల కోసం రూ. 436.97 కోట్లు, గోదావరి పరీవాహక ప్రాంతంలో 1856 చెరువులకు రూ. 635.03 కోట్లతో పనులు నిర్వహిస్తారు.

జిల్లాల వారీగా ఇదీ జాబితా..

మిషన్ కాకతీయ నాలుగో విడుతలో జిల్లాల వారీగా మంజూరైన చెరువుల్లో.. సంగారెడ్డి-42, మెదక్-182, సిద్దిపేట- 215, రంగారెడ్డి-53, మేడ్చల్-మల్కాజిగిరి- 23, వికారాబాద్- 96, మహబూబ్‌నగర్- 167, వనపర్తి- 232, జోగుళాంబ గద్వాల- 42, నాగర్ కర్నూల్- 255, నల్లగొండ-153, యాదాద్రి భువనగిరి- 124, సూర్యాపేట-130, నిర్మల్-100, ఆదిలాబాద్-38, కొమురం భీం ఆసిఫాబాద్- 66, మంచిర్యాల- 51, వరంగల్ అర్బన్- 58, వరంగల్ రూరల్- 159, జయశంకర్ భూపాలపల్లి- 90, మహబూబాబాద్-158, జనగామ- 100, కరీంనగర్- 148, పెద్దపల్లి- 178, జగిత్యాల- 133, రాజన్న సిరిసిల్ల- 45, ఖమ్మం-119, భద్రాచలం-కొత్తగూడెం- 164, నిజామాబాద్- 95, కామారెడ్డి-158 ఉన్నాయి. త్వరలోనే మరిన్ని చెరువులకు అనుమతులు మంజూరవుతాయని అధికార వర్గాలు చెప్పాయి.

రేపటి బంద్‌ను వాయిదా వేసుకోండి

- ఇంటర్ పరీక్షలకు ఆటంకం కలిగించొద్దు
- ఎమ్మార్పీఎస్‌కు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సూచన
- నిమిషం నిబంధన సవరించైనా పరీక్షలు జరిపి తీరుతామని వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్ పరీక్షలు ఉన్నందున, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంగళవారం రాష్ట్రంలో తలపెట్టిన బంద్‌ను వాయిదా వేసుకోవాలని ఎమ్మార్పీఎస్‌ను ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కోరారు. ఈ బంద్‌కు సహకరించే రాజకీయ పార్టీలు సైతం బంద్ వాయిదాకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంత్రుల నివాస సముదాయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయాలను పరీక్షలతో ముడిపెట్టొద్దని.. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేయొద్దని కోరారు. 13వ తేదీన ఇంటర్ ఫస్టియర్ కెమిస్ట్రీ పరీక్ష ఉన్నదని, పరీక్షను వాయిదా వేస్తే, మళ్లీ నిర్వహించేందుకు తేదీలు సర్దుబాటు కావడంలేదని తెలిపారు. పరీక్షలు ఆలస్యమైతే ఫలితాల విడుదలలో జాప్యం జరుగుతుందని.. ఏప్రిల్ 15లోపు ఇంటర్ ఫలితాలు ప్రకటించకపోతే విద్యార్థులు జాతీయ పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నందున బంద్‌ను వాయిదా వేసుకోవాలని మందకృష్ణమాదిగను కోరారు. దీనికోసం కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఇతర నేతలతో తాను మాట్లాడినట్టు కడియం పేర్కొన్నారు. అవసరమైతే ఒక్క నిమిషం నిబంధనను సడలించైనా 13న జరుగాల్సిన ఇంటర్ పరీక్షలను నిర్వహించి తీరుతామని, విద్యార్థులు ఎవరైనా పరీక్షకు హాజరుకాలేక నష్టపోతే దానికి ఎమ్మార్పీఎస్ బాధ్యత వహించాల్సి ఉంటుందని కడియం పేర్కొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లోపే ఢిల్లీలో ధర్నా

పార్లమెంట్ సమావేశాల్లోపే ఎస్సీ వర్గీకరణ, ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల పెంపు కోసం ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ధర్నా చేయాలనుకుంటున్నట్టు కడియం తెలిపారు.

దమ్ముంటే ఆధారాలు బయటపెట్టు

- రేవంత్‌రెడ్డికి టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె సవాల్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దమ్ము, ధైర్యం ఉంటే హరీశ్‌రావు, అమిత్ షా భేటీకి సంబంధించిన ఆధారాలు బయటపెట్టాలని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్.. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, ఇలాంటి దూషణలకు రాష్ట్రం వేదిక కాదని తెలిపారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాజకీయ జీవితంలో వ్యక్తిగత దూషణలు సరికాదని సూచించారు. మంత్రి హరీశ్‌రావు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలిసినప్పుడు తాను ఎందుకు కలిసిందీ వెంటనే మీడియా ద్వారా వెల్లడించారని గుర్తుచేశారు. ఆనాడు ప్రభుత్వం డిగ్రీ కాలేజీలను మంజూరు చేస్తుందని తెలిసి సిద్దిపేటకు మహిళా డిగ్రీ కాలేజీని మంజూరు చేయాలని కోరడానికే వైఎస్‌ను కలిసినట్లు వివరించారని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను కలిసినట్టుగా ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు.

ఈత మొక్కల లక్ష్యం ఐదు కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఈత మొక్కలు నాటే కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతున్నది. 2019 వరకు రాష్ట్రంలో 5 కోట్ల ఈత మొక్కలు నాటాలనే లక్ష్యంతో ఆబ్కారీశాఖ ముందుకెళ్తున్నది. 2016 జూన్‌లో ప్రారంభించిన హరితహారంలో భాగంగా మొదటి విడుతలో 54.84 లక్షల ఈత మొక్కలను నాటింది. 2017లో కోటి 16 లక్షలు, 2018లో రెండు కోట్ల మొక్కలను నాటాలని జిల్లాలవారీగా లక్ష్యాలను నిర్దేశించింది. 2019-20లో 1.3 కోట్ల మొక్కలను నాటాలనేది లక్ష్యం. జూన్ నుంచి మొక్కలు నాటే కార్యక్రమాలకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గౌడ సొసైటీలకు ఇచ్చిన భూములు, చెరువులు, కుంటలు, వాగులు, ఒర్రెల గట్లపై ఈత మొక్కలు నాటేందుకు ప్రణాళికను రూపొందించారు. నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

జిల్లాలవారీగా లక్ష్యాలు

2018-19లో రెండుకోట్ల ఈత మొక్కలు నాటాలని నిర్ణయించిన ఆబ్కారీశాఖ.. జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. ఆదిలాబాద్‌లో 1.75 లక్షలు, నిర్మల్‌లో ఆరు లక్షలు, మంచిర్యాలలో ఐదు లక్షలు, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 1.25 లక్షలు, కరీంనగర్‌లో ఆరులక్షలు, జగిత్యాలలో 8 లక్షలు, పెద్దపల్లిలో 5.5 లక్షలు, రాజన్నసిరిసిల్లలో 5 లక్షలు, ఖమ్మంలో 6 లక్షలు, భద్రాద్రికొత్తగూడెంలో రెండులక్షలు, జోగులాంబ గద్వాలలో 5 లక్షలు, మహబూబ్‌నగర్‌లో 12 లక్షలు, నాగర్‌కర్నూల్‌లో 7 లక్షలు, వనపర్తిలో 6 లక్షలు, మెదక్‌లో పది లక్షలు, సిద్దిపేటలో తొమ్మిది లక్షలు, సంగారెడ్డి, నల్లగొండలో 12 లక్షల చొప్పున, సూర్యాపేటలో ఏడు లక్షలు, యాదాద్రిభువనగిరిలో ఎనిమిది లక్షలు, కామారెడ్డిలో పది లక్షలు, నిజామాబాద్‌లో పది లక్షలు, మేడ్చల్‌లో రెండు లక్షలు, రంగారెడ్డిలో 14.5 లక్షలు, వికారాబాద్‌లో తొమ్మిది లక్షలు, జనగామలో ఐదు లక్షలు, జయశంకర్ భూపాలపల్లిలో మూడు లక్షలు, మహబూబాబాద్‌లో నాలుగు లక్షలు, వరంగల్‌అర్బన్‌లో మూడు లక్షలు, వరంగల్‌రూరల్‌లో ఐదు లక్షలు.

వచ్చే రెండేండ్లలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక • కేంద్రగ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల ప్రశంసలు



ఈతకల్లును పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఈడీ అకున్ సబర్వాల్ (ఫైల్)

పర్యటించి ఈత మొక్కలు నాటేందుకు తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తున్నారు. స్థానిక గౌడ సంఘం నేతలతో, కల్లుగీత కార్మికులతో డైరెక్టర్ సమావేశమై సమస్యలను తెలుసుకుంటున్నారు.

దేశవ్యాప్తంగా చేపట్టాలని అభిప్రాయం: వికారాబాద్ జిల్లాలో నాటిన ఈత మొక్కలను ఇటీవల కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చూసి అబ్బురపడ్డారు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టారని, దేశంలో ఈత వనాల పెంపును కేవలం తెలంగాణలోనే చూస్తున్నామని మెచ్చుకున్నారు. ఈత చెట్లని ప్రభుత్వమే ప్రోత్సహించడాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా చేపడితే మంచి ప్రయోజనాలుంటాయని అభిప్రాయపడ్డారు.

కట్టుదిట్టమైన పర్యవేక్షణ: రెండేండ్లలో నాటిన కోటి 70 లక్షల ఈత మొక్కలను పెంచి పోషించేందుకు చెరువుగట్లు, కుంటలు, గౌడ సొసైటీలకు కేటాయించిన స్థలాల్లో వాచ్‌మెన్లను ఏర్పాటుచేశారు. వీరికి రూ.3,500 వేతనం చెల్లిస్తున్నారు. 10,434 పంచాయతీల్లో ఉన్న 6,500 గౌడ సొసైటీలకు ప్రభుత్వం ఐదెకరాల చొప్పున కేటాయించిన స్థలాల్లో ఈత మొక్కలను నాటుతున్నారు. ఈత మొక్కల తీరుతెన్నులపై ఇటీవల ఎక్సైజ్‌శాఖ అధ్యయనం చేసింది. దాదాపు 90 శాతం మొక్కలు పెద్దవయ్యాయని అధికారులు వెల్లడించారు.

కాకతీయ కళావైభవంతో మురిసిన పాలమూరు

హాస్యనటుడు బ్రహ్మానందంకు 'హాస్యనట బ్రహ్మ' బిరుదు ప్రదానం

మహబూబ్‌నగర్ సాంస్కృతిక విభాగం: కాకతీయ కళావైభవ మహోత్సవాలతో పాలమూరు మురిసింది. కాకతీయ రాజుల వైభవాన్ని దశదిశలా చాటేందుకు టీఎస్ఆర్ కాకతీయ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కాకతీయ కళావైభవ మహోత్సవానికి సినీ హాస్యనట బృందంతోపాటు పలువురు ప్రముఖ సినీనటులు హాజరై సందడి చేశారు. శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు ఒకే వేదికపైకి చేరారు. టీఎస్ఆర్ కాకతీయ లలితా కళాపరిషత్ అధ్యక్షుడు టీ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చైర్మన్, కోచైర్మన్లుగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాదిమంది హాజరయ్యారు. ప్రముఖ సినీనటులు డాక్టర్ రాజశేఖర్, జయప్రద, జీవిత, శ్రద్ధాదాస్, హాస్యనటులు బ్రహ్మానందం, బాబూమోహన్, ఆలీ, శివారెడ్డి, రఘుబాబు, శ్రీనివాస్‌రెడ్డి తమదైన శైలిలో ప్రసంగిస్తూ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. హాస్యనటుడు బ్రహ్మానందానికి సినీ హాస్యనటబ్రహ్మ బిరుదును ప్రదానం చేశారు. అనంతరం స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ కాకతీయులు ఈ ప్రాంత అభివృద్ధికి తీసుకున్న చర్యలు.. వందల ఏండ్లు ప్రజలు సుఖంగా జీవించేందుకు తోడ్పడ్డాయన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. కాకతీయ వైభవాన్ని దశదిశలా చాటేందుకు కృషిచేస్తున్న టీ సుబ్బరామిరెడ్డి అభినందనీయులన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాకతీయ కళావైభవ మహోత్సవాలను నిర్వహిస్తానన్నారు. ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయులు చేసిన అభివృద్ధి ఇప్పటికీ ఉపయోగపడుతున్నదన్నారు. పాలమూరు జిల్లాలో ఆయారంగాల్లో విశిష్ట సేవలందించిన కపిలవాయి లింగమూర్తి, గోరటి వెంకన్న, ఎల్లూరి శివారెడ్డి, వనజా ఉదయ్, డాక్టర్ వంగిపురం నీరజ, చిక్కా హరీశ్, గోరట్ల రోజా తదితరులకు కాకతీయ కళావైభవ పురస్కారాలు అందజేశారు.



ఆదివారం టీఎస్ఆర్ కాకతీయ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కాకతీయ కళావైభవ మహోత్సవంలో హాస్యనటుడు బ్రహ్మానందంను సన్మానిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ జితేందర్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్మన్ భాస్కర్, టీఎస్ఆర్ కాకతీయ లలితా కళాపరిషత్ అధ్యక్షుడు టీ సుబ్బరామిరెడ్డి, సినీనటులు రాజశేఖర్, జీవిత, జయప్రద, శ్రీనివాస్‌రెడ్డి

జీఎస్టీ రాబడిలో రికార్డు

మూడోపేజీ తరువాయి...

జీఎస్టీ+వ్యాట్ ద్వారా 23,383.49 కోట్ల ఆదాయం సమకూరింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన మొదటి నెల జూలైలో ఆదాయం తగ్గినప్పటికీ ఆగస్టు నుంచి బాగా పుంజుకుంది. గత ఏడాది వ్యాట్ వసూళ్లతో పోలిస్తే జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత రాబడి 19.57 శాతానికి పెరిగింది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లోరాబడులు వరుసగా 5.68 శాతం, 14.67, 26.34, రూ. 25.69,13.89, 15,46, 34.37 శాతానికి పెరిగాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, మద్యంపై వసూలు చేసిన విలువ ఆధారిత పన్ను (వ్యాట్)వాటా రూ. 10,573 కోట్లుగా ఉంది. జీఎస్టీ ద్వారా రూ.12,810 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది 2016-17లో వ్యాట్ ద్వారా మొత్తం రాబడి రూ. 31,322 కోట్లు రాగా ఈసారి 2017-18 ఫిబ్రవరి నాటికే ఆదాయం 37,428 కోట్లు దాటింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత కొంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల రాబడి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం వే-బిల్లులను జారీచేయకపోయినా, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అవకాశమివ్వకపోయినా రాష్ట్ర వాణిజ్యపన్నుల అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని అన్నిరాష్ట్రాల కంటే ముందుగా ఎలక్ట్రానిక్ వే-బిల్లులను జారీచేయడం, జీరో దందాపై మహాచెక్ పేరిట నిఘా వేయడం వంటి చర్యల కారణంగా పన్నుల రాబడి పెరిగిందని చెప్పవచ్చు.

జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెరుగుతున్న జీఎస్టీ+వ్యాట్ పన్నుల రాబడి తీరు...(రూ.కోట్లలో)

సంవత్సరం	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్	డిసెంబర్	జనవరి	ఫిబ్రవరి	మొత్తం (రూ.కోట్లలో)
2016-17లో మొత్తం వ్యాట్ రాబడి	2799.4	2815.44	2750.79	2746.03	2699.74	2811.42	2933.68	19556
జీఎస్టీ అమల్లోకి వచ్చాక తర్వాత వ్యాట్ వసూలు	1417.72	1499.41	1472.33	1404.08	1565.51	1563.76	1651.00	10573.81
ఎక్సైజ్ డ్యూటీ నుంచి సర్దుబాటు	292.59	251.89	368.00	336.31	00.00	00-00	00-00	1248.79
ఎస్‌జీఎస్టీ	829.49	807.82	850.66	750.51	741.12	855.38	795.00	5629.98
ఐజీఎస్టీ	418.55	669.35	784.39	798.56	768.01	800.76	1496.00	5735.62
జీఎస్టీ నష్టపరిహారం	0.00	7.00	0.00	162.00	-	-	-	169
వివిధ రూపాలలో మొత్తంగా వసూలైన పన్ను	2958.36	3228.46	3475.38	3451.46	3074	3246.19	3942.00	23383
గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు(శాతం)	5.68	14.67	26.34	25.69	13.89	15,46	34.37	19.57

ఏపీ టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల ఖరారు



సీఎం రమేశ్



రవీంద్రకుమార్

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థుల పేర్లను టీడీపీ ప్రకటించారు. నామినేషన్ దాఖలుకు సోమవారం చివరితేదీ కావడంతో రెండు స్థానాలకు సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్ పేర్లను పార్టీ ఖరారు చేసింది. సీఎం రమేశ్ ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతుండగా, రవీంద్రకుమార్ టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా ఉన్నారు. తొలుత సీఎం రమేశ్, వర్ల రామయ్యతోపాటు పలువురి పేర్లు రాజ్యసభ రేసులో వినిపించాయి. కానీ, రవీంద్రకుమార్ పేరు తెరపైకి వచ్చింది.

టీడీపీపై బీజేపీ పోరుబాట

బీజేపీలో చేరిన సినీ నటి కవిత



హరిబాబు సమక్షంలో బీజేపీలో చేరుతున్న కవిత

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ టీడీపీ ఎంపీలు కేంద్రంపై చేసిన ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ నేతలు గ్రామ స్థాయినుంచి పర్యటనలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. విజయవాడలో ఆదివారం బీజేపీ ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు నేతృత్వంలో జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్టు సమాచారం. సినీనటి, టీడీపీ సీనియర్ నాయకురాలు కవిత బీజేపీలో చేరారు. పార్టీ ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు సమక్షంలో విజయవాడలో ఆదివారం ఆమె బీజేపీ తీర్థం పుచుకున్నారు.



జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద ఆదివారం 3కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిపై చైతన్యం తీసుకురావడంతోపాటు ముందస్తుగా దీనిని గుర్తించగలిగితే నివారణ సాధ్యమన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వీసీ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ సాయిబాబారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ కేంద్రానికి 46 లక్షలు

- నిధులు అందించిన వైద్యారోగ్యశాఖ
- ఆహ్లాదభరిత వాతావరణంతోపాటు సామర్థ్యం పెంపు



చేవెళ్లలోని ఆత్మీయ చికిత్స కేంద్రం

చేవెళ్ల, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని ఆత్మీయ చికిత్స కేంద్రానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత ఏడాది అక్టోబర్‌లో ఏర్పాటు చేసిన పెయిన్ రిలీఫ్ అండ్ ప్యాలియేటివ్ కేర్ సొసైటీ(పీఆర్‌పీసీఎస్) కేంద్రానికి రెండు రోజుల కిందట రూ.46 లక్షలను కేటాయించింది. ఏడు రకాల దీర్ఘకాలిక వ్యాధులతో అవస్థ పడుతున్న వారికి చివరి దశలో ఆత్మీయంగా సేవలందించి, గౌరవంగా, సంతోషంగా వీడ్కోలు పలుకాలన్నదే ఈ కేంద్రం ఉద్దేశం. పీఆర్‌పీసీఎస్, ట్రస్ట్స్ అండ్ యునైటెడ్ కేర్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం, హెచ్ఐవీ, కిడ్నీ సంబంధ వ్యాధులు, మానసిక జబ్బులతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న వారికి ఈ కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు. తాజాగా వైద్యారోగ్యశాఖ విడుదల చేసిన రూ.46 లక్షల నిధులతో ప్రస్తుతం ఐదు పడకలుగా ఉన్న దవాఖానను 50 పడకల స్థాయికి మార్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతోపాటు రోగులకు ఆహ్లాదభరిత వాతావరణం అందించేందుకు పార్కు, వినోద కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 4 వేల మంది క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు. చేవెళ్ల డివిజన్‌లోనే 355 మంది ఉన్నట్టు ఇంటింటి సర్వేలో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా చౌటుప్పల్, కామారెడ్డి, సిద్దిపేట, ఆదిలాబాద్, రామాయంపేట, హైదరాబాద్, సూర్యాపేట, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్‌లో ఆత్మీయ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని ప్యాలియేటివ్ కేర్ నిర్వాహకులు తెలిపారు. రంగారెడ్డి జిలా మొయినాబాద్ మండల పరిధిలో ఆత్మీయ చికిత్స కేంద్రం నిర్మాణానికి స్పర్శ స్వచ్ఛంద సంస్థ స్థలం కేటాయించిందన్నారు.

స్టాంపు డ్యూటీ ఎగవేతపై ఆరా

ఖజానాకు జరిగిన నష్టాన్ని తేల్చాలన్న ప్రభుత్వం

వాహన ఫైనాన్షియర్ల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

అవినీతికి అండగా నిలిచిన అధికారుల వివరాలు సేకరణ

పూర్తిగా రికవరీ చేయాలని నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

స్టాంపు డ్యూటీ ఎగవేసిన ఫైనాన్షియర్ల పనిపట్టడంతోపాటు, అవినీతికి అండగా నిలిచిన రవాణాశాఖ అధికారులను గుర్తించే చర్యలు ప్రారంభమయ్యాయి. పన్ను ఎగవేసి ఖజానాకు నష్టం తెచ్చిన వారి వివరాలతోపాటు నష్టం ఎంత జరిగిందనే అంశంపై లెక్కలు తేల్చాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కార్యాలయాలవారీగా ఏ ఆఫీసులో ఎంత నష్టం చేశారనే వివరాలు అందించాలని ఇటీవలే రవాణాశాఖ కార్యాలయాలకు సర్క్యూలర్ జారీ అయ్యింది. హైదరాబాద్ బండ్లగూడలోని ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కార్యాలయంలో వరుసగా వెలుగుచూసిన లైఫ్‌ట్యాక్స్ అవినీతి, సెకండ్ వెహికిల్ ట్యాక్స్ కుంభకోణంలో ప్రభుత్వ సొమ్ము రూ.కోట్లు పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు ఈ రెండు కుంభకోణాలతోపాటు రవాణాశాఖలో ఇతర అవినీతిపైనా దృష్టిసారించారు. స్టాంపు డ్యూటీ ఎగవేతలో జరిగిన నష్టాన్ని తవ్వుతున్నారు. గత ఏడాది నగరంలో ఈ కుంభకోణం వెలుగుచూడగా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వివరాలు సేకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ కుంభకోణంలో ఎక్కువమంది ఫైనాన్షియర్లే ఉండటంతో సరైన సమాచారం తీసుకొని చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఫైనాన్షియర్లు, రవాణాశాఖ చేసుకునే ఒప్పం దం (ఫ్రాంక్లింగ్) కోసం ఉపయోగించిన నకిలీ పత్రాలను ఆసరాగా చేసుకొని కేసులు నమోదుచేయాలని నిర్ణయానికి వచ్చారు.

ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం

మోటర్ వెహికల్ చట్టం-1988 సెక్షన్ 51, సెక్షన్ 2 ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించాలని రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ 2015 నవంబర్ 26వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఫైనాన్షియర్లు వాహనాలకు ఫైనాన్స్ చేసే క్రమంలో ఇచ్చిన రుణానికి 0.5 శాతం స్టాంపు డ్యూటీ కింద చెల్లించాలి. ఉదాహరణకు ఒక వాహనానికి రూ.లక్ష ఫైనాన్స్ చేస్తే అందులో 0.5 శాతం పన్ను కింద స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన పత్రాన్ని ఫారం నంబర్ 34కు జతపరిచి రవాణాశాఖ అధికారులకు సమర్పిస్తే వారు ఆ వాహనానికి హైపోథికేషన్‌ను ధ్రువీకరిస్తారు. ఇక్కడే ఫైనాన్షియర్లు, కొందరు అధికారులు కుమ్మక్కై ప్రభుత్వాన్ని, వాహనదారులను మోసం చేస్తున్నారు. పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. ఒక వాహనానికి చెల్లించిన పన్నుకు సంబంధించిన పత్రాన్ని ఇతర వాహనాల హైపోథికేషన్ కోసం వాడుతున్నారు. దీంతో ప్రభుత్వానికి కట్టాల్సిన స్టాంప్ డ్యూటీని ఎగ్గొడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విచ్చలవిడిగా జరుగుతున్న ఈ దందా జిల్లాలకు కూడా పాకింది. హైదరాబాద్‌లో చెల్లించిన స్టాంపుడ్యూటీ పత్రాలను ఇతర జిల్లాల వాహనాలకు కూడా ఉపయోగించుకుంటూ ప్రభుత్వానికి రూ.కోట్ల మేర నష్టం కలిగిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ లోపాన్ని ఆసరగా చేసుకుని ఫ్రాంక్లింగ్‌లో పూర్తి వివరాలు అందజేయకుండా మాయ చేస్తున్నారు. ఈ అక్రమ దందాకు వేలల్లో ఉదాహరణలు ఉన్నా సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఫైనాన్షియర్లు ఇచ్చిన పత్రాలతోనే రవాణాశాఖ అధికారులు హైపోథికేషన్ క్లియరెన్స్ ఇస్తున్నారు. ఈ దందా ఎక్కువగా ఆటోల యాజమాన్య బదిలీల్లో జరుగుతున్నది. ఒక్కోసారి 10 వాహనాలకు ఒకేసారి ఫ్రాంక్లింగ్ ఇస్తుండటంతో ఏ వాహనానికి ఎంత స్టాంపు డ్యూటీ చెల్లించారనే అంశంపై స్పష్టత రావడం లేదు.

రాబడి అవకతవకలపై సీరియస్

ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే శాఖల్లో ఒక్కటైన రవాణాశాఖలో పన్ను ఎగవేత, ఖజనాకు నష్టం వాటిల్లడంపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉన్నది. అవినీతితో పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేయడంపై దృష్టి సారించింది. ఏడాది కిందట వెలుగుచూసిన సెకండ్ వెహికల్ ట్యాక్స్ అవకతవకల్లో ఇప్పటివరకు సుమారు రూ.5.5 కోట్లను రవాణాశాఖ రికవరీ చేసింది. ఇటీవల బండ్లగూడలో వెలుగుచూసిన లైఫ్‌ట్యాక్స్ అవినీతిలో రూ.1.20 కోట్లు నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తాన్ని సూత్రధారులు, పాత్రధారుల నుంచి రికవరీ చేయాలని నిర్ణయించారు. ఇదే విధంగా స్టాంప్ డ్యూటీ ఎగవేతలోనూ ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లు నష్టం వాటిల్లినట్టు అంచనాకు వచ్చారు. స్టాంప్ డ్యూటీ ఎగవేతతో ప్రభుత్వ ఖజానాకు జరుగుతున్న నష్టాన్ని జూన్ 2017లో 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. ఈ కథనం ఆధారంగా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.



రెండో విడుత పల్స్ పోలియో ఆదివారం విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదేండ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. హైదరాబాద్ కార్వాన్‌లో 47 కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 7 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్వాన్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓ చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ నళిని.

పోస్టు ద్వారా తలాక్!

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

చార్మినార్: పెండ్లంటే నూరేండ్ల పంట అనే మాటలను వమ్ము చేస్తూ మున్నాళ్ల ముచ్చటగా మార్చాడో ప్రబుద్ధుడు. పోలీసులు, భాదితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇమ్లిబన్ ప్రాంతానికి చెందిన ఖాదర్(31) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన ఇర్ఫానాబేగంతో గత డిసెంబర్ 11న పెండ్లి జరిగింది. పెండ్లి జరిగిన రోజే ఖాదర్ ఇర్ఫానాబేగంతో కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత భార్య ప్రవర్తన సరిగ్గాలేదని చెప్పిన ఖాదర్ ఆమెను తల్లిగారింటికి పంపించాడు. అనంతరం ఇర్ఫానాబేగంకు తలాక్ తెలిపినట్టు ఇటీవల పోస్ట్ ద్వారా లేఖను పంపించాడు. విషయం తెలుసుకున్న ఇర్ఫానాబేగం తనను ఖాదర్ మోసంచేశాడని రెయిన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఓయూలో ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేస్తున్న టీఎస్‌టీఎస్ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేశ్, వివిధ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాల ప్రతినిధులు

సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారు

- కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాల పెంపు హర్షనీయం
- కేసీఆర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు: యూటీఏసీ-టీఎస్, ఓయూసీఏపీ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాల పెంపు ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపడంపై యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ - తెలంగాణ స్టేట్ (యూటీఏసీ-టీఎస్), ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్(ఓయూసీఏపీ) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తమకు సహకరించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, డిప్యూటీసీఎం కడియం శ్రీహరి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రంజీవ్ ఆర్ ఆచార్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) చైర్మెన్ డాక్టర్ చిరుమళ్ల రాకేశ్‌తో కలిసి కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని వేతనాలను 75 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ పెంపు గతేడాది నవంబర్ నుంచి అమల్లోకి తేవాలన్న ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,562 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. రెగ్యులర్ అధ్యాపకులతో దాదాపు సమానంగా వేతనం చెల్లించాలని నిర్ణయించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తమను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా, కొందరు కావాలనే కోర్టుల్లో కేసులు దాఖలు చేసి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఆరు నెలల్లో వేతనాలను వంద శాతం మేర పెంచారని పేర్కొన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా తమ బాధలు పట్టించుకోలేదని విమర్శించారు. తమ కుటుంబాలు పడుతున్న బాధలను అర్థం చేసుకొని వాటిని తీర్చేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఏసీ-టీఎస్ అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం, వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు కృష్ణయ్య, వినీతా పాండే, యశ్వంత్‌రావు, చంద్రశేఖర్, ప్రేమయ్య, వెంకటేశ్వర్లు, నిరంజన్, రవికుమార్, ఆనంద్, భానుమతి, శశికాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దంపతుల మృతి

శుభకార్యానికి వెళ్లివస్తుండగా ప్రమాదం

హయత్‌నగర్‌లోని ఔటర్ సర్వీస్‌రోడ్డుపై ఘటన

హయత్‌నగర్: రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు ఇన్నర్ సర్వీస్ రోడ్‌పై ఆదివారం రాత్రి ఓ కారు టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాత హయత్‌నగర్‌కు చెందిన దంపతులు వస్పరి నర్సింహ(58), బుచ్చమ్మ(56) మృతి చెందారు. వీరు ఓ శుభకార్యానికి హాజరై తిరిగి టీవీఎస్ ఎక్సెల్‌పై తారమత్‌పేట్ ఓఆర్ఆర్ ఇన్నర్ సర్వీస్ రోడ్ మీదుగా పెద్ద అంబర్‌పేట వైపు వస్తుండగా పెద్ద అంబర్‌పేట నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో నర్సింహ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, బుచ్చమ్మ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది. ఇద్దరూ జీహెచ్ఎంసీలో అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టీవీఎస్

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



మాదిగ, మాదిగ ఉపకులాల ప్రతినిధుల సభలో అభివాదం చేస్తున్న నాయకులు

- ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- మాదిగ, మాదిగ ఉపకులాల సభలో యాతాకుల భాస్కర్, వంగపల్లి శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే డప్పు, చెప్పు కళాకారులకు రూ.2 వేల పెన్షన్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తిచేశారు. మాదిగ, మాదిగ ఉపకులాల రాష్ట్ర ప్రతినిధుల సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీసీలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్టే, ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రకటించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని విజ్ఞప్తిచేశారు. సంచార జాతులకు చెందిన వారికి ఆర్డీవో, మిగిలిన వారికి ఎమ్మార్వో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారని, అలాకాకుండా ప్రతి ఒక్కరికీ ఎమ్మార్వోనే కుల ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఎస్సీలకు ఖర్చు చేసే నిధుల గురించి ప్రత్యేకంగా వివరించాలని కోరారు. అప్పటి వరకు ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన రానిపక్షంలో ఈ నెల 17, 18వ తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు ప్రకటించారు. 19న ఎమ్మార్వో కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయాలని, 21న జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల వద్ద ఒక రోజు దీక్షలు చేపట్టి, వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. అన్ని కులాలను కలిసి మాట్లాడుతున్న సీఎం, మాదిగలను కూడా కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 23న సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు తరలిరానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మేడి పాపయ్య, సుంకపాక దేవయ్య, రాజమౌళి, వీరేశం, మంగేశ్, భాస్కర్ వేల్పూరి, బాలమణి, భూమన్న, గుర్రాల శ్రీను, కొల్లూరి వెంకట్, అలెగ్జాండర్, కొంగరి శంకర్, రమేశ్, చందు, తిరుమలేశ్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా ఎయిర్‌షోకు చివరిరోజైన ఆదివారం సందర్శకులు పోటెత్తారు. విద్యాసంస్థలు, కార్యాలయాలకు సెలవు కావడంతో కుటుంబంతో సహ వచ్చి ప్రదర్శనను తిలకించారు. విమానాల ముందు ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. శ్రీలక్ష్మీసమేతుడైన నరసింహస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులతో క్యూలైన్లు, సముదాయాలు, మొక్కు పూజల నిర్వహణ మండపాలు కిక్కిరిసిపోయాయి. నారసింహుడిని దర్శించుకొనేందుకు కుటుంబంతో సహ వచ్చి గంటల కొద్దీ క్యూలో నిల్చున్నారు. భక్తులతో ఆలయ దారులు, పట్టణ వీధులు సందడిగా మారాయి. సత్యనారాయణస్వామి వ్రతపూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ





కొమురవెల్లిలో భక్తుల కోలాహలం

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామివారి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. చివరి ఆదివారం, అగ్నిగుండాల సందర్భంగా స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

- చేర్యాల, నమస్తే తెలంగాణ

పీఎస్‌బీల్లో ఆర్బీఐ ప్రత్యేక ఆడిట్

న్యూఢిల్లీ, మార్చి 11: దేశీయ బ్యాంకింగ్ రంగం వరుస కుంభకోణాలతో కుదేలవడంతో ఆందోళన చెందుతున్న రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వ్యాపార సంస్థలతో లావాదేవీలు సాగించే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో ప్రత్యేక ఆడిటింగ్‌కు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ట్రేడ్ ఫైనాన్సింగ్ కార్యకలాపాలు నిర్వహించే బ్యాంకులు, అవి జారీ చేస్తున్న అండర్ టేకింగ్ లెటర్ (ఎల్‌వోయూ)లపైన ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని ఆర్బీఐ నిర్ణయించుకున్నది. ఇందులో భాగంగా ఇప్పటివరకూ జారీ చేసిన ఎల్‌వోయూల జాబితాతో పాటు, ముందస్తు రుణ అంగీకార పరిమితులు, మార్జిన్ కోసం ఉంచిన నగదు నిల్వలు, గ్యారెంటీల వివరాలను అందజేయాల్సిందిగా దేశంలోని అన్ని బ్యాంకులను ఆర్బీఐ ఆదేశించింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన సహచరుల ప్రమేయంతో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన భారీ కుంభకోణంతో పాటు దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన అనేక మోసాలు ట్రేడ్ ఫైనాన్స్‌కు సంబంధించినవే కావడం, అలాగే ఉద్దేశ్యపూర్వక రుణ ఎగవేతలకు సంబంధించిన అనేక కేసుల మూలాలు కూడా ట్రేడ్ ఫైనాన్స్ రంగంలోనే ఉండటంతో దీనిపై రిజర్వు బ్యాంకు ఈ ఆదేశాలను జారీ చేసిందని బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. నీరవ్ మోదీ, ఆయన వ్యాపార భాగస్వాములు పీఎన్‌బీ సిబ్బందితో కుమ్మక్కై తప్పుడు అండర్ టేకింగ్ లెటర్లతో రూ.12,646 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడటంతో ట్రేడ్ ఫైనాన్స్‌తో పాటు అండర్ టేకింగ్ లెటర్లు, క్రెడిట్ లెటర్ (ఎల్‌సీ)లపై ఆర్బీఐ ప్రత్యేక పరిశీలన జరపాల్సిన అవసరం ఏర్పడిందని ఆ వర్గాలు తెలిపాయి.

త్వరలో రూ.1,245 కోట్ల
ఎన్‌పీఏల అమ్మకం

ఎస్‌బీఐ, యూకో బ్యాంక్ ప్రకటన
కొనుగోలుదారుల కోసం ఎదురుచూపు

న్యూఢిల్లీ, మార్చి 11: మొండి బకాయిలను వదిలించుకుని బ్యాలెన్స్ షీట్లను ప్రక్షాళన చేసుకునేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.1,245 కోట్ల విలువైన నిరర్థక ఆస్తులను (ఎన్‌పీఏలను) అమ్మేందుకు కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), యూకో బ్యాంక్‌లు ఈ విషయమై అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ)లు, ఆర్థిక సంస్థ (ఎఫ్ఐ)లు, బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల నుంచి బిడ్లను ఆహ్వానించాయి. నిరర్థక ఆస్తుల అమ్మకానికి సంబంధించి రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా సవరించిన విధానం ప్రకారం జెనిత్ బిర్లా (ఇండియా) లిమిటెడ్, సోనా అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులను అమ్మకానికి పెడుతున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ బిడ్ డాక్యుమెంట్‌లో స్పష్టం చేసింది. ఎస్‌బీఐకి సోనా అల్లాయిస్ సంస్థ రూ.647.64 కోట్లు, జెనిత్ బిర్లా సంస్థ రూ.139.36 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ రెండు సంస్థల ఆస్తులను అమ్మేందుకు ఈ నెల 23వ తేదీన ఈ–బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని, వీటిని కొనుగోలు చేయాలని ఆసక్తితో ఉన్నవారు ఈ నెల 12వ తేదీన బిడ్లు దాఖలు చేయాలని ఎస్‌బీఐ సూచించింది. ఇదేవిధంగా రూ.457.98 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు దాదాపు 13 నిరర్థక ఆస్తులను గుర్తించిన యూకో బ్యాంకు ఈ నెల 13వ తేదీలోగా వాటిని అమ్మాలని నిశ్చయించుకున్నది. వీటిని కొనుగోలు చేయదల్చుకున్న ఏఆర్‌సీలు, బ్యాంకులు, ఎఫ్ఐలు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ఆ బ్యాంకు ఆసక్తి లేఖలను ఆహ్వానించింది. వివిధ కంపెనీలకు ఇచ్చిన రూ.16,349 కోట్ల రుణాలను రాబట్టుకునేందుకు దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అతిపెద్దదైన ఎస్‌బీఐ గత వారం యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో పాటు దీర్ఘకాలిక మౌలిక వసతుల రుణ సంస్థ ఐఎఫ్‌సీఐతో కలసి అనేక నిరర్థక ఆస్తులను అమ్మకానికి పెట్టిన విషయం విదితమే. గత డిసెంబర్ నెలాఖరు నాటికి దేశంలోని అన్ని బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.8.41 లక్షల కోట్లకు చేరుకోగా, వీటిలో అత్యధిక ఎన్‌పీఏలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే పేరుకుపోయాయి. దీంతో గత కొంత కాలం నుంచి రుణాల రికవరీ ప్రక్రియను వేగవంతం చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకులు మొండి బకాయిలుగా మారిన నిరర్థక ఆస్తులను అమ్మేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నాయి.

ఎన్‌పీఏగా మారిన ఎస్‌టీసీ ఖాతాలు

స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎస్‌టీసీ)కి చెందిన ఖాతాలను నిరర్థక ఆస్తులుగా పరిగణిస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించాయి. ఈ రెండు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై ఎస్‌టీసీ వడ్డీ చెల్లించకపోవడమే ఇందుకు కారణం. 'ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి తీసుకున్న రుణాలపై రూ.19.29 కోట్ల వడ్డీని చెల్లించకపోవడంతో ఆ రెండు బ్యాంకులు ఈ నెల 1వ తేదీన ఎస్‌టీసీ ఖాతాలను ఎన్‌పీఏగా ప్రకటించాయి. దీని ఫలితంగా ఆ బ్యాంకులు ఇకముందు మాకు రుణాలు ఇవ్వకపోవచ్చు' అని స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)కి తెలియజేసింది.

భారత్, చైనాలే కీలకం

■ అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిపై ఐఎంఎఫ్

వాషింగ్టన్, మార్చి 11: ప్రాంతీయ, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధికి భారత్, చైనాలే చోదక శక్తులుగా పనిచేస్తున్నాయని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టావో ఝంగ్ అన్నారు. భారత్ పర్యటనకు ముందు పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా ఈ రెండు దేశాలే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల్ని నడిపిస్తున్నాయన్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధన సాయం ఆర్థిక సంస్కరణల్లో అంతర్భాగంగానే ఉండాలని అన్నారు. కాగా, పాత పెద్ద నోట్ల రద్దు ఇబ్బందుల నుంచి భారత్ ఇప్పుడు బయటపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు.



సౌర విప్లవం రావాలి

ప్రపంచవ్యాప్తంగా సౌర కాంతులు విరజిమ్మాలి ■ ఐఎస్‌ఏ వ్యవస్థాపక సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష
2022కల్లా పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 175 గిగావాట్ల విద్యుదుత్పత్తి భారత్ లక్ష్యం

న్యూఢిల్లీ, మార్చి 11:

సౌర విద్యుదుత్పత్తికి అన్నివిధాలా సహకరిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. విద్యుదుత్పత్తిలో సౌర విద్యుత్ వాటా పెరుగడానికి సోలార్ ప్రాజెక్టులకు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే రాయితీలతో కూడిన ఆర్థిక సాయం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక్కడ జరుగుతున్న రెండు రోజుల అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్‌ఏ) వ్యవస్థాపక సదస్సులో ఆదివారం ప్రసంగించిన మోదీ.. 2022కల్లా పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 175 గిగావాట్ల విద్యుదుత్పత్తి భారత్ లక్ష్యమన్నారు. ఇది ప్రస్తుత పునరుత్పాదక ఇంధన సామర్థ్యం కంటే రెండింతలకుపైగా ఎక్కువని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు 2017–18 నుంచి 2021–22 మధ్య 83 బిలియన్ డాలర్ల నిధులు అవసరమవుతాయని పరిశ్రమ అంచనా వేస్తున్నట్లు చెప్పిన ప్రధాని.. 100 గిగావాట్లు సౌర శక్తి నుంచి, మరో 60 గిగావాట్లు పవన శక్తి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. ఇప్పటికే 20 గిగావాట్ల సౌర విద్యుదుత్పత్తి లక్ష్యాల్ని అందుకున్నట్లు చెప్పారు. పునరుత్పాదక వనరుల నుంచి వచ్చే విద్యుత్ చౌక, నమ్మకమైన, పరిశుద్ధమైనదిగా పేర్కొన్న మోదీ.. ప్రస్తుతం దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 63 గిగావాట్లుగా ఉందన్నారు. ఐఎస్‌ఏ నిర్మాణంలో మోదీనే కీలకపాత్ర పోషించగా, శనివారం మొదలైన ఈ సదస్సులో 50కిపైగా దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఇక భారత్‌లోనేగాక ప్రపంచవ్యాప్తంగా సౌర విప్లవం రావాలన్న మోదీ.. అందుకు అనుగుణంగా 10 కార్యాచరణ సూత్రాలనూ ఈ సందర్భంగా ప్రకటించారు. అన్ని దేశాలకు అత్యుత్తమ సోలార్ టెక్నాలజీ చౌకగా అందుబాటులోకి రావాలన్నారు. కాంతివిపీడన కణాల నుంచి జరిగే విద్యుదుత్పత్తి పెరుగాలన్నారు. నియంత్రణ, నియమ నిబంధనలు, ప్రమాణాలుండాలన్నారు. కాగా, ఐఎస్‌ఏ ప్రధాన ఆశయం.. ప్రపంచవ్యాప్తంగా సౌర విద్యుత్ సామర్థ్యం వెయ్యి గిగావాట్లపైకి చేరుకోవడమే. ఐఎస్‌ఏ ప్రధాన కేంద్రం గుర్గావ్ సమీపంలో ఉండగా, దీనితో 121 దేశాలు అనుబంధంగా పనిచేస్తున్నాయి. ఈ కూటమిలో 61 దేశాలు ఇప్పటికే చేరగా, ఇందులో 32 దేశాలు మార్గదర్శక ఒప్పందాన్ని ఆమోదించాయి. ఇదిలావుంటే అమెరికాతో పాటు చైనా ఈ కూటమిలో చేరేందుకు ఇప్పుడు ఆసక్తి కనబరుస్తున్నాయి.



ఐఎస్‌ఏ సదస్సులో గ్రామీణ సోలార్ ఇంజనీర్ల బృందంతో ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

లక్ష కోట్ల డాలర్లు కావాలి

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 2030కల్లా ఒక టెరావాట్‌ను అందుకోవడానికి లక్ష కోట్ల డాలర్లు కావాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ అన్నారు. ఐఎస్‌ఏ వ్యవస్థాపక సదస్సులో మాట్లాడిన ఆయన నిర్దేశిత సోలార్ లక్ష్యాల సాధనకు అనేక ఆర్థిక, నియంత్రణ సమస్యలు అడ్డుపడుతున్నాయని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగం, పౌర సంఘాలన్నీ కలిసి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే చారిత్రక పారిస్ వాతావరణ ఒప్పందాన్ని నీరుగార్చారంటూ పరోక్షంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను విమర్శించిన ఆయన ఐఎస్‌ఏ దేశాలైనా ఒక్కటిగా నిలబడి పూర్తి ఫలితాల్ని రాబట్టుకోవాలన్నారు. ఇదిలావుంటే భారతీయ వాణిజ్య ఏరోస్పేస్ మార్కెట్‌లో మరిన్ని భారీ ఒప్పందాలకు అవకాశం ఉందని ఫ్రాన్స్ దిగ్గజ సంస్థ సఫ్రాన్స్ సీఈవో ఫిలిప్పే పెటిట్కోలిన్ పీటీఐతో అన్నారు. స్పైస్‌జెట్‌తో 12.5 బిలియన్ డాలర్ల (రూ.81,000 కోట్లకుపైగా) డీల్‌ను సఫ్రాన్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ డీల్‌లో భాగంగా స్పైస్‌జెట్‌కు దాదాపు 340 ఇంజిన్లను సఫ్రాన్ సరఫరా చేయనున్నది.

లక్షలాది ఉద్యోగాలు మాయం

రెండేండ్లలో ఖాదీ పరిశ్రమలో 7 లక్షల మందికి కరువైన ఉపాధి ■ కళాకారుల పొట్టకొడుతున్న మోడల్ చరఖాలు

న్యూఢిల్లీ, మార్చి 11: ఖాదీ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కరువవుతున్నాయి. ఉత్పత్తి పెరుగుతున్నా.. ఉద్యోగాలు మాత్రం అంతరించిపోతున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ) మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2015–16, 2016–17 మధ్య ఏకంగా ఏడు లక్షల కొలువులు మాయమైపోయాయి. ఖాదీ రంగంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య ఈ రెండేండ్లలో 11.6 లక్షల నుంచి 4.6 లక్షలకు పడిపోయినట్లు లోక్‌సభకు సదరు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే ఇదే వ్యవధిలో ఖాదీ ఉత్పత్తి 31.6 శాతం, అమ్మకాలు 33 శాతం పెరుగడం గమనార్హం. ఇక కొత్త రకం చరఖాలు.. ఖాదీ కళాకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల సంఘం (కేవీఐసీ) చెబుతున్నది. సంప్రదాయ చర్ఖాల స్థానంలో పరిచయమైన కొత్త రకం చరఖాలు .. కొన్ని ఉద్యోగాలను హరించాయని కేవీఐసీ అంగీకరించింది. ఇంతకుముందు సంప్రదాయ స్పిన్నర్లే ఉండేవని, వీటిపై ఎక్కువ మంది పనిచేసేవారన్న కేవీఐసీ.. కొత్త రకం చరఖాల రాకతో పాత కళాకారులకు పని కరువైందని చెప్పింది. అయితే ఇలా



ఉపాధి కోల్పోయిన వారెందరుంటారన్నదానిపై అటు ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ నుంచిగానీ, ఇటు కేవీఐసీ నుంచిగానీ స్పష్టమైన సమాచారం లేదు. అంతేగాక 2015–16 వరకున్న ఉపాధి గణాంకాలు ఖాదీ రంగంలోని వాస్తవ పరిస్థితికి అద్దం పట్టలేదంటున్న కేవీఐసీ.. ఇందుకు కారణం కొత్తగా వచ్చిన ఉద్యోగాల వివరాల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని, పోయిన ఉద్యోగ వివరాల్ని పొందుపర్చలేదని అంటున్నది. ఇదిలావుంటే 2015–16 నుంచి 2016–17 వరకు ఖాదీ రంగంలో ఉపాధి కోల్పోయిన 6.8 లక్షల మందిలో 3.2 లక్షల మంది ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లతో కూడిన సెంట్రల్ జోన్‌వారే. బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిషా, అండమాన్ నికోబార్‌లతో ఉన్న తూర్పు జోన్‌లో సుమారు 1.2 లక్షల మందికి ఉపాధి దూరమైంది.

తగ్గిపోతున్న పీఎంఈజీపీ ఉపాధి కల్పన

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18)లో ప్రధాన మంత్రి ఉద్యోగ సృష్టి కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద ఉపాధి కల్పన కూడా తగ్గిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2015–16లో దాదాపు 3.2 లక్షల మందికి ఉపాధి అవకాశాల్నిచ్చిన పీఎంఈజీపీ.. 2016–17లో 4.1 లక్షల మందికి ఉద్యోగాల్నిచ్చింది. ఈ క్రమంలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి పది నెలల్లో (ఏప్రిల్–జనవరి) 2.5 లక్షల మందికి మాత్రమే పీఎంఈజీపీ కింద ఉపాధి లభించినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపిన వివరాలనుబట్టి తెలుస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇదే వ్యవధిలో పీఎంఈజీపీ ప్రాజెక్టుల సంఖ్యా 53,000ల నుంచి 31,000 పడిపోవడం గమనార్హం. పీఎంఈజీపీ అనేది రుణ ఆధారిత రాయితీ పథకం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కొత్తగా ఏర్పాటుచేసే సూక్ష్మ సంస్థలకు పీఎంఈజీపీ అండగా నిలుస్తుంది.

అతిగా స్పందిస్తే భారీ నష్టం తథ్యం

■ పీఎన్‌బీ కుంభకోణంపై అసోచామ్

న్యూఢిల్లీ, మార్చి 11: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన కుంభకోణంపై అటు బ్యాంకులు, ఇటు దర్యాప్తు సంస్థలు అతిగా ప్రతిస్పందిస్తున్నాయని, దీని వలన కీలకమైన వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో రుణాల పంపిణీకి విఘాతం కలిగి అభివృద్ధి అంచనాలకు దెబ్బ తగిలే అవకాశం ఉన్నదని అసోచామ్ హెచ్చరించింది. పీఎన్‌బీ కుంభకోణం వలన జరుగుతున్న బహుముఖ నష్టాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించేందుకు ప్రభుత్వంతో పాటు బ్యాంకులు, నియంత్రణా సంస్థలు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు అన్ని రకాల ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉన్నదని అసోచామ్ ఉద్ఘాటించింది. 'ఇటీవల వరుసగా వెలుగులోకి వచ్చిన కుంభకోణాలు, వాటిపై ప్రచార మాధ్యమాల్లో వచ్చిన వార్తలతో ఒకవైపు బ్యాంకులు అతిగా జాగ్రత్త వహిస్తుండగా, మరోవైపు కఠిన చర్యలు చేపట్టాల్సిందిగా ప్రజల నుంచి నియంత్రణా సంస్థలపై వత్తిడి పెరుగుతున్నది. సమస్య తీవ్రతను బట్టి చూస్తుంటే ఇంత అతిగా స్పందించడం సమర్థనీయమేనని అనిపిస్తున్నప్పటికీ, దీని వలన విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఏర్పడవచ్చు. కనుక ఇప్పుడు ఎంతో నిగ్రహాన్ని ప్రదర్శించడంతో పాటు ప్రతికూల పరిస్థితిని అవకాశంగా మలుచుకుని వ్యవవస్థాగత లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతో ఉన్నది' అని అసోచామ్ ప్రధాన కార్యదర్శి డీఎస్ రావత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భయానికి తావులేకుండా చూడాలి: ఫిక్కీ

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో ఇటీవల వెలుగులోకి వచ్చిన రూ.13 వేల కోట్ల భారీ కుంభకోణం దేశ ఆర్థిక వ్యవస్థలో భయోత్పాతానికి దారితీయకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తగిన చర్యలు చేపట్టాలని భారత వాణిజ్య, పారిశ్రామిక మండళ్ల సమాఖ్య (ఫిక్కీ) విజ్ఞప్తి చేసింది. 'పీఎన్‌బీ కుంభకోణం భయాందోళనలకు, దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయేందుకు దారితీయకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది' అని ఫిక్కీ అధ్యక్షుడు రాశేష్ షా స్పష్టం చేశారు. ఈ విషయమై అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇటు రిజర్వు బ్యాంకుకు లేఖలు రాసినట్లు ఆయన తెలిపారు. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రమేయంతో పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణం దేశ ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేస్తుందా? అని ప్రశ్నించగా, అటువంటి భయాందోళనల నుంచి మనం బయటపడాలని, ఈ కుంభకోణంపై జరుగుతున్న దర్యాప్తు భయోత్పాతానికి దారితీయకూడదని ఆయన అన్నారు.

ఐఐపీ, ద్రవ్యోల్బణం దిక్సూచి

అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే ■ ఈ వారం మార్కెట్ కదలికలపై నిపుణుల అంచనా



న్యూఢిల్లీ, మార్చి 11: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ), ద్రవ్యోల్బణం వంటి కీలక స్థూల ఆర్థిక గణాంకాలపై ఆధారపడి నడుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. 'వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం, ఐఐపీ గణాంకాల కోసం మదుపరులు ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి నెలలో సీపీఐ ద్రవ్యోల్బణం 4.74 శాతానికి దిగివస్తుందన్న అంచనాలున్నాయి' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు వికాస్ జైన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బాండ్ మార్కెట్‌కు సీపీఐ గణాంకాలు కీలకమని, స్టాక్ మార్కెట్లనూ గడిచిన ఆరు నెలలుగా ఇవి ప్రభావితం చేస్తున్నాయని ఇపిక్ రిసెర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ చెప్పారు. జనవరిలో రిటైల్ (సీపీఐ) ద్రవ్యోల్బణం 5.07 శాతానికి పడిపోగా, టోకు ధరల సూచీ (డబ్ల్యుపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 2.84 శాతంగా నమోదైంది. డిసెంబర్‌లో ఇవి వరుసగా 5.21 శాతం, 3.58 శాతంగా ఉన్నాయి. ఇక ఐఐపీ డిసెంబర్‌లో 7.1 శాతంగా ఉన్నది. ఇకపోతే ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల కదలికలు దేశీయ స్టాక్ మార్కెట్ల పోకడను నిర్దేశించగలవు. కాగా, శనివారం జరిగిన వస్తు, సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) 26వ సమావేశం నిర్ణయాల ప్రభావం కూడా మదుపరులపై ఉండొచ్చన్న అభిప్రాయాలున్నాయి. గత వారం సెన్సెక్స్ 740 పాయింట్లు, నిఫ్టీ 232 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

నాలుగు ఐపీవోలు

ఈ వారం నాలుగు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) రానున్నాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఐపీవో ఈ నెల 13న ప్రారంభం కానుండగా, 15న ముగియనున్నది. దాదాపు రూ.960 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా వస్తున్న ఈ ఐపీవోలో షేర్ల ధరల శ్రేణి రూ.413–428గా ఉన్నది. బంధన్ బ్యాంక్ ఐపీవో 15న మొదలు కానుండగా, రూ.4,473 కోట్ల నిధుల సమీకరణే ధ్యేయంతో వస్తున్న ఈ ఐపీవోలో షేర్ల ధరల శ్రేణి రూ.370–375 మధ్య ఉన్నది. మార్చి 16–20 మధ్య రూ.4,200 కోట్ల హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ఐపీవో రానుండగా, 16నే కర్దా కన్‌స్ట్రక్షన్ ఐపీవో వస్తున్నది. రూ.77.40 కోట్ల నిధులను సంస్థ సమీకరిస్తుందని అంచనా.

రూ.67,153 కోట్లు ఆవిరి

గత వారం సెన్సెక్స్‌లోని టాప్–10 సంస్థల్లో ఎనిమిదింటి మార్కెట్ విలువ రూ.67,153.81 కోట్లు ఆవిరైపోయింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్ మినహా మిగతా 8 సంస్థల మార్కెట్ విలువ తగ్గుముఖం పట్టింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ అత్యధికంగా రూ.22,533.65 కోట్లు పడిపోగా, ఓఎన్‌జీసీ (రూ.12,704.90 కోట్లు), ఎస్‌బీఐ (రూ.8,114.13 కోట్లు), మారుతి సుజుకీ (రూ.6,393.52 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.6,367. 69 కోట్లు), హెచ్‌యూఎల్ (రూ.5,419.33 కోట్లు), ఐటీసీ (రూ.5,122.88 కోట్లు), టీసీఎస్ (రూ.497.71 కోట్లు) షేర్ల విలువ కూడా క్షీణించింది. అయితే హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ విలువ రూ.959.68 కోట్లు, ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.688.13 కోట్లు చొప్పున పెరిగింది. టాప్–10 సంస్థల్లో రూ.5,80,890.57 కోట్లతో టీసీఎస్ అగ్రస్థానంలో, రూ.5,77,751.85 కోట్లతో ఆర్ఐఎల్ రెండో స్థానంలో నిలిచింది.

రూ.6,000 కోట్ల ఉపసంహరణ

దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతున్నది. ఈ నెలలో కేవలం ఆరు రోజుల్లోనే దాదాపు రూ.6,000 కోట్లను వెనుకకు తీసుకున్నారు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ). మార్చి 1–9 మధ్య జరిగిన ఈ ఆరు రోజుల ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ల నుంచి రూ.2,410 కోట్లు, రుణ మార్కెట్ల నుంచి రూ.3,473 కోట్లను తరలించుకుపోయారు. దీంతో ఈ నెలలో ఇప్పటిదాకా అటు స్టాక్ మార్కెట్లు, ఇటు రుణ మార్కెట్ల నుంచి పోయిన పెట్టుబడుల విలువ రూ.5,883 కోట్లుగా నమోదైంది. ఫిబ్రవరిలోనూ రూ.11,000 కోట్లకుపైగా పెట్టుబడులను విదేశీ మదుపరులు పట్టుకుపోయిన సంగతి విదితమే. అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరుగుతుండటం, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచబోతున్నదన్న అంచనాలే.. దేశీయ మార్కెట్లలో విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు ప్రధాన కారణంగా నిలుస్తున్నది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ కరువు



గోల్డ్ ఎక్స్ఛేంజ్–ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)కు ఆదరణ కరువవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18)లో ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య రూ.773 కోట్ల ఉపసంహరణలు జరిగాయి. గత నెల ఫిబ్రవరిలో 14 గోల్డ్–లింక్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.94 కోట్లను మదుపరులు వెనుకకు తీసుకున్నట్లు భారతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జనవరిలో రూ.110 కోట్లు తిరిగి తీసేసుకోగా, గతేడాది ఫిబ్రవరిలో రూ.46 కోట్లు లాగేసుకున్నారు. ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడం, ధరల్లో ఒడిదుడుకుల కారణంగానే గోల్డ్ ఈటీఎఫ్‌లపట్ల మదుపరులు అనాసక్తిని కనబరుస్తున్నారు. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం పరిస్థితి మెరుగ్గా ఉంటుందన్న అంచనాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగే అవకాశాలే ఎక్కువగా ఉన్నందున బంగారంపై పెట్టుబడులు పెరుగవచ్చన్న అభిప్రాయాల్ని వినిపిస్తున్నారు. కాగా, అంతకుముందు వరుసగా నాలుగేండ్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణే జరుగడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం (2016–17)లో రూ.775 కోట్లు వెనుకకు పోగా, 2015–16లో రూ.903 కోట్లు, 2014–15లో రూ.1,475 కోట్లు, 2013–14లో రూ.2,293 కోట్లు చొప్పున పెట్టుబడుల ఉపంసహరణ జరిగింది.

ప్రతీకార చర్యలకు దిగితే ఊరుకోం

■ యూరోపియన్ కార్లపై సుంకాలు భారీగా పెంచుతాం
■ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, మార్చి 11: అందరూ అనుకున్నట్లుగానే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను భారీగా పెంచి వాణిజ్య యుద్ధానికి తెర లేపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఈ విషయమై ఇతర దేశాలను బెదిరిస్తున్నారు. ఈ సుంకాలపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రతీకార చర్యలకు దిగితే యూరప్ దేశాలకు చెందిన కార్లపై దిగుమతి సుంకాన్ని భారీగా పెంచుతామని ఆయన హెచ్చరించాడు. సొంత పార్టీ నుంచే తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ ఉక్కు దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం దిగుమతులపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం ట్రంప్ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సుంకాలను పెంచుతామని ట్రంప్ తొలుత ప్రతిపాదించినప్పుడే తాము కూడా ప్రతీకార చర్యలు చేపడతామని యూరోపియన్ యూనియన్ స్పష్టం చేసింది. అయితే ఈ విషయంలో యూరోపియన్ యూనియన్ వెనక్కి తగ్గాలని, అలా చేయకుండా హార్లీ డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్లు, బ్లూ జీన్స్ లాంటి అమెరికా ఉత్పత్తులపై పన్నులు విధిస్తే యూరప్ దేశాల్లో తయారయ్యే కార్లపై తాము కూడా భారీ స్థాయిలో పన్నులు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికాలో తయారయ్యే ఉత్పత్తులపై యూరోపియన్ యూనియన్ సుంకాలను తగ్గించి అవరోధాలను తొలగిస్తే తాము కూడా అదేవిధంగా వ్యవహరిస్తామని ఆయన ట్వీట్ చేశారు.

భారత్‌పై ప్రత్యక్ష ప్రభావం ఉండదు..

ఇదిలావుంటే, అమెరికా తీసుకున్న నిర్ణయం భారత లోహ పరిశ్రమపై ప్రత్యక్షంగా పెద్ద ప్రభావమేమీ చూపకపోవచ్చని దేశీయ ఉత్పత్తిదారులు అంటున్నారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో అల్యూమినియం ఉత్పత్తుల లభ్యత పెరిగి భారత ఎగుమతులపై పరోక్షంగా కొంత ప్రభావం పడవచ్చన్నారు.



మంథనిలో నూతన వధూవరులకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న మంత్రి ఈటల. చిత్రంలో ఎమ్మెల్యేలు పుట్ట మధు, దాసరి, ఎమ్మెల్సీలు నారదాసు, భానుప్రసాద్‌రావు

కల్యాణ వైభోగం

- మంథనిలో 205జంటలకు సామూహిక వివాహాలు
- ఆశీర్వదించిన మంత్రి ఈటల, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

పెద్దపల్లి ప్రతినిధి/మంథని, నమస్తే తెలంంగాణ: పెద్దపల్లి జిల్లా మంథనిలో ఆదివారం ఎమ్మెల్యే పుట్ట మధు తన తల్లి పేరిట ఉన్న 'పుట్ట లింగమ్మ ట్రస్టు' ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన 205జంటలు ఏకమయ్యాయి. ఈ వేడుకకు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, నారదాసు లక్ష్మణ్‌రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహాలు చేసుకున్న వారికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద సామూహికంగా రూ.కోటి 53లక్షల 98వేల 780 చెక్కును మంత్రి ఈటల అందజేశారు.



కామారెడ్డి జిల్లా తాడ్కోల్‌లో ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి పోచారం

అర్హులందరికీ 'డబుల్' ఇండ్లు

మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గూడులేని ప్రతీ నిరుపేద కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి, పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో 500 డబుల్‌బెడ్‌రూం నిర్మాణ పనులను ఆదివారం మంత్రి పరిశీలించారు. జీ ప్లస్ వన్ విధానంలో ఇండ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సర్కారు కట్టుబడి ఉన్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 2.65 లక్షల డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు సంకల్పించారని తెలిపారు.



సూర్యాపేట జిల్లా ఇమాంపేటలో పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

'భగీరథ' పనులు గడువులోగా పూర్తి చేయాలి

మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశం

సూర్యాపేట రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని గడువులోగా మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట మండలం ఇమాంపేటలో మిషన్ భగీరథ పనులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల్లో జాప్యంపై భగీరథ ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడ్డారు. అనంతరం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి నిర్మాణ పనులు చేపట్టిన ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. ఇకపై కలెక్టర్ పర్యవేక్షణలో పనులు కొనసాగాలని, ఎప్పటికప్పుడు పనుల్లో పురోగతిని తనకు వివరించాలని ఆదేశించారు.



నిజామాబాద్ జిల్లా బోధన్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సహకరిస్తాం

కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్

బోధన్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ జిల్లా బోధన్‌తోపాటు తెలంగాణలోని నిజాం షుగర్స్ యూనిట్లను పునరుద్ధరించి చెరుకు రైతులు, కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, ఈ విషయంలో కేంద్రం ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందజేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అన్నారు. 'చెరుకు రైతు చెర్నకోల్ యాత్ర' ముగింపు సభ ఆదివారం బోధన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నిజాం షుగర్స్ పునరుద్ధరణ విషయంలో అవసరమైన సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రతినిధి బృందాన్ని ప్రధాని మోదీ వద్దకు పంపితే తప్పకుండా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఐడీపీఎల్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు, ఎన్టీపీసీని ఆదుకునేందుకు కోట్లాది రూపాయల సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించిందన్నారు.



కరీంనగర్ సంస్కృత శంఖారావంలో మాట్లాడుతున్న ఎంపీ వినోద్‌కుమార్

సంస్కృతానికి తల్లి భాషగా గుర్తింపు

సంస్కృత శంఖారావంలో ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ కల్చరల్: భారతీయ భాషలన్నింటిలో సంస్కృతానికి తల్లి భాషగా గుర్తింపు ఉన్నదని, మన సంస్కృతి కూడా దానితోనే ముడిపడి ఉన్నదని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం కరీంనగర్‌లోని కళాభారతిలో జరిగిన రాష్ట్ర సంస్కృత పండితుల శంఖారావానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. సంస్కృత పండితుల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విభజన తర్వాత తెలంగాణకు సంస్కృత విశ్వవిద్యాలయం మంజూరు చేయాలని పలుమార్లు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. వేములవాడ సంస్కృత విద్యాపీఠం ఏర్పాటు చేయాలని ప్రస్తావించినట్టు తెలిపారు. వేములవాడలో విద్యాపీఠం కోసం 50 ఎకరాలు స్థలం చూడాలని కలెక్టర్‌ను కోరినట్టు గుర్తుచేశారు. సీఎం కేసీఆర్‌కు సంస్కృత భాష పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నదన్నారు. రామాయణం, భాగవత శ్లోకాలు అవలీలగా చదువుతారని గుర్తుచేశారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, సంస్కృత ఉపన్యాసకుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ జిల్లాలకు పండితులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

త్రిదండి చినజీయర్‌స్వామి హాజరు

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో కొలువై ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని త్రిదండి చిన జీయర్ స్వామి, దేవనాథ రామానుజ జీయర్ స్వామిల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మైహోం పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు-శ్రీకుమారి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, కన్యాదానం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినజీయర్‌స్వామి విళంబి నామ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో అన్ని వర్గాలవారికి శుభాలు కలుగాలని అభిలాషించారు. కార్యక్రమంలో కలెక్టర్ సురేంద్రమోహన్, ఆర్డీవో భిక్షానాయక్, జూపల్లి వినోద్‌రావు, రంజిత్‌రావు, రామూరావు, శ్యామూరావు, మునగాల రామ్మోహన్‌రావు, అరుణ, జూపల్లి జగపతిరావు, సుధాకర్‌రావు, యశోదా దవాఖాన నిర్వాహకులు సురేందర్‌రావు, కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మైహోం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చినజీయర్ స్వాముల పర్యవేక్షణలో కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు



కొండగట్టు ఆలయ అధికారులకు వెండి కిరీటాన్ని అందజేస్తున్న భక్తుడు

కొండగట్టు అంజన్నకు వెండి కిరీటం

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నకు సిద్దిపేట మండలం ఎల్లుపల్లికి చెందిన పూల నర్సింహారెడ్డి-భారతమ్మ దంపతులు కిలో వెండితో తయారు చేయించిన కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాసశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ జెమిని శ్రీనివాస్, ప్రధానార్చకులు రామకృష్ణ, లక్ష్మణ్‌కు అందజేశారు. ఆ దంపతులను ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలతో ఆశీర్వదించారు. కాగా, కొండగట్టు ఆంజనేయ స్వామిని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి వారితో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి దర్శనం చేయించారు.



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కాంగ్రెస్ నాయకుడు గంగామోహన్ చక్రుకు కండువా కప్పుతున్న మంత్రి కేటీఆర్, పక్కన ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు విఠోభా శేఖర్, శికారి శ్రీనివాస్. చిత్రంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



వనపర్తి జిల్లా తూంకుంటలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి జూపల్లి

టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

- గులాబీ పార్టీలో కొనసాగుతున్న వలసలు
- కండువాలు కప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:

ఉద్యమ పార్టీ టీఆర్‌ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీ గంగామోహన్ చక్రు తన అనుచరులతో, కాంగ్రెస్ నాయకులు విఠోభా శేఖర్, శికార శ్రీనివాస్ వేర్వేరుగా హైదరాబాద్‌లో ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత సమక్షంలో గులాబీ గూటికి చేరారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండలంలోని కాంగ్రెస్, టీడీపీకి చెందిన సుమారు 400 మంది కార్యకర్తలు హైదరాబాద్‌లో మంత్రి పోచారం సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూంకుంట గ్రామంలో వందమందికి పైగా నాయకులు, యువకులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో టీఆర్‌ఎస్ గూటికి చేరారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం అడికిచర్ల గ్రామానికి చెందిన 20మంది యువకులు తాండూర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అల్లిగూడెం, రామచంద్రాపురం, కస్తూరీనగర్, దొరన్నతండా, చర్లపల్లి, పేంకుతండా, పందిపడె గ్రామాలకు చెందిన 400 కుటుంబాల వారు ఎంపీ సీతారాంనాయక్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో, చండూరు మండలం జోగిగూడెంలో 200 మంది వివిధ పార్టీల కార్యకర్తలు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో గల ఎమ్మెల్యే రెడ్యానాయక్ నివాసంలో వెన్నారం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వంగురోనిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు అచ్చంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో చేరారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్‌కు చెందిన 30మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

మేమెవరికీ లంచాలివ్వలే..

- రాజకీయ లబ్ధికోసమే మంత్రిపై రేవంత్ ఆరోపణలు
- వరంగల్, మంచిర్యాల జిల్లాల రైస్ మిల్లుల నేతలు

కలెక్టరేట్(వరంగల్)/మంచిర్యాల రూరల్: రైస్ మిల్లర్లు తమ స్వలాభం కోసం పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు లంచాలు ఇచ్చారంటూ కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని వరంగల్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, మంచిర్యాల జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నలమాసు కాంతయ్య అన్నారు. ఆదివారం వారు ఆయా జిల్లాల్లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాతనే రైస్ ఇండస్ట్రీ మెరుగుపడుతున్నదని తెలిపారు. ఈనెల 8న హుజూరాబాద్ సభలో కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మంత్రి ఈటల రాజేందర్‌పై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. సమైక్య పాలనలో రైస్ ఇండస్ట్రీ మూతపడే ప్రమాదం ఉన్నదని, తమ సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. మిల్లింగ్ చార్జీలు, రవాణా చార్జీలు పెంచాలని, టెస్ట్ మిల్లింగ్ చేసి ఓటీఆర్ ద్వారా తీసుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా ఫెడరేషన్ ద్వారా వినతిపత్రం అందజేసినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదన్నారు. 2015 నవంబర్ 12న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రైస్ మిల్లర్లతో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైస్‌మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు పెంచాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు లేఖ కూడా రాశారన్నారు. తప్పుడు ఆరోపణలు, విమర్శలతో మంత్రి రాజేందర్‌పై బురద జల్లడంతోపాటు రైస్ ఇండస్ట్రీని ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు.



తోట సంపత్‌కుమార్

భద్రాచలం రామాలయంలో నిరసన

అంతరాలయంలో శివస్వామి బైఠాయింపు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రామాలయంలో ఆదివారం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అమరావతి శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అంతరాలయంలో బైఠాయించి, నిరసన తెలిపారు. రామచంద్రుని పేరిట కల్యాణం విషయంలో తమకు స్పష్టత కావాలని పట్టుబట్టారు. బ్రహ్మోత్సవాల అనంతరం తప్పక సమాధానం ఇస్తామని వైదిక సిబ్బంది చెప్పగా, శివస్వామి భక్త బృందంతో బయటికొచ్చారు. ఏప్రిల్ 1 చర్చా తేదీగా ఖరారు చేశారు. శివస్వామి విలేకరులతో మాట్లాడుతూ కల్యాణం 'రామచంద్రుని' పేరిట నిర్వహించాలని, భక్తరామదాసు ఆలయం నిర్మించిన తొలి నుంచి అదే పేరిట నిర్వహిస్తున్నారన్నారు. కాగా, అనుమానాలను నివృత్తి చేసేందుకు సిద్ధమేని భద్రాచలం రామాలయం అదర్వణ వేద పండితులు వెల్లడించారు.

నిజామాబాద్‌లో వైద్యుడి ఆత్మహత్య

పీజీలో సీటు రాక మనోవేదన

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగం సీనియర్ రెసిడెన్సీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మధు(30) ఆదివారం తన అద్దె గృహంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంసెట్ సెంకడ్ ర్యాంకర్, గోల్డ్ మెడల్ సాధించినా, పీజీ సీటు రాక రెండేండ్లుగా తీవ్ర మనోవేదనతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తల్లిదండ్రులు అంకయ్య-జయలక్ష్మి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. డాక్టర్ మధు స్వగ్రామం ప్రకాశం జిల్లా కందుకూరు. 2017 ఆగస్టులో నిజామాబాద్ మెడికల్ కళాశాలలో ఎస్‌ఆర్‌గా చేరారు. తల్లిదండ్రులతో కలిసి నిజామాబాద్ జిల్లాకేంద్రం సుభాష్‌నగర్ ఎన్జీవోస్ కాలనీలో అద్దెకు ఉంటున్నారు. అతనికి పీజీ జనరల్ మెడిసిన్‌లో కాకుండా ఈఎన్‌టీ విభాగంలో రావడంతో గతంలో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు మధుతోనే ఉంటున్నారు. రోజూ తల్లిదండ్రులతో కలిసి ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లే మధు, ఆదివారం ఉదయం 8గంటలు అయినా లేవకపోవడంతో తండ్రి అతడి గది తలుపు తట్టాడు. ఎంతకీ సమాధానం రాకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా మధు ఉరివేసుకొని విగత జీవిగా వేలాడుతూ కనిపించాడు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. మృతదేహాన్ని ప్రకాశం జిల్లా కందుకూరుకు తరలించారు.



డాక్టర్ మధు(ఫైల్)

నేడు చండూరులో మంత్రి కేటీఆర్ పర్యటన

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

చండూరు: నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. చండూరులో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్తూపం, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాలను ఆవిష్కరించడంతో పాటు రూ.3 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో జరిగే ప్రగతి సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



నల్లగొండ జిల్లా చండూరులో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

రైతాంగ పోరాట యోధురాలు కమలమ్మ కన్నుమూత

పోచమ్మమైదాన్ (వరంగల్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చెన్నబోయిన కమలమ్మ(92) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్న కమలమ్మ గత నెల రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మధ్యాహ్నం ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా, పలు పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నాడు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రత్యేక గుర్తింపు పొందారు. భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు మద్దికాయల ఓంకార్ నాయకత్వంలో భర్త అప్పన్నతో కలిసి అజ్ఞాత దళంలో చేరి, తెలంగాణ రైతాంగ పోరాటంలో భాగస్వామిగా నిలిచారు. మూడుతరాలపాటు కమ్యూనిస్టు పార్టీలో విప్లవ గేయాలు పాడిన ఆమె, వృద్ధాప్యంలోనూ గేయాలతో మైమరిపించారు.



కమలమ్మ (ఫైల్)

స్వగ్రామానికి చేరిన జవాన్ మృతదేహం

భీంపూర్: శ్రీనగర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సీఆర్పీఎఫ్ జవాన్ మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరింది. వివరాలు ఇలా.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం బేల్సరిరాంపూర్‌కు చెందిన పుర్కే సుఖదేవ్(24) సీఆర్పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తూ శుక్రవారం ఉదయం 6.15గంటల ప్రాంతంలో ఏకే 47తో గుండెపై కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు ఇంకా పెండ్లి కాలేదు. ఇతడికి తండ్రి భీంరావ్, ముగ్గురు సోదరులు, ఇద్దరు అక్కలున్నారు. ఈయన మృతదేహం స్వగ్రామమైన బేల్సరిరాంపూర్‌కు ఆదివారం మధ్యాహ్నం చేరింది. రూరల్ సీఐ శ్రీనివాస్, భీంపూర్ ఏఎస్సై లింగారెడ్డి, సర్పంచ్ జమునాబాయి, కుటుంబీకుల సమక్షంలో నాగ్‌పూర్ సీఆర్పీఎఫ్ అధికారులు మృతదేహాన్ని అప్పగించారు. గోండీ సంప్రదాయంలో అంతిమసంస్కారాలు నిర్వహించారు.



పుర్కే సుఖదేవ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

మృతుల్లో దంపతులు, ఓ బాలిక.. 17 మందికి తీవ్ర గాయాలు

తాడ్వాయి/సోన్/ఉండవెల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా 17మందికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనల్లో భూపాలపల్లి జిల్లాలో జరిగిన ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన దంపతులు, నిర్మల్ జిల్లాలో ఓ బాలిక మరణించారు. వివరాలు ఇలా.. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన సల్లూరి సత్యప్రసాద్, అతడి భార్య ఝాన్సీరాణితోపాటు సత్యప్రసాద్ స్నేహితుడు గురుబెల్లి నర్సింగరావు, అతని కుటుంబ సభ్యులు కారులో భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం మల్లూరులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వచ్చారు. అనంతరం తిరిగివెళ్తున్న క్రమంలో 163వ జాతీయ రహదారిపై తాడ్వాయి సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో సల్లూరి సత్యప్రసాద్ (60), అతడి భార్య ఝాన్సీరాణి(53) అక్కడికక్కడే మృతిచెందారు. నర్సింగరావు, ఆయన భార్య తేజేశ్వరీ, వారి పిల్లలు ఏకాంబ్రేశ్వర్, మోక్షితకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కర్ణాకర్‌రావు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను 108లో ములుగు దవాఖానకు తరలించారు. ఇదిలాఉండగా నిర్మల్ పట్టణంలోని షేక్‌సాహెబ్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం నిజామాబాద్ జిల్లా బాల్కొండ వద్ద మామిడి తోటను కౌలుకు తీసుకున్నది. వీరంతా సొంత ట్రాలీ ఆటోలో తోటకు బయలుదేరారు. కొండాపూర్ బైపాస్ నుంచి నేషనల్ హైవే రోడ్డు మీదుగా వెళ్తుండగా.. కడ్తాల్ బైపాస్ వద్ద లారీ ఆటోను ఢీకొన్నది. ఆటోలో ఉన్న సానియా(14) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో తల్మిస్, రిమ్షా, అదిన, ఫరాణాస్, షాహీన్, ఫర్రులకు తీవ్రగాయాలు కావడంతో నిర్మల్‌లోని ఏరియా దవాఖానాకు తరలించారు. ఇందులో తల్మిస్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ తరలించారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ మండలం తాండ్రపాడుకు చెందిన 15మంది కూలీలు ఆదివారం ఆటోలో జోగుళాంబ గద్వాల జిల్లాలోని బోరవెల్లి గ్రామానికి పనుల కోసం వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి వెళుతుండగా అలంపూర్ చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరి ఆటోను ఢీకొట్టింది. ఆటోలోని ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించారు.




భూపాలపల్లి జిల్లా తాడ్వాయి సమీపంలోజరిగిన ప్రమాదంలో కారులోనే సత్యప్రసాద్, ఝాన్సీరాణి మృతదేహాలు

ఏసీబీకి చిక్కిన మానుకోట ఎస్సై

లంచం తీసుకుంటూ దొరికిన కమలాకర్

మహబూబాబాద్, నమస్తేతెలంగాణ: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మానుకోట టౌన్ ఎస్సై కమలాకర్ రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్ వివరాల ప్రకారం.. మానుకోటకు చెందిన నివాస్‌యాదవ్‌పై ఎస్సై కమలాకర్ భూవివాదం కేసు నమోదు చేసి, అందులో హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌లో కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న శ్రీనివాస్ సోదరుల పేర్లు చేర్చాడు. తమ్ముళ్ల పేర్లు తొలగించాలంటే రూ.10వేల లంచం ఇవ్వాలని ఎస్సై పట్టుబట్టగా, శ్రీనివాస్ ఏసీబీని ఆశ్రయించాడు. ఆదివారం ఠాణాలో బాధితుడి నుంచి రూ.8వేల లంచం తీసుకుంటూ ఎస్సై పట్టుబడ్డాడు.



ఎస్సై కమలాకర్‌ను హైదరాబాద్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్న అధికారులు

నీ పాట మధురం..



భారత క్రికెటర్ సురేశ్ రైనా మరోసారి గాయకుడిగా మారాడు. 'యే ష్యామ్ మస్తానీ మధు హోష్ కియే జాయే'. అంటూ ప్రముఖ బాలీవుడ్ సింగర్ కిషోర్‌కుమార్ మధురగీతాల్లోని పాటను ఆలపించాడు. ఆదివారం కొలంబోలోని రెస్టారెంట్‌లో జట్టు సభ్యులకు తన గాత్రాన్ని వినిపించి ఆనందపరిచాడు.

ఆసీస్‌తో మిథాలీ సేన పోరు

వడోదర: భారత మహిళా క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. సోమవారం వడోదరలో జరుగనున్న తొలి వన్డేలో మిథాలీ సారథ్యంలోని భారత్, మెగ్ లానింగ్ నాయకత్వంలోని ఆస్ట్రేలియాపై విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతున్నది. 2017 ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓడిన ఆసీస్..ఈసారి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నది. భారత ఏ జట్టుతో జరిగిన రెండు వార్మప్ మ్యాచ్‌ల్లోనూ ఆసీస్ గెలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు దక్షిణాఫ్రికా పర్యటనను విజయవంతంగా ముగించిన మిథాలీ సేన అదే జోరు కొనసాగించేందుకు సిద్ధమైంది.

లంకను దాటితేనే..

టీమ్ఇండియాకు ఫైనల్ దారి సుగమం.. నేడు శ్రీలంకతో కీలక పోరు

సత్తా చాటేందుకు సిద్ధమైన రోహిత్.. తుది జట్టులో రాహుల్‌కు చాన్స్

ఒకవైపు బంగ్లాను ఓడించిన ఉత్సాహం..మరోవైపు లంకపై ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆరాటం..సిరీస్‌లో నిలువాలంటే గెలువక తప్పదు..కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా రోహిత్‌కు సిసలైన సవాల్..సొంతగడ్డపై శ్రీలంకను మట్టికరిపించి నిదహాస్ సిరీస్‌లో ఫైనల్ అవకాశాలను మెరుగుపరుచుకునే దిశగా టీమ్ఇండియా అడుగులు వేసేందుకు సిద్ధమైంది..ఇప్పటికే భారత్‌ను ఓడించి కసి మీద ఉన్న లంక మరోసారి తమ ఆధిపత్యాన్ని కొనసాగించి అగ్రస్థానాన్ని పదిలం చేసుకునేందుకు తహతహలాడుతున్నది..రోహిత్ కుదురుకుంటే, ధవన్ ధనాధన్ అనిపిస్తే, చహల్ మణికట్టు మాయాజాలం ప్రదర్శిస్తే భారత్‌కు తిరుగుండదు..అటు లంకలోనూ కుశాల్ జోడి మరోసారి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడేందుకు సిద్ధమైంది.



రోహిత్ | అక్షర్ | జైదేవ్ | రైనా

రాత్రి 7.00 నుంచి డీ స్పోర్ట్స్‌లో

కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో టీమ్ఇండియా శ్రీలంకపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చింది. సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో లంక చేతిలో ఓడిన భారత్..ఆ తర్వాత బంగ్లాదేశ్‌పై గెలిచి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నది. మరోవైపు శనివారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ శ్రీలంకను ఓడించి రేసులోకి రావడంతో.. మూడు జట్లు తలా ఒక్కో మ్యాచ్ గెలిచి సిరీస్‌ను రసవత్తరంగా మార్చాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరుగనున్న మ్యాచ్‌లో టీమ్ఇండియా, శ్రీలంకను ఓడిస్తే అగ్రస్థానంలోకి దూసుకెళ్లి ఫైనల్ బెర్త్‌ను కన్ఫర్మ్ చేసుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు బంగ్లా చేతిలో ఓడిన శ్రీలంక సిరీస్‌లో నిలువాలంటే భారత్‌ను ఓడించక తప్పదు. గెలుపుతో పాటు నెట్‌రన్ రేట్ కూడా కీలకమవడంతో ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారించేందుకు ఇరుజట్లు సిద్ధమయ్యాయి.

రోహిత్ నిలబడేనా ?

టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ వరుసగా విఫలమవుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఒకవైపు ధవన్ రెండు మ్యాచ్‌ల్లోనూ అర్ధసెంచరీలు (55,90) చేసి ఫాంలో ఉండగా, రోహిత్ (0,17) నిరాశపరిచాడు. ఈ ముంబైకర్ క్రీజులో కుదురుకుంటే ప్రత్యర్థికి చిక్కులు తప్పవు. కీలకమైన మ్యాచ్‌లో రోహిత్ సత్తా చాటాల్సిన అవసరం ఉన్నది. శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లో రోహిత్ వంటి హార్డ్ హిట్టర్ విఫలమవడంతో బ్యాటింగ్ భారమంతా ధవన్‌పైనే పడింది. దీంతో ఆ మ్యాచ్‌లో భారత్ 174 పరుగులే చేసి ఓటమిపాలైంది. ఒకవేళ రోహిత్ కుదురుకుంటే భారత్ సునాయసంగా రెండొందల పరుగుల మార్క్‌ను దాటగలదు. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచితేనే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి.

పిచ్, వాతావరణం

ప్రేమదాస పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. ఆకాశం మేఘావృతమై ఉండి రాత్రి వేళలో చిరుజల్లులు కురిసే అవకాశం.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్(కెప్టెన్), ధవన్, రైనా, రిషబ్/రాహుల్, మనీశ్, దినేశ్, విజయ్‌శంకర్, చహల్, సుందర్, జైదేవ్, శార్దూల్/సిరాజ్.
శ్రీలంక: తిసార పెరీరా (కెప్టెన్), గుణతిలక, మెండిస్, పెరీరా, షనక, తరంగ, ధనంజయ, జీవన్, డిసిల్వా, చమీర, ఫెర్నాండో/లక్మల్

మిడిల్‌లో రాహుల్

భారత మిడిలార్డర్ ఫరవాలేదనిపిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నది. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌పై భారీ అంచనాలు పెట్టుకోవడంతో అతడు తొలి మ్యాచ్‌లో (23) ఫరవాలేదనిపించాడు.రెండో మ్యాచ్‌లో అతడిని ఏకంగా మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దింపగా 7 పరుగులే చేసి విఫలమయ్యాడు. ఇతడిని పక్కనపెట్టి కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశాలున్నాయి. ఈ కర్ణాటక యువ బ్యాట్స్‌మన్‌కు అవకాశమిస్తే మూడో నంబర్ లేదా నాలుగో నంబర్‌లో బ్యాటింగ్ చేసే చాన్స్ ఉన్నది. సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్ నిలకడగా ఆడుతుండటం కలిసొచ్చే అంశం.

పేసర్లు కట్టడి చేస్తేనే..

అనుభవలేమితో కూడిన భారత బౌలింగ్ లైనప్ ఈ మ్యాచ్‌లో అయినా పూర్తి స్థాయిలో సత్తాచాటాల్సిందే. స్పిన్ బౌలర్లు చహల్, వాషింగ్టన్ సుందర్ ఆకట్టుకుంటున్నప్పటికీ గత రెండు మ్యాచ్‌ల్లోనూ టీమ్ఇండియా పేస్ బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఐపీఎల్ కరోడ్‌పతి జైదేవ్ రెండు మ్యాచుల్లో కలిపి నాలుగు వికెట్లు (1/35, 3/38) పడగొట్టినా పరుగులు నియంత్రించడంలో విఫలమవుతున్నాడు. శార్దూల్ ఠాకూర్ తొలి మ్యాచ్‌లో (0/42) గాడితప్పినా, రెండో మ్యాచ్‌లో (1/25) ఫరవాలేదనిపించాడు. అయితే ఈ ఇద్దరు పేసర్లలో ఒకరి స్థానంలో సిరాజ్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. ఇక ఫాంలో ఉన్న చహల్ మరోసారి లంకపై తన మార్క్ బౌలింగ్ చూపెడితే భారత్‌కు గెలుపు మరింత సులువవుతుంది. గత మ్యాచ్ హీరో ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్ మరోసారి జోరు చూపించాల్సిందే.

లంక కుశాల్‌మే..

తొలి మ్యాచ్‌లో భారత్‌పై గెలిచిన ఆతిథ్య శ్రీలంక..మరోసారి ఆధిపత్యం చూపించాలని తహతహలాడుతున్నది. సొంతగడ్డపై లంక బ్యాట్స్‌మన్ ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. ముఖ్యంగా కుశాల్ మెండిస్ (57),



కుశాల్ | మెండిస్

కుశాల్ పెరీరా (66,74) సూపర్ ఫాంలో ఉండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. ఇక స్లో ఓవర్ రేట్ కారణంగా రెండు మ్యాచ్‌ల నిషేధం ఎదుర్కొన్న కెప్టెన్ చండిమల్ ఈ మ్యాచ్‌కు దూరమవడంతో తిశార జట్టును నడిపించనున్నాడు. ధనంజయ డిసిల్వాను తుదిజట్టులోకి తీసుకోనున్నారు. సొంత పిచ్‌లపై లంక బ్యాట్స్‌మెన్ జోరుకు భారత బౌలర్లు ఎంత వరకు అడ్డుకట్ట వేయగలరనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉన్నది. లంక బౌ లర్లు ప్రత్యర్థులపై పెద్దగా ప్రభావం చూపలేకపోతుండడం భారత్ బ్యాట్స్‌మెన్‌కు కలిసొచ్చే అంశం.



ఆ ఫోన్ నా దగ్గర లేకుంటే షమీ విడాకులిచ్చేవాడు

హసీన్ జహా

కోల్‌కతా: భారత మైటీ పేసర్ మహ్మద్ షమీపై రోజుకో కొత్త ఆరోపణతో అతని భార్య హసీన్ జహా సంచలనం సృష్టిస్తున్నది. అతను తప్పు చేసినట్లు ధృవీకరించే సాక్ష్యాలతో కూడిన సెల్‌ఫోన్ నా దగ్గర లేకుంటే అతను నాకు విడాకులు ఇచ్చి ఉండేవాడంటూ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ హసీన్ మరో బాంబు పేల్చింది. షమీతో పాటు అతని సోదరుడు, సోదరి, తల్లి తనను తీవ్రంగా హింసించారని, చంపేందుకు ప్రయత్నించారని, షమీ సోదరుడు అత్యాచారయత్నం విషయంలోనూ సాక్ష్యాలతో బయటపెట్టినా మీడియా ఈ విషయంలో తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. 'షమీ చేస్తున్న తప్పులను అతను తెలుసుకుని సరిదిద్దుకునేలా నేను చాలా ప్రయత్నాలు చేసాను. ఒకవేళ అతని ఫోన్ నా దగ్గర లేకపోయుంటే అతను ఉత్తరప్రదేశ్ పారిపోయేవాడు. ఈ సరికి నాకు విడాకులు కూడా ఇచ్చేవాడు' అని అన్నది. షమీతో వివాహబంధం నిలుపుకునేందుకు ఎంతో ప్రయత్నించానని తెలిపింది. కానీ అతను నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పారిపోయాడు. ఈ విషయంలో నాకు ఎవరూ సహాయం చేయడం లేదని, ఒకవేళ షమీ తిరిగి నాతో ఉండాలని కోరుకుని తిరిగివస్తే అంగీకరిస్తానని చెప్పింది.ఇప్పటికే అతనిపై కోల్‌కతా పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయగా.. బీసీసీఐ వార్షిక కాంట్రాక్టును నిలిపేసిన సంగతి తెలిసిందే. తాజాగా ముంబైలో బీసీసీఐని కలిసి అతనిపై ఫిర్యాదు చేస్తానని కూడా హసీన్ చెప్పింది. కాగా, ఈ వివాదంతో షమీ ఐపీఎల్‌లో ఆడేది కూడా అనుమానంలో పడింది. ఢిల్లీ డేర్ డెవిల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షమీపై ఆరోపణల విషయంలో సదరు ఫ్రాంచైజీ ..బీసీసీఐని న్యాయసలహా కోరాలని ఆశిస్తున్నది.

విచారణ జరుగాలనే కోరుకుంటున్నా: షమి

వరుసగా తనపై భార్య హసీన్ జహా చేస్తున్న ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మహ్మద్ షమీ ఎట్టకేలకు మీడియా ముందుకు వచ్చాడు. తనపై వస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదని, తన భార్యను ఎవరో తప్పుదారి పట్టిస్తున్నారని భావిస్తున్నట్లు చెప్పాడు. 'నాపై వస్తున్న ఆరోపణలపై విచారణకు సిద్ధంగా ఉన్నాను. రోజురోజుకూ ఈ విషయంలో జనం మమ్మల్ని చూసి నవ్వుకునేలా చేస్తున్నాయి. చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని భావిస్తున్నా. నా కూతురి కోసం మేమిద్దరం కలిసుండడమే సరైనది. నా కుటుంబంతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. ఈ విషయంలో నా భార్యను తప్పుబట్టను. ఆమెను ఎవరో ప్రభావితం చేసినట్లుగా అనిపిస్తున్నది. ఇప్పటికే రెండు కుటుంబాలు ఈ వివాదం పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. త్వరలోనే వివాదం పరిష్కారమవుతుంది' అని షమీ అన్నాడు.

పట్టు బిగించిన సఫారీలు

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 180/5

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో రెండో టెస్ట్‌పై ఆతిథ్య దక్షిణాఫ్రికా పట్టు బిగించింది. పిచ్ పరిస్థితులను తమ కు అనుకూలంగా మలుచుకుంటూ సఫారీ స్పీడ్‌స్టర్ రబాడ (3/38) మరోమారు ఆసీస్‌ను దెబ్బతీశాడు. రబాడ పేస్ ధాటికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఉస్మాన్ ఖవాజ(75) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నా..మిగతా అందరూ విఫలమయ్యారు. 86 పరుగులకే వార్నర్ (13), బాన్‌క్రాఫ్ట్(24), స్మిత్(11), షాన్ మార్ష్(1) వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను ఖవాజ ఆదుకున్నాడు. ఐదో వికెట్‌కు మిచెల్ మార్ష్(39 నాటౌట్)తో కలిసి ఖవాజ 87 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. షాన్ మార్ష్‌తో పాటు టిమ్ పెయిన్(5) క్రీజులో ఉన్నారు. చేతిలో 5 వికెట్లు ఉన్న ఆసీస్ 41 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నది. అంతకుముందు 263/7 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 118.4 ఓవర్లలో 382 పరుగులకు ఆలౌటైంది. డివిలీయర్స్(126 నాటౌట్) అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. కమ్మిన్స్(3/79)కు మూడు వికెట్లు దక్కగా, హాజిల్‌వుడ్, మిచెల్ మార్ష్ రెండేసి వికెట్లు తీశారు.



రబాడ

రబాడను అభినందిస్తున్న సహచరులు

చండిమల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం

కొలంబో: స్లో ఓవర్ రేట్ కారణంగా శ్రీలంక కెప్టెన్ దినేశ్ చండిమల్‌పై ఐసీసీ రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక నిర్ణీత సమయంలో బౌలింగ్ కోటాను పూర్తి చేయలేదు. నాలుగు ఓవర్లు వెనుకబడి ఉండటంతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.5.2 ప్రకారం కెప్టెన్ దినేశ్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించినట్టు ఐసీసీ ఎలైట్ ప్యానెల్ సభ్యుడు మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ తెలిపాడు. దీంతో దినేశ్ భారత్(మార్చి 12), బంగ్లాదేశ్ (మార్చి 16)తో జరుగబోయే మ్యాచ్‌లకు దూరమయ్యాడు. లంక జట్టు సభ్యులకు ఒక్కొక్కరికీ మ్యాచ్ ఫీజులో 60 శాతం కోతపడింది. బంగ్లాదేశ్ కూడా ఒక ఓవర్‌ను ఆలస్యంగా వేయడంతో కెప్టెన్ మహ్మదుల్లా మ్యాచ్ ఫీజులో 20 శాతం, ఒక్కో ఆటగాడికి 10 శాతం కోత విధించారు.

డ్రాతో ముగింపు

3-1తో సిరీస్ భారత మహిళల సొంతం

సియోల్: కొరియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత మహిళల హాకీ జట్టు 3-1తో దక్కించుకుంది. ఆదివారం ఇరు జట్ల మధ్య జరిగిన ఆఖరి మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. టీమ్ఇండియా తరపున వందన కటారియా(48ని) గోల్ చేయగా, కొరియా జట్టులో బోమి కిమ్(50ని) ఏకైక గోల్ కొట్టింది. మ్యాచ్ తొలి క్వార్టర్‌లో గోల్ కోసం రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అయితే డిఫెన్స్ పటిష్ఠంగా ఉండటంతో ఎలాంటి గోల్ లేకుండానే ముగిసింది. రెండో క్వార్టర్‌లో కొరియాకు దక్కిన రెండు పెనాల్టీ కార్నర్లను భారత గోల్‌కీపర్ రజనీ అడ్డుగోడలా నిలువడంతో సాధ్యపడలేదు. మ్యాచ్ 41వ నిమిషంలో భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా దాన్ని గోల్‌గా మలువలేకపోయింది. ఆఖరిదైన నాలుగో క్వార్టర్ 48వ నిమిషంలో కెప్టెన్ రాణి రాంపాల్ అందించిన పాస్‌ను వందన గోల్ చేయడంతో టీమ్ఇండియా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండు నిమిషాల వ్యవధిలోనే బోమి కిమ్ చేసిన ఫీల్డ్ గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. ఆఖరి పది నిమిషాల్లో రెండు జట్లు పరస్పరం దాడులు చేసుకున్నా గోల్ నమోదు కాలేదు.



అఖిల్ 'పసిడి' గురి



న్యూఢిల్లీ: షూటింగ్ ప్రపంచకప్‌లో భారత పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఆకాశమే హద్దు అన్న రీతిలో మన షూటర్లు పతకాల పంట పండిస్తున్నారు. మెక్సికో వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఇప్పటికే షాహజర్ రిజ్వి, మను భాకర్, మెహులీ ఘోష్, అంజుమ్ మౌద్గిల్ పసిడి పతకాలతో సత్తాచాటాగా, తాజాగా అఖిల్ షెరాన్ స్వర్ణంతో మెరిశాడు. పురుషుల 50మీటర్ల రైఫిల్-3 పొజిషన్‌లో పసిడి పతకాన్ని ముద్దాడాడు. తద్వారా షూటింగ్ ప్రపంచకప్ అరంగేట్రంలోనే పతకం గెలిచిన నాలుగో పిన్నవయస్సు భారత షూటర్‌గా అఖిల్ రికార్డుల్లోకెక్కాడు. తాజా ప్రదర్శనతో భారత్ తొలిసారి పతకాల పట్టికలో టాప్‌లో నిలిచింది. పోటీ విషయానికొస్తే అఖిల్ 455.6 పాయింట్లతో స్వర్ణం కైవసం చేసుకోగా, బెర్నార్డ్ పికిల్(ఆస్ట్రియా, 452), ఇస్త్వాన్ పెనీ(హంగరీ, 442.3) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పసిడి పతక సాధనలో హంగరీ రైఫిల్ దిగ్గజం పీటర్ సిడీ, రియో ఒలింపిక్స్ కాంస్య విజేత అలక్సిస్ రెనాల్డ్(ఫ్రాన్స్)లను వెనుకకు నెట్టేసి యువ షూటర్ అఖిల్ అదుర్స్ అనిపించాడు. వయస్సులో చిన్నవాడు అయినా అనుభవజ్ఞునిలా దీటైన పోటీనిస్తూ అందరిని ఆశ్చర్యపరిచాడు. అంతకుముందు జరిగిన అర్హత రౌండ్‌లో 1174 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచిన అఖిల్..ప్రధాన రౌండ్‌లో ప్రత్యర్థులను కంగుతినిపించాడు. మరోవైపు సంజీవ్ రాజ్‌పుత్, స్వప్నిల్ కుశాలే మెయిన్ రౌండ్‌కు అర్హత సాధించినా ఆకట్టుకోలేకపోయారు.

జాతీయ రెజ్లింగ్ టోర్నీలకు ఆధార్

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ టోర్నీల్లో పోటీపడే ఆటగాళ్లకు ఆధార్‌ను తప్పనిసరి చేశారు. జాతీయస్థాయిలో జరిగే అన్ని సీనియర్, జూనియర్, సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాలకు ఇది వర్తిస్తుంది. వయస్సు నిబంధనలను ఉల్లంఘిస్తూ రెజ్లర్లు మోసాలకు పాల్పడుతున్నారన్న కారణంతోనే భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) తాజాగా ఈ నిర్ణయానికి వచ్చింది. దీని ద్వారా వయస్సుతో పాటు ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది సులువుగా తెలుస్తుందని డబ్ల్యూఎఫ్ఐ ఒక ప్రకటనలో పేర్కొంది. 'వయస్సు విషయంలో మోసానికి పాల్పడుతూ ఫోర్జరీ డాక్యుమెంట్లతో టోర్నీల్లో పాల్గొనే రెజ్లర్లకు ఇది శరాఘాతంగా మారుతుంది. దీంతో పాటు ఎవరైనా వేరే రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాలంటే..తమ సొంత రాష్ట్రం నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం(ఎన్‌వోసీ) తీసుకురావాల్సి ఉంటుంది' అని డబ్ల్యూఎఫ్ఐ కార్యదర్శి వినోద్ తోమర్ అన్నాడు.

పలువురు దేశాధ్యక్షులతో ప్రధాని మోదీ భేటీ

వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలపై ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 11: ఢిల్లీలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ సౌర కూటమి వ్యవస్థాపక సదస్సుకు హాజరైన పలువురు దేశాధ్యక్షులు, నాయకులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, బంగ్లాదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్‌లతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అలాగే యునైటెడ్ అరబ్ ఎమరైట్స్, సీషెల్స్, కామరూన్, గయానా, ఫిజి, డిజిబౌటి, సోమాలియా, మాలి, రువాండా దేశాలకు చెందిన నాయకులతోనూ చర్చలు జరిపారు. ప్రధానంగా వాణిజ్యం, అభివృద్ధిలో సహకారం, పెట్టుబడులు, ఆహార భద్రత, ఉగ్రవాదం, పునరుత్పాదక ఇంధనం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రావేశ్‌కుమార్ ట్వీట్ చేస్తూ 'ప్రధాని మోదీ పలువురు దేశాధ్యక్షులు, నాయకులతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు' అని పేర్కొన్నారు.



ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ సదస్సులో వివిధ దేశాల నాయకులతో ప్రధాని నరేంద్రమోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్

ఇరాన్ విమాన ప్రమాదంలో 11 మంది మృతి

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి ఇస్తాంబుల్ వెళ్లున్న ఓ ప్రైవేట్ టర్కిష్ విమానం ఇరాన్‌లో కుప్పకూలింది. ఇరాన్‌లోని పర్వత ప్రాంతంలో ఆదివారం జరిగిన ఘటనలో మొత్తం 11 మంది మరణించారు. సహాయక చర్యలు చేపట్టేందుకు ఘటనస్థలికి రెస్క్యూ టీమ్స్ బయలుదేరినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఇర్నా తెలిపింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు 370 కిలో మీటర్ల దూరంలోని షార్-ఏ-కోర్డ్ ప్రాంతంలో ఓ పర్వతాన్ని ఢీకొట్టి మంటలు అంటుకుని కుప్పకూలిపోయిందని ఇరాన్ అత్యవసర సంస్థ ప్రతినిధి మొజ్తాబా ఖాలేదీ తెలిపారు.

మంటలకు ఆహుతైన ఆరుగురు విద్యార్థులు

అడవిలో ట్రెక్కింగ్‌కు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న 36 మంది ■ 12 మందికి కాలిన గాయాలు

బాధితులను రక్షించేందుకు రంగంలోకి దిగిన వాయు సేన ■ తమిళనాడులోని కురుగుమలై అటవీ ప్రాంతంలో ఘటన


కురుగుమలై అడవుల్లో మంటలు

చెన్నై, మార్చి 11:


సరదాగా అడవిలో పర్వతారోహణ చేద్దామని వచ్చిన విద్యార్థులు అనుకోని రీతిలో మంటల్లో చిక్కుకున్నారు. స్నేహితులతో కలిసి సాహసం చేద్దామనుకున్న వారికి ఒక్కసారిగా చెలరేగిన మంటలు అశనిపాతంలా పరిణమించాయి. ఊహించని రీతిలో ఎదురైన ఈ విపత్తులో ఆరుగురు మృతి చెందగా, 12 మందికి గాయాలయ్యాయి. విద్యార్థులను రక్షించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ వైమానిక దళాన్ని రంగంలోకి దించింది. ఈ ఘటన ఆదివారం తమిళనాడులోని థేని జిల్లా కురుగుమలై అడవుల్లో జరిగింది. కేరళలోని సూర్యనెల్లి, మున్నార్ వైపు నుంచి 36 మంది విద్యార్థులు ట్రెక్కింగ్‌కు వచ్చారు. వీరిలో ఎక్కువగా విద్యార్థినులు ఉన్నట్టు తెలుస్తున్నది. వారు తిరుగుతున్న ప్రాంతంలోనే సాయంకాలం సమయంలో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న ఓ విద్యార్థి తన తండ్రికి మొబైల్ ద్వారా సమాచారమివ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. 'వేసవి ప్రారంభమైనందున పశ్చిమ కనుమల్లోని అటవీప్రాంతం ఎండిపోతుంది. ఏపుగా పెరిగిన లెమన్ గ్రాస్‌కు త్వరగా మంటలు అంటుకుంటుంది. అందుకని కనుమ వెంట ట్రెక్కింగ్ చేసేందుకు ఎవర్నీ అనుమతించడం లేదు. మున్నార్ వైపున వాహనాలను పార్కింగ్ చేసిన విద్యార్థులు థేని వైపునకు ట్రెక్కింగ్ చేయడం ప్రారంభించారు. ఇంతలో మంటలు చెలరేగడంతో వారు చిక్కుకునిపోయారు' అని తమిళనాడు అటవీ శాఖ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ హెచ్ బసవరాజు తెలిపారు. విద్యార్థులు కోయంబత్తూరు, ఈరోడ్ ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించారు. మంటల్లో చిక్కుకున్న వారికి ప్రథమ చికిత్స అందించేందుకు వైద్య బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు.

రంగంలోకి వైమానిక దళం

అడవిలో చిక్కుకున్న విద్యార్థులను రక్షించేందుకు తమిళనాడు సీఎం పళనిస్వామి చేసిన విజ్ఞప్తి మేరకు భారత వైమానికి దళాన్ని రంగంలోకి దింపినట్లు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. విద్యార్థులకు సహాయం అందించేందుకు సూలూరు నుంచి ఎంఐ-17 హెలీకాప్టర్‌ను పంపినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా, అగ్నిమాపక దళాలు ఇప్పటికే అటవీప్రాంతానికి చేరుకుని మంటల్ని ఆర్పుతున్నాయి.

3డీలో సౌరవిస్ఫోటనాలు

మూడు ఉపగ్రహాల సాయంతో రూపొందించిన నాసా



వాషింగ్టన్, మార్చి 11: సూర్యుడిపై సంభవించే విస్ఫోటనాలను, వాటి ఫలితంగా వెలువడే తరంగాలను నాసా శాస్త్రవేత్తలు 3డీ మ్యాపింగ్ చేశారు. ఆ తరంగాలను కంప్యూటర్‌లో పునఃసృష్టించగలిగారు. ఇలాంటి విస్ఫోటనాలతో భూ వాతావరణం, అంతరిక్షంలోని వ్యోమగాములు, ఉపగ్రహాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఎలాంటి నష్టం కలుగుతుందో అంచనా వేయడానికి 3డీ మ్యాప్‌లు ఉపయోగపడుతాయని నాసా పేర్కొన్నది. అమెరికాలోని జార్జ్ మాసన్, జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీలకు చెందిన శాస్త్రవేత్తల బృందం మూడు ఉపగ్రహాల నుంచి సేకరించిన సమాచారంతో ఈ 3డీ మ్యాప్‌లను రూపొందించారు. యురోపియన్ స్పేస్ ఏజెన్సీ, నాసా సంయుక్తంగా ప్రయోగించిన సోలార్ అండ్ హెలియోస్ఫెరిక్ అబ్జర్వేటరీ (ఎస్‌వోహెచ్‌వో), నాసాకు చెందిన రెండు సోలార్ టెర్రెస్ట్రియల్ రిలేషన్స్ అబ్జర్వేటరీ (ఎస్‌టీఈఆర్‌ఈవో)లను సూర్యుడి వైపు నిర్ణీత దిశలో ఉంచి భారీ పేలుళ్లు జరిగి, శక్తివంతమైన తరంగాలు వెలువడినప్పుడు సమాచారం సేకరించారు. ఈ సమాచారం ఆధారంగా వారు కంప్యూటర్‌లో కృత్రిమ విస్ఫోటనాలను సృష్టించగలిగారు. విస్ఫోటనాల పరిమాణాన్ని బట్టి అవి వెలువరించే తరంగాల తీవ్రత, భూమి వరకు చేరే అవకాశం వంటివి అంచనా వేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

నాన్న హంతకుల్ని క్షమించాం: రాహుల్



సింగపూర్, మార్చి 11: తమ తండ్రి రాజీవ్ గాంధీ హంతకులను తాను, తన సోదరి ప్రియాంక గాంధీ పూర్తిగా క్షమించేశామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. సింగపూర్‌లోని ఐఐఎం పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, తన నానమ్మ ఇందిర, తండ్రి రాజీవ్ తీసుకున్న నిర్ణయాలకు మూల్యం చెల్లించక తప్పదని తమ కుటుంబానికి ముందే తెలుసునన్నారు. 'మా నానమ్మ తనను చంపేస్తారని ముందే నాతో చెప్పారు. మా నాన్న చనిపోతున్నారని నేను నాన్నతో ముందే అన్నాను' అని రాహుల్ గుర్తు చేశారు. ఆయన ప్రసంగం వీడియో కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ ఖాతాలో షేర్ అవుతున్నది. 'మా తండ్రి హత్య తర్వాత మేం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. కొన్నేండ్లపాటు చాలా కోపంతో ఉన్నాం. కానీ మేం హంతకులను క్షమించాం' అని రాహుల్ తలిపారు. 1991 మే 21న మాజీ ప్రధాని రాజీవ్‌ను ఎల్టీటీఈ ఆత్మాహుతి దళ సభ్యురాలు హతమార్చిన సంగతి తెలిసిందే. ఎల్టీటీఈ వ్యవస్థాపకుడు ప్రభాకరన్ మృతదేహాన్ని టీవీ చానెల్‌లో చూసినప్పుడు ఆయన్ను ఎందుకు ఇలా అవమానిస్తున్నారు, ఆయన భార్యాపిల్లలు అనాథలయ్యారు భావం కలిగిందన్నారు. తన సోదరి ప్రియాంకకు కూడా అదే అభిప్రాయం వచ్చిందన్నారు. వ్యక్తులను ద్వేషించడం కష్ట సాధ్యమన్నారు. అంతకుముందు 1984లో తన నానమ్మ ఇందిరాగాంధీ హత్యకు ముందు ఆమె హంతకులతోనే బ్యాడ్మింటన్ ఆడేవాడినని గుర్తు చేసుకున్నారు. తన నానమ్మ మృతి చెందే నాటికి 14 ఏండ్ల వయస్కుడినన్న రాహుల్.. నాటి నుంచి రోజంతా 15 మంది వ్యక్తిగత భద్రతా సిబ్బంది మధ్య గడుపుతున్నానన్నారు.

గ్రామీణ డాక్ సేవక్ ఖాళీలు 1058

- పదోతరగతి ఉత్తీర్ణులకు అవకాశం
- అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపిక
- పోస్టల్ శాఖ పరిధిలో కొలువు
- చివరితేదీ ఏప్రిల్ 9

తెలంగాణ పోస్టల్ సర్కిల్ పరిధిలో గ్రామీణ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- **పోస్టు:** గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్ బీపీఎం, జీడీఎస్ ఎంసీ)
- **జీడీఎస్ బీపీఎం పేస్కేల్:** రూ. 2745 – 50 – 4245
- **జీడీఎస్ ఎంసీ పేస్కేల్:** రూ. 2295 – 50 – 4245/3695
- **జీడీఎస్ ఎండీ పేస్కేల్:** రూ. 2295 – 45 – 4165
- **జీడీఎస్ ప్యాకర్ పేస్కేల్:** రూ. 3635 – 65 – 5585

నోట్: పేస్కేల్స్‌లో ఆయా ఏరియాలను బట్టి మార్పులు ఉన్నాయి. వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

- మొత్తం ఖాళీల సంఖ్య – 1058. వీటిలో జనరల్ – 559, ఓబీసీ – 247, పీహెచ్ –హెచ్‌హెచ్ – 14, పీహెచ్‌సీ – ఓహెచ్ – 15, ఎస్సీ – 133, ఎస్టీ – 76 ఉన్నాయి.
- ఈ పోస్టులన్నీ రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల పరిధిలో ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **వయస్సు:** 2018, మార్చి 9 నాటికి 18 – 40 ఏండ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేండ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.
- **విద్యార్హత:** ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి పదోతరగతి ఉత్తీర్ణత. అదనపు అర్హతలను పరిగణలోకి తీసుకోరు. పదోతరగతి పరీక్షలను సప్లమెంటరీలో (రెండో ప్రయత్నంలో) పాసైన వారి కంటే మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **కంప్యూటర్ నాలెడ్జ్:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి కనీసం 60 రోజులపాటు కంప్యూటర్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలపై శిక్షణ తీసుకొన్న సర్టిఫికెట్ ఉండాలి లేదా ఇంటర్ లేదా ఉన్నత చదువుల్లో కంప్యూటర్ ఒక సబ్జెక్టుగా చదివి ఉన్నవారికి ప్రత్యేక సర్టిఫికెట్ అవసరం లేదు.
- **నివాసం:** జీడీఎస్ – బీపీఎం తప్పనిసరిగా ఎంపికైన బ్రాంచి పోస్ట్ ఆఫీస్ ఉన్న గ్రామంలో నివాసం ఉండాలి.



- **ఎంపిక విధానం:** పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

నోట్: నెలలోగా నివాసం ఉంటామని డిక్లరేషన్ ఇవ్వాలి.ఎంపికైన అభ్యర్థులు సెక్యూరిటీ బాండ్ కింద రూ, 25వేలు/10 వేలు బాండ్‌ను సమర్పించాలి.

- దరఖాస్తు సమయంలో పదోతరగతి సర్టిఫికెట్, కంప్యూటర్ సర్టిఫికెట్, కమ్యూనిటీ సర్టిఫికెట్, పీహెచ్‌సీ సర్టిఫికెట్ (ఉన్నవారు), ఫొటో, సంతకాన్ని ఆన్‌లైన్‌లో జేపీజీ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 9
- **ఫీజు:** ఓసీ/ఓబీసీ పురుష అభ్యర్థులకు రూ. 100/–
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఎటువంటి ఫీజు లేదు.

వివరాల కోసం Help Desk number for Telangana Circle : 040–23463613. All queries of candidates may be mailed to gdstlg2017@gmail.com, dopgdsenquiry@gmail.com

- **వెబ్‌సైట్:** https://indiapost.gov.in or http://appost.in/gdsonline

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్ఈఆర్‌లో పీహెచ్‌డీ

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఐఐఎస్ఈఆర్ అనేది కేంద్రమానవ వనరుల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న స్వతంత్ర సంస్థ.

ప్రోగ్రామ్స్:

- ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీ
- **సబ్జెక్టులు:** బయాలజీ,కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్
- **అర్హతలు:** ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ – కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. బ్యాచిలర్ డిగ్రీలో బయాలజికల్/ కెమికల్, ఫిజికల్, మ్యాథమెటికల్, స్టాటిస్టిక్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ సంబంధిత సబ్జెక్టులు చదివి ఉండాలి. వీటితోపాటు జేజీఈఈబీఐఎల్/జామ్–బీటీ/జామ్ – సీవై లేదా జామ్ – ఎంఎస్/జామ్ – పీహెచ్ లేదా ఎస్ఈఆర్‌టీవీఎం 2018.
- పీహెచ్‌డీ – కనీసం 60 శాతం మార్కులతో పీజీలో బయాలజికల్/కెమికల్ లేదా ఫిజికల్ లేదా మ్యాథమెటికల్ లేదా బయోఇన్ఫర్మాటిక్స్/ అగ్రికల్చరల్ సైన్సెస్ లేదా వెటర్నరీ సైన్సెస్, మెటీరియల్స్ సైన్సెస్, /స్టాటిస్టిక్స్ లేదా ఇంజినీరింగ్ లేదా టెక్నాలజీ సంబంధిత సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- వీటితోపాటు సీఎస్ఐఆర్– యూజీసీ – జేఆర్ఎఫ్/డీబీటీ –జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ – జేఆర్ఎఫ్ లేదా గేట్ (ఆగస్టు 2018 వరకు వ్యాలిడిటీ కలిగి ఉండాలి)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ – ఏప్రిల్ 2, పీహెచ్‌డీ – ఏప్రిల్ 30.
- **వెబ్‌సైట్:** www.iisertvm.ac.in

ప్రాజెక్టు సైంటిస్టు పోస్టులు

తమిళ నాడు (చెన్నై)లోని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ అండ్ మెరైన్ ఏరియా మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టరేట్ (ఐసీఎంఏఎం-పీడీ) ఖాళీగా ఉన్న ప్రాజెక్టు సైంటిస్ట్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ పరిధిలో ఐసీఎంఏఎం-పీడీ పనిచేస్తుంది. దీన్ని 1998లో స్థాపించారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 62 (ప్రాజెక్టు సైంటిస్ట్ డీ–1, ప్రాజెక్టు సైంటిస్ట్ సీ–17, ప్రాజెక్టు సైంటిస్ట్ బీ–33, టెక్నికల్ అసిస్టెంట్–3, ఫీల్డ్ అసిస్టెంట్–8)
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, పదోతరగతి/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు. పోస్టులను బట్టి వేర్వేరుగా ఉన్నాయి.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 21
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** ww.icmam.gov.in

ఎస్ఈఆర్‌సీలో అసిస్టెంట్లు

చెన్నైలోని సీఎస్ఐఆర్- స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ సెంటర్ (ఎస్ఈఆర్‌సీ) ఖాళీగా ఉన్న సీనియర్/టెక్నికల్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 5 (టెక్నికల్ అసిస్టెంట్–2, సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్–3)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా డిప్లొమా ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 4
- **వెబ్‌సైట్:**www.serc.rec.in

డీఆర్‌డీవోలో జేఆర్ఎఫ్

ఉత్తరాఖండ్‌లో ఉన్న డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయో ఎనర్జీ రిసెర్చ్ (డీఐబీఈఆర్)లో ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పరిధిలో పనిచేస్తుంది.

- **మొత్తం పోస్టులు:** 12



- **జేఆర్ఎఫ్:** 12 ఖాళీలు (కెమిస్ట్రీ–1, బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ–3, బాటనీ/లైఫ్ సైన్సెస్–2, ఫార్మకాలజీ–1, అగ్రికల్చర్ సైన్స్–5)
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ/పీజీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. నెట్, గేట్, జీప్యాట్‌లో అర్హత సాధించాలి. బీఈ/బీటెక్+ ఎంఈ/ఎంటెక్‌లో 60 శాతం మార్కులతోపాటు నెట్, గేట్, జీప్యాట్‌లో అర్హత సాధించాలి.
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు.
- **స్టయిఫండ్:** రూ. 25,000/–
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **చివరి తేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తులను పంపించాలి. పూర్తి వివరాలకు మార్చి 10–16న వెలువడిన ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడగలరు.
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

డ్యూయల్ డిగ్రీ

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో డ్యూయల్ డిగ్రీ, ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

2018- 19 విద్యాసంవత్సరానికి ఈ ప్రవేశాలు.

- ఎంటెక్/ఎంటెక్ + పీహెచ్‌డీ (డ్యూయల్ ప్రోగ్రామ్), పీహెచ్‌డీ
- పై రెండు కోర్సులకు దరఖాస్తులు మార్చి 20 నుంచి ఏప్రిల్ 11 మధ్య ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.
- **ఎంఫిల్:** ఈ కోర్సుకు ఏప్రిల్ 2 నుంచి మే 7 మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఎమ్మెస్సీ – పీహెచ్‌డీ (డ్యూయల్ డిగ్రీ) ఇన్ ఇంజినీరింగ్: ఈ కోర్సుకు ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 17 మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** http://www.iitb.ac.in

జేఎన్‌యూలో 83 ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 83
- ఈ పోస్టుల్లో బ్యాక్‌లాగ్ (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీహెచ్‌సీ) విభాగంలో 47 ఖాళీలు ఉన్నాయి.
- ప్రొఫెసర్–14 పోస్టులు (ఎస్సీ–6, ఎస్టీ–6, పీహెచ్‌సీ–2)
- అసోసియేట్ ప్రొఫెసర్–30 పోస్టులు (ఎస్సీ–18, ఎస్టీ–12)
- అసిస్టెంట్ ప్రొఫెసర్–3 పోస్టులు
- బ్యాక్‌లాగ్ జనరల్ కేటగిరీలో 36 ఖాళీలు
- ప్రొఫెసర్–13 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్–22, అసిస్టెంట్ ప్రొఫెసర్–1
- **పే స్కేల్:** రూ. 37,400–67,000, అదనంగా అకడమిక్ గ్రేడ్ పే అసోసియేట్ ప్రొఫెసర్ రూ.9,000, ప్రొఫెసర్ రూ. 10,000/–, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూ. 15,600–39,100+అకడమిక్ గ్రేడ్ పే రూ. 6,000/–



- **అర్హతలు:** మాస్టర్ డిగ్రీ లేదా ఎమ్మెస్సీ, ఎంఏ, ఎల్ఎల్ఎం, ఎంబీబీఎస్+ఎండీ, బీవీఎస్సీ+ఎంవీఎస్సీ, బీఈ/బీటెక్‌తోపాటు ఎంటెక్‌లో ఉత్తీర్ణత. సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ లేదా నెట్/స్లెట్, యూజీసీ/సీఎస్ఐఆర్ నెట్‌లో అర్హత సాధించాలి. సంబంధిత రిసెర్చ్/టీచింగ్ విభాగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక :** రాతపరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో
- **చివరి తేది :** మే 8
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in